www.prajasakti.com

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 3 No | విజయవాడ, గురువారం 03 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs.

బ్యాంకుల విలీనానికి ఆమోదం

- ఒకే చట్రం కిందకు విజయ బ్యాంక్, దేనా బ్యాంక్, బిఒబి

12

దళిత, మహిళా సాధికారతే దేశ భవిష్యత్తు

రాజ్‌మోహన్ గాంధీ



సమకాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులు గమనిస్తుంటే దళిత, మహిళా సాధికారతతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందన్న సంకేతాలు బలంగా వ్యక్తమౌతున్నాయని మహాత్మాగాంధీ మనుమడు, ప్రముఖ జీవిత చరిత్రకారుడు రాజ్‌మోహన్ గాంధీ అన్నారు. అమరావతి పుస్తకమహోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడ విచ్చేసిన సందర్భంగా ఆయనతో ప్రత్యేక సంభాషణ 'జీవన'లో...

ఉత్తరప్రదేశ్‌లో ఆవు పన్ను



లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో "ఆవుల సంరక్షణ" పేరుతో పన్నులు వసూలు చేసేందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సిద్ధమైంది. ప్రధానంగా ఎక్సైజ్, ఇతర శాఖల పరిధిలోకి వచ్చే పలు ఉత్పత్తులపై ఈ పన్ను విధించను న్నది. రాష్ట్రంలో ఆవులు విచ్చలవిడిగా సంచరించడాన్ని నిరసిస్తూ దాదాపు వారం రోజులు ఆందోళనలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ ఆల్కహాల్‌తో పాటు ఇతర ఎక్సైజ్ సంబంధిత అంశాలపై 0.5 శాతం పన్ను విధించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఏజెన్సీలు వసూలు చేసే టోల్‌పై కూడా సెస్సు వసూలు చేయాలని కూడా నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మండి పరిషద్‌ల నుండి వసూలు చేస్తున్న ఒక శాతం సెస్సును రెట్టింపు చేసింది. దీనిపై ప్రభుత్వ వర్గాలు వివరణ ఇస్తూ రాష్ట్రంలోని గ్రామాల్లో విచ్చల మిగతా 9లో

ప్రకంపనలు

రాఫెల్ బాగోతంపై జెపిసికి లోక్‌సభలో విపక్షం పట్టు

గొంతుకలిపిన శివసేన, బిజెడి

'ఆ' ఆడియో టేపులు వినిపించండి :రాహుల్ డిమాండ్

26 మంది అన్నాడిఎంకె ఎంపిల సస్పెన్షన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో మరోసారి రాఫెల్ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)ని వేసి తీరాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బిజెడితో పాటు ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న శివసేన కూడా ఈ డిమాండ్‌తో గొంతు కలిపాయి. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశాయి. అయితే, అధికారపక్షం ఈ డిమాండ్‌ను తిరస్కరించింది. బుధవారం జరిగిన ఈ చర్చ సందర్భంగా విపక్ష ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదాలు జరిగాయి. ఒకటికి, రెండు సార్లు సభ వాయిదా పడింది. అయినా ప్రతిపక్షాల పట్టుకొనసాగింది. తరువాత ప్రారంభమైన సభలోనూ జెపిసి కోసం పట్టుబడుతూ ఎస్‌పి సభ్యుడు ధర్మేంద్రయాదవ్ మాట్లాడుతున్న సమయంలో అన్నా డిఎంకె సభ్యులు 26 మంది వెల్‌లోకి వచ్చి ఆయన ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు. ఇది వ్యూహాత్మక చర్యేనన్న వ్యాఖ్యలు వినిపించాయి. బుధవారం చర్చను ప్రారంభించిన రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోడీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'పార్లమెంటుకు వచ్చిన సమాధానం చెప్పడానికి ప్రధానమంత్రికి ధైర్యం లేదు. అందుకే తన గదిలోనే ఉండిపోయారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అన్నాడిఎంకె ఎంపిల వెనుక దాక్కున్నారు. రాఫెల్ ఒప్పందంలో చాలా లొసుగులున్నాయి. గతసారి నేను ఈ అంశం లేవనెత్తినప్పుడు కూడా ప్రధాని ఐదు నిమిషాలే స్పందించారు" అని వ్యాఖ్యానించారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన పత్రాలు అప్పటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా సిఎం మనోహర్ పారికర్ బెడ్ రూంలో ఉన్నాయన్న గోవా మంత్రి మిగతా 9లో

మళ్లీ సుప్రీంకు రాఫెల్ వివాదం

- రివ్యూ పిటిషన్ దాఖలు


8

రాఫెల్ రహస్యాలన్నీ పారిక్కర్ పడక గదిలో..!

- ఆడియో విడుదల చేసిన కాంగ్రెస్
- ఖండించిన గోవా సిఎం



కుప్పంలో 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రబాబు



నా కష్టానికి కూలి ఇవ్వండి

- కేంద్రంపై పోరాటానికి కలసి రండి
- శబరిమలలో మహిళల ప్రవేశానికి బిజెపి అడ్డంకులు
- కుప్పం జన్మభూమి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-చిత్తూరు ప్రతినిధి

'నాలుగున్నరేళ్లుగా మీ అభివృద్ధి కోసం కష్టపడుతున్నాను. ఇప్పుడు నోరు తెరచి అడుగుతున్నాను.. నా కష్టానికి కూలి ఇవ్వండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆరో విడత 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాన్ని ఆయన నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలోని వడ్డిపల్లిలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిసి రోడ్లు, ఎన్టీఆర్ గృహాలు, ఇంకుడు గుంతలను ప్రారంభించారు. సీమంతం కార్యక్రమంలో భార్గవిని మిగతా 9లో

రాజకీయ ప్రచారంగా 'జన్మభూమి - మా ఊరు'

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు విమర్శ

3

తొలి కేసు జివిఎంసిది



చీఫ్ జస్టిస్ బెంచ్‌కి 42 కేసులు

రద్దీగా మారిన కోర్టు పరిసరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. పెద్దఎత్తున చేరుకున్న కక్షిదారులు, న్యాయవాదులతో కోర్టు పరిసరాలు రద్దీగా మారిపోయాయి. తొలిరోజు చీఫ్ జస్టిస్ బెంచ్ మీదకు 42 కేసులు వచ్చాయి. మొట్టమొదటిగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు విచారణ జరిగింది. భీమిలి మున్సిపాలిటీని జివిఎంసిలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసు ఇది. బుధవారం ఉదయం పది గంటలకు చీఫ్ జస్టిస్ ప్రవీణ్ కుమార్, ఇతర న్యాయమూర్తులు కోర్టుకు చేరుకున్నారు. ఉమ్మడి హైకోర్టులో సుమారు 3.50 లక్షల కేసులుండగా, వాటిలో 70 శాతం ఆంధ్రప్రదేశ్‌కే చెందినవి ఉన్నాయని సీనియర్ న్యాయవాది రాజేంద్రప్రసాద్ తెలిపారు. కోర్టుకు వచ్చే వారితో సివిల్ కోర్టు పరిసరాలు పూర్తిగా నిండిపోయాయి. పెద్దఎత్తున ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. తొలిరోజు అన్ని కోర్టుల్లోనూ పనులు మొదలయ్యాయి. మరోవైపు కోర్టు కార్యాలయాల కోసం ఆర్‌అండ్‌బి భవనంలో కేటాయించిన ఫ్లోర్‌లో ఇంకా పనులు పూర్తికాలేదు. నాలుగు లారీల దస్త్రాలు పెండింగ్‌లో ఉన్నాయి. కార్యాలయాన్ని సిద్ధం చేయడం కోసం సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నా బుధవారం సాయంత్రానికి కూడా కొలిక్కి రాలేదు. రాత్రికి పూర్తయితే ఉదయానికల్లా సర్దేస్తామని అధికారులు తెలిపారు. అయితే షెడ్యూలు ప్రకారం మిగతా 9లో



ప్రధాన ఆలయంలో మహిళలు

శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశం

- వెంటనే సంప్రోక్షణ నిర్వహించిన పూజారి

ప్రజాశక్తి - తిరువనంతపురం ప్రతినిధి

బిందు అమ్మిని, కనకదుర్గ అనే ఇరువురు మహిళలు బుధవారం తెల్లవారు జామున శబరిమల ఆలయంలోకి ప్రవేశించారు. తద్వారా వీరిద్దరి పేర్లు చరిత్రలో నిలిచిపోనున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు పంబ నుండి బయలుదేరిన వీరు సన్నిధానంకు 3.45 గంటలకు చేరుకున్నారు. విఐపిలు, మీడియా, సిబ్బందికి ఉద్దేశించిన ద్వారం గుండా వీరు లోపలకు ప్రవేశించారు. సివిల్ డ్రెస్‌లో వున్న పోలీసులు వీరిని అనుసరించారు. గతేడాది సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో ఈ పరిణామం సంభవించింది. నల్ల దుస్తులు ధరించిన ఇద్దరు మహిళల ఆలయ ప్రవేశాన్ని బుధవారం ఉదయం 8 గంటల నుండి అన్ని వార్తా చానెళ్ళు ప్రసారం చేస్తూనే వున్నాయి. డిసెంబరు 24న ఈ ఇద్దరు మహిళలు సన్నిధానంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. కానీ ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు శబరిమలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించడం, అవి హింసాత్మకంగా మిగతా 9లో

ప్రచారం కోసమే దాడి

పక్కా ప్రణాళికతో జగన్‌పై హత్యాయత్నం : సిపి లడ్డా

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌పై పక్కా ప్రణాళికతోనే విమానాశ్రయంలోని హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు హత్యాయత్నం చేశాడని విశాఖ నగర పోలీసు కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా వెల్లడించారు. గతేడాది అక్టోబరు 25న జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో కత్తితో దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఆ కేసుకు సంబంధించిన దర్యాప్తు పూర్తి కావడంతో సిపి బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. నిందితుడు కేవలం ప్రచారం కోసమే హత్యాయత్నం చేశాడు. వాస్తవానికి అక్టోబరు 18న జగన్ విమానాశ్రయానికి వచ్చినప్పుడే దాడి చేయాలనుకున్నాడు. కానీ ఆ సమయంలో ఎక్కువ మంది ఉండటం వల్ల కుదరలేదు. చాలా కాలంగా జగన్‌పై దాడి చేసి టీవీల్లో, పేపర్లలో తాను కనిపించాలని, తన గ్రామానికి చెందిన విజయదుర్గతో చెప్పేవాడు. ఇందులో భాగంగానే ఆమె చేతితో 9 పేజీల లేఖ రాయించాడు. ఎట్టకేలకు అక్టోబరు 25న ప్రణాళిక ప్రకారం జగన్‌పై దాడి చేశాడు. గతేడాది జనవరి ఒకటిన జగన్‌కు కటవుట్ కూడా పెట్టాడు. అందులో గెద్ద బొమ్మ పెట్టమని శ్రీనివాసరావే తయారీదారునికి చెప్పాడు. కేవలం అమాంతంగా ఎదిగిపోడానికే ఈ దాడి చేశాడు. ఇందులో ఎటువంటి కుట్ర కోణం లేదని సిపి వివరించారు. సమావేశంలో డిసిపిలు రవీంద్రనాథ్‌బాబు, నయీమ్, దామోదర్, ఎసిపిలు పాల్గొన్నారు.

కుట్రదారులను తప్పించేందుకే..

- వైసిపి లీగల్ సెల్ నేత సుధాకర్‌రెడ్డి

జగన్‌పై హత్యాయత్నం కేసులో అసలు కుట్రదారులను తప్పించే ప్రయత్నం జరుగుతోందని వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఆరోపించారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటనకు అసలు సూత్రదారులు, పాత్రధారులెవరో తెలియకుండానే నిందితుడు శ్రీనివాస్‌కే కేసును పరిమితం చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. శ్రీనివాస్ ఒక్కడే కుట్ర సూత్రదారుడనే విధంగా విశాఖ పోలీస్ కమిషనర్ లడ్డా వ్యాఖ్యలు ఉన్నాయని, కానీ జగన్‌పై జరిగిన దాడి హత్యాయత్నమేనని స్పష్టమైందని అన్నారు. ఫ్లెక్సీలను మార్ఫింగ్ చేసి కేసును పక్కదారి పట్టించాలని చూస్తున్నారని, 27 కేసుల్లో చంద్రబాబు స్టే తెచ్చుకున్నారని, కోర్టులను ప్రభావితం చేయడం ఆయనకు అలవాటేనని ఆరోపించారు. న్యాయవ్యవస్థను కించపరిచేలా చంద్రబాబు మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు కోర్టు ధిక్కారం కిందకొస్తాయన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఏ నేరం జరిగినా ఎన్‌ఐఎ పరిధిలోకొస్తుందని, కేసు రిజిస్టర్ చేసిన వెంటనే ఎన్‌ఐఎకు నివేదించాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల హత్య కేసును ఎన్‌ఐఎకు ఇచ్చినప్పుడు, జగన్‌పై హత్యాయత్నం కేసును ఎందుకివ్వరని ప్రశ్నించారు. కేసు ఎన్‌ఐఎకు బదిలీ అయితేనే వాస్తవాలు బయటికొస్తాయన్నారు.

లక్షన్నర హెక్టార్ల క్షీణత

- రబీలో తగ్గనున్న సాగు
- కరువు వరదలే కారణం
- సర్కారు అంతర్గత అంచనా

3

ఏకాత్మశక్తి నిర్వాకంతో పస్తులు



పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులో భోజనం కోసం విద్యార్థుల ఎదురుచూపులు



ఒంగోలులో మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం నేత కల్పనపై ఖాకీల జులుం

మధ్యాహ్న భోజనం అందక పిల్లలు విలవిల

పశ్చిమలో 500కుపైగా స్కూళ్లలో అందని భోజనం

తూర్పులో రెండోరోజూ అవే అవస్థలు

ప్రకాశంలో అరెస్టులు

ప్రజాశక్తి యంత్రాంగం

ప్రభుత్వం నియమించిన ప్రయివేట్ ఏజెన్సీలు మధ్యాహ్న భోజనం సరఫరాకు సంబంధించి తీరు మార్చుకోవడం లేదు. నిరసనలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. తాజాగా భోజనం అందించకుండా ప్రయివేట్ ఏజెన్సీలు ప్రభుత్వ పాఠశాలల్లోని వేలాదిమంది విద్యార్థులను ఆకలితో మాడ్చేసిన సంఘటనలు బుధవారం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. విద్యార్థులు ఆకలితో మిగతా 9లో

యశ్వంత్‌పూర్- హౌరా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

ప్రజాశక్తి - తుని (తూర్పుగోదావరి)

యశ్వంత్‌పూర్ నుంచి హౌరా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం రావికంపాడు స్టేషన్ సమీపంలో స్వల్ప అంతరాయంతో బుధవారం ఉదయం గంటపాటు నిలిచిపోయింది. రెండు ఎసి బోగీల బ్రేకులు టైట్‌గా పట్టేయడంతో కొద్దిపాటి మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. గమనించిన అధికారులు గంటపాటు రైలును నిలిపివేశారు. రెండు బోగీలనూ వేరు చేశారు. దీంతో ప్రయాణికులు ఆరుబయటే ఇబ్బందులు పడ్డారు. ఆ బోగీల్లోని ప్రయాణికులను ఎపి ఎక్స్‌ప్రెస్ ద్వారా తరలించారు. జరిగిన ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.


నిరీక్షిస్తున్న ప్రయాణికులు

హైకోర్టు విభజన పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హైకోర్టు నిర్మాణం పూర్తి కావడంలో చిన్న చిన్న ఆటంకాలు సాధారణమేనని సుప్రీం కోర్టు పేర్కొంది. హైదరాబాద్ నుంచి హైకోర్టు తరలింపు కొన్ని రోజులు వాయిదా వేయాలన్న ఏపి హైకోర్టు న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. అమరావతికి ఏపి హైకోర్టు తరలింపుపై ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ స్టే ఇవ్వాలంటూ ఏపి న్యాయవాదుల సంఘం, న్యాయవాదులు కె.సీతారాం, కె జగన్మోహనరెడ్డిలు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఏకె సిక్రీ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రవీన్ చతుర్వేది వాదనలు వినిపిస్తూ భవనాలు, వసతులు డిసెంబర్ 15 కల్లా పూర్తి చేస్తామని ఏపి ప్రభుత్వం తప్పుడు ప్రమాణ పత్రం దాఖలు చేసిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు పాటించలేదని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జస్టిస్ ఎకె సిక్రీ జోక్యం చేసుకొని "హైకోర్టు ప్రాంరభమైంది కదా..హైకోర్టు విభజన అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ప్రారంభమైన నేపథ్యంలో ఈ దశలో మేం జోక్యం చేసుకోబోం" అని పేర్కొన్నారు. పిటిషన్ ఉపసంహరించుకుంటామని కోరిన నేపథ్యంలో కొట్టివేస్తున్నాం అని ధర్మాసనం పేర్కొంది.



రాష్ట్రంపై ఉత్తరాది గాలులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో రెండు వారాలుగా చలి వణికిస్తుంది. గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. విశాఖ, అమరావతి, కళింగపట్నం తదితర ప్రాంతాల్లో 12 డిగ్రీలకు పడిపోయింది. అంతకుముందుతో పోలిస్తే దాదాపుగా 3 నుంచి 4 డిగ్రీలు తగ్గిపోయాయి. అయితే బుధవారం ఆయా ప్రాంతాల్లో స్వల్పంగా రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. అమరావతిలో 13.6, విశాఖ ఎయిర్‌పోర్టులో 13, విజయవాడలో 15.4, కళింగపట్నంలో 14.0 డిగ్రీల చొప్పున నమోదైంది. రెండు మూడు రోజులు చలి తీవ్రత కొనసాగుతుందని, ఈ నెల 5న అండమాన్‌లో అల్పపీడనం ఏర్పడి, నైరుతి బంగాళాఖాతం వైపు వస్తే దాని ద్వారా ఉత్తరాది చలిగాలులు మరింత వేగంగా రాష్ట్రం మీదుగా వీచే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత శాస్త్రజ్ఞులు రాళ్ల పల్లి మురళీకృష్ణ తెలిపారు.

హైకోర్టు విభజనపై బాబుది రెండు నాల్కల ధోరణి: బిజెపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు విభజనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి శ్రీనివాసరాజు అన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధానిలో హైకోర్టు ఏర్పాటు చేయాల్సి ఉండగా, సిఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. రాజధానిలో హైకోర్టు నూతన భవనాన్ని డిసెంబరు 15 నాటికి పూర్తి చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతోనే సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్రపతి రెండు హైకోర్టులకు ఆమోదముద్ర వేశారన్నారు. భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడం చేతకాని బాబు తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు కేంద్రంపై నిందలేస్తున్నారన్నారు.

ప్రజ్ఞ

1. ఎల్ఐసి తాత్కాలిక చైర్మన్‌గా ఎవరు యామితులయ్యారు?
2. బిసిసిఐ సీనియర్ మహిళా వన్డే ట్రోఫీ విజేత ఎవరు?
3. ఆంధ్రప్రదేశ్ కొత్త హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
4. కాంపిటేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి ఎవరు?
5. ఏ రాష్ట్రంలో క్రిషక్ బంధు పథకం ప్రారంభించారు?

సమాధానాలు 7లో

మాటల్లోనే మెనూ

- అమలు అరకొరే
- మెనూ పాటించడం లేదన్న 45 శాతం విద్యార్థులు
- నాణ్యత లేదని 22 శాతం వెల్లడి
- శ్రీకాకుళం జిల్లాలో అధ్వానం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తామని చెప్పి కొత్త మెనూను రూపొందించిన ప్రభుత్వం దానిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. గురుకుల పాఠశాలలతో పాటు వసతి గృహాలల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఎక్కడా కూడా మెనూ ప్రకారం ఆహారం పెట్టడం లేదు. నాణ్యత లేని ఆహార పదార్థాలనే అందిస్తున్నారని ప్రభుత్వం చేపట్టిన ఆర్టీజి సర్వేలో తేలింది. మెనూ సక్రమంగా అమలు కావడం లేదని దాదాపు 41 శాతం వసతి గృహాల విద్యార్థులు, 45 శాతం గురుకుల పాఠశాలల విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్టు సర్వేలో పేర్కొన్నారు.


రాష్ట్రంలో 180 సాంఘిక, 178 గిరిజన, 42 వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 2 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారు. అదేవిధంగా 984 సాంఘిక, 897 బిసి సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో కూడా లక్షకు పైగా విద్యార్థులు చదువుతున్నారు.అయితే గతేడాది ఈ విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై ప్రత్యేకంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (నిన్) తో ప్రత్యేక అధ్యయనం చేపట్టారు. ప్రస్తుతం అందిస్తున్న పదార్థాలల్లో పోషక విలువలు సరిపోవని, ఎదిగే పిల్లలకు పోషక విలువలున్న మరి కొన్ని పదార్థాలు అందించాలని సూచించారు. వారంలో ఆరు రోజులు ఉడకబెట్టిన గుడ్లు, నాలుగు రోజులు చికెన్, ప్రతి రోజూ రాగి జావ, వేరుశనగ ముద్దలు, పండ్లు వంటివి అందించాలని నిర్ణయిం చారు. ఆ మేరకు కొత్త మెనూను కూడా గతేడా జూన్‌లో ప్రకటించారు. ఈ విద్యా సంవత్స రం నుంచి దానిని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నా రు. అందుకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలను కూడా పెంచుతున్నట్టు అప్పట్లో ప్రకటించారు. ప్రీ మెట్రిక్ విద్యార్థులకు రూ.1200, పోస్టు మెట్రిక్ విద్యార్థులకు రూ.1400కు చార్జీలను పెంచారు.

అయితే కొత్త మెనూ ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారా, వసతులు ఎలా ఉన్నాయి అనే అంశాలపై ప్రభుత్వమే ఇటీవలే ఆర్టీజి ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించింది. అందులో భాగంగా విద్యార్థులకు నేరుగా ఫోన్‌లు చేసి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని 45 శాతం గురుకుల పాఠశాలల విద్యార్థులు, 41 శాతం వసతి గృహాల విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. గరిష్టంగా శ్రీకాకుళం జిల్లాలో 50, కనిష్టంగా కృష్ణా జిల్లా నుంచి 38 శాతం మంది గురుకుల విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వసతి గృహాలలో మెనూ పాటించడం లేదని గరిష్టంగా శ్రీకాకుళం జిల్లా నుంచి 52, కనిష్టంగా విశాఖపట్నం జిల్లాలో 44 శాతం మంది విద్యార్థులు తెలిపారు. ఇక ఆహారంలో నాణ్యత లేదని మరో 22 శాతం మంది గురుకుల, వసతి గృహాల విద్యార్థులు వెల్లడించినట్టు సర్వేలో పేర్కొన్నారు.

భూసమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష

సినీ నటుడు శివాజి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రవ్యాప్తంగా 24లక్షల ఎకరాల్లో భూసమస్యలున్నాయనీ, వాటిని సంక్రాంతి పండుగలోపు పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతాననీ సినీ నటుడు శివాజి తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు రాష్ట్రంలో కొత్త రకం కుట్రలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చుక్కల భూములు, చెరువు భూములు, కుంచలను ఆసరా చేసుకొని కొంతమంది ప్రభుత్వంపై చుక్కల భూముల రైతులను ఉసిగొల్పాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రలో ముగ్గురు ఉన్నత స్థాయి అధికారులు భాగస్వాములుగా ఉన్నారనీ, మాజీ మంత్రి ఒకరు కావాలనే ఈ కుట్ర చేయిస్తున్నారనీ ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినా అధికారులు వినడంలేదన్నారు. కుట్రకు సంబంధించిన వివరాలను ఒక జర్నలిస్టులా పరిశోధించానని తెలిపారు. చుక్కల భూములను ఈస్ట్ ఇండియా కంపెనీ క్రమబద్ధీకరించిందనీ, ఆ ఫైల్‌ను కొంతమంది అధికారులు అమలు కాకుండా అడ్డుకుంటున్నారనీ మండిపడ్డారు. ఈ సమస్య 3లక్షల కుటుంబాలకు సంబంధించినదనీ, ప్రతిపక్షనేత జగన్, జనసేన అధినేత పవన్‌లకు ఇలాంటి సమస్యలు కనిపించవనీ విమర్శించారు. కేంద్రంలో తప్పకుండా ప్రభుత్వం మారుతుందనీ, ఎపికి ప్రత్యేక హోదా వస్తుందనీ శివాజి ఆశాభావం వ్యక్తం చేశారు.

సమస్యలు తెలుసుకుంటూ సాగిన జగన్ యాత్ర

ప్రజాశక్తి- మందస, సోంపేట (శ్రీకాకుళం జిల్లా)


మహిళల సమస్యలను తెలుసుకుంటున్న జగన్

వైఎస్.జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర 336వ రోజుకు చేరుకుంది. పాదయాత్ర పొడవునా సమస్యలు తెలుసుకుంటూ ఆయన ముందుకు సాగారు. బుధవారం మందస మండలంలోని నారాయణపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోంపేట మండలం పాత్రపురం క్రాస్ రోడ్డు మీదుగా తురకశాసనం క్రాస్ రోడ్డు వరకూ కొనసాగింది. మందస మండలంలో మినీ రిజర్వాయర్ నిర్మిస్తే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతులు జగన్‌ను కోరారు. తాము కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమలో ఎవరికీ పింఛన్లు మంజూరు కాలేదని లోహరబంద పంచాయతీలోని ఏడు గ్రామాల ప్రజలు జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వరుస తుపాన్లతో నష్టపోతున్నా ఎలాంటి సహాయమూ అందడం లేదని, టిడిపి కార్డు ఉంటేనే సాయం చేస్తున్నారని పలువురు జగన్‌కు మొరపెట్టుకున్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక బ్రాహ్మణులకు అన్యాయం జరుగుతోందని, బ్రాహ్మణ కార్పొరేషన్ పేరుతో టిడిపి కార్యకర్తలకు రుణాలు మంజూరు చేస్తున్నారని పలువురు బ్రాహ్మణులు జగన్ వద్ద వాపోయారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే డయాలసిస్ కేంద్రాలతోపాటు కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.పది వేల పింఛన్ ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. అందరి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలపై తేలని వ్యవహారం

అత్యవసర సేవలకు మినహాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిధుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్పందించకపోవడంతో వైద్య సేవల నిలిపివేతను కొనసాగించనున్నట్లు ప్రైవేటు వైద్యుల సంఘం నాయకులు ప్రకటించారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాల్సింది చెల్లించకపోగా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. నిర్వహణ కష్టమైన తరుణంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అయితే అత్యవసర వైద్యసేవలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే వాటిని కూడా నిలిపేస్తామని హెచ్చరించారు. బుధవారం ప్రభుత్వం రూ.90 కోట్లు విడుదల చేసిందని ఎన్‌టిఆర్ వైద్యసేవ సిఈఓ సుబ్బారావు తెలిపారు. మిగిలిన రూ.250 కోట్లను రెండు నెలల్లో చెల్లిస్తామని తెలిపారు. పెండింగ్‌లో 80 వేల క్లెయిములు ఉన్నాయని, వాటిని త్వరలోనే సెటిల్ చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే వందల కోట్ల బకాయిలు ఉన్న ప్రభుత్వం కొత్తగా తల్లీ సురక్ష పథకాన్ని ఎన్‌టిఆర్ వైద్యసేవలోకి తీసుకొచ్చిందని, దీనిలో కేటాయింపులు కూడా చాలా తక్కువగా ఉన్నాయని వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గైడ్‌లైన్స్‌లో 14050 రూపాయలు మాత్రమే చెల్లిస్తామని పేర్కొన్నారని, అసలే బకాయిలు రాక ఇబ్బందులు పడుతుంటే తక్కువ కేటాయింపులు ఉండటం సరికాదని చెబుతున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో 25 ఎంపీ సీట్లు, 150 అసెంబ్లీ సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు సూచించారు. అమరావతిలో పార్టీ నాయకులతో ఆయన బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ పది రోజులూ టిడిపి ప్రతినిధులు గ్రామాల్లో, వార్డుల్లో ఉండాలన్నారు. మళ్లీ టిడిపియే రావాలని, లేనిపక్షంలో రాష్ట్రం దెబ్బతింటుదనే భయం ప్రజల్లో ఉందని, వారి ఆంకాంక్షల మేరకు పని చేయాలన్నారు. దుష్టశక్తులు పార్టీపైనా, రాష్ట్రంపైనా కక్ష కట్టాయన్నారు. విభజన చట్టం ప్రకారం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదని, ఇచ్చిన హామీలూ నేరవేర్చలేదని మండిపడ్డారు. గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ ఎక్కడ మించిపోతుందోననే ఆక్రోశం మోడీకి ఉందని, అందుకే రాష్ట్రానికి నిధులివ్వకుండా అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతూ, అక్కసు వెళ్లగక్కుతున్నారని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల్లో మోడీ, అమిత్‌షా, ముగ్గురు సిఎంలు, 13 మంది కేంద్రమంత్రులూ ప్రచారం చేసినా ఒక్క సీటును మాత్రమే గెలిచారన్నారు. దీని పై ఏపీ పర్యటనలో ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని ప్రధాని తన పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. ఏపీలో టిడిపి గెలిస్తే తన అసమర్థత బయటపడుతుందని కెసిఆర్‌కి భయం పట్టుకుందని, అందుకే మోడీతో జత కట్టారని అన్నారు. కేసుల మాఫీ కోసం జగన్‌కు అధికారం కావాలని, అందుకే రాష్ట్రానికి అన్యాయం చేసిన వారితో ఆయన జతకట్టారని విమర్శించారు. బిజెపి చేతలు ట్రిపుల్ తలాక్‌లో ఒకలా, శబరిమలలో మరోలా ఉన్నాయని, ఈ కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు.

అన్నింటా మోడీ సర్కార్ విఫలం : రామకృష్ణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విభజన హామీలతో పాటు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్ని హామీల అమల్లోనూ చేయడంలో మోడీ సర్కార్ పూర్తిగా విఫలం అయ్యిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. బుధవారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లో మీడియాతో రామకృష్ణ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి, ఇవ్వకుండా మొండి చేయి చూపించిందని మండిపడ్డారు. వెనకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వకుండా మోడీ సర్కారు రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రెవెన్యూ లోటు రూ.16 వేల కోట్లు ఉంటే... కేవలం మూడు న్నర వేల కోట్లే ఇచ్చారని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ విష యంలో కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా సాధన, కేంద్ర వైఖరికి నిరసనగా గురు, శుక్రవారాల్లో జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. సిపిఐ, సిపిఎం, రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు, మేధావులందరూ ఈ ధర్నాలో పాల్గొంటారని చెప్పారు.

'సీమ'లో హైకోర్టు లేకపోవడం దురదృష్టకరం : తులసిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయకపోవడం చారిత్రక తప్పిదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు సీమ ప్రాంతానికి చెందినవారైనప్పటికీ హైకోర్టును ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో కేంద్రీకృత అభివృద్ధి జరుగుతుందని, వికేంద్రీకరణ జరగడం లేదని అన్నారు. దేశంలో 12 రాష్ట్రాల్లో రాజధాని, హైకోర్టు విడివిడిగా ఉన్నాయని తెలిపారు.

ప్రత్యేకం

సంగారెడ్డి ఎంఆర్‌ఎఫ్ ఎన్నికల్లో సిఐటియు కూటమి ఘన విజయం

321 ఓట్ల తేడాతో బిఎంఎస్‌పై జయకేతనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో బుధవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సిఐటియు - కెపిఎస్ (కార్మిక పోరాట సమితి) కూటమి ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో సిఐటియు - కెపిఎస్‌కు 821 ఓట్లు, బిఎంఎస్‌కు 500 ఓట్లు, టిఎంఎస్‌కు 451 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థిపై సిఐటియు కూటమి 321 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ.. ఇది కార్మిక విజయం అన్నారు. సిఐటియు - కెపిఎస్ కార్మిక సంఘాలు నిత్యం కార్మికుల కోసం పోరాడుతున్నాయనీ, దీన్ని గుర్తించి ఈ ఎన్నికల్లో కార్మికులు తమకు గుర్తింపు యూనియన్‌గా బాధ్యత అప్పగించారనీ తెలిపారు. తాము గతంలో ఈ పరిశ్రమలో ఎన్నో ఉద్యమాలు చేసి కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు కల్పించామన్నారు. కొత్త సంవత్సరంలో తాము విజయంతో పోరాటాన్ని ఆరంభించామని సంతోషం వ్యక్తం చేశారు. కెపిఎస్ నాయకుడు కొత్తగొల్ల శేఖర్ మాట్లాడుతూ.. కార్మికులు పెట్టిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వారి సమస్యలపై యాజమాన్యంతో పోరాడుతామన్నారు. ఎప్పటికప్పుడూ కార్మికులు-యజమాన్యం సంయుక్తంగా పరిశ్రమ అభివృద్ధిలో ముందుకు వెళ్లేలా కృషి చేస్తామన్నారు. కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.


అభివాదం చేస్తున్న చుక్క రాములు
సిఐటియు కూటమి సంబరాలు

అవినీతి నిర్మూలనలో మూడో స్థానం

ఎసిబి డిజి ఆర్‌పి ఠాకూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి నిర్మూలనలో రాష్ట్ర అవినీతి నిర్మూలన శాఖ (ఎసిబి) దేశంలో 16వ స్థానం నుంచి మూడో స్థానానికి చేరిందని ఎసిబి డిజి ఆర్‌పి ఠాకూర్ వెల్లడించారు. విజయవాడలోని ఎసిబి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ అవినీతి నిర్మూలనపై ప్రజల్లో మరింత అవగాహన పెంచుతున్నామన్నారు. అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, నిజాయితీ అధికారులు భయపడాల్సిన పనిలేదని, వారికి అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్ని ఎసిబి కిందకు తీసుకొచ్చాక బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎసిబిని బలోపేతం చేసేందుకు రూ.15.94 కోట్లతో అన్ని జిల్లా కేంద్రాల్లో ఎసిబి కార్యాలయాలు నిర్మించామని, 350 మంది సిబ్బందిని పెంచామని తెలిపారు. సోషల్ మీడియాను కూడా వినియోగించుకుని అవినీతి నిర్మూలనపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకొస్తున్నామన్నారు. ప్రభుత్వ సర్వీసులు ఆన్‌లైన్ చేయడం వల్ల అవినీతి బాగా తగ్గిందని, నూతనంగా నిర్మించే రాజధానిలో సాధారణ పరిపాలన శాఖలో ఎసిబి రాష్ట్ర కార్యాలయ భవనం కూడా ఉంటుందని తెలిపారు. 2018లో లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులు 107, అక్రమాస్తుల కేసులు 31, ఎనిమిది నిధుల దుర్వినియోగం కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.

గడువులోగా పట్టణ ఇళ్లను పూర్తిచేయాలి

టిడ్కోకు సిఎస్ పునేఠా ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిటిడ్కో) ద్వారా చేపట్టిన పట్టణ గృహనిర్మాణ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆయన కార్యాలయంలో టిడ్కోకు సంబంధించిన రాష్ట్ర స్థాయి శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌ఎమ్‌సి) సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటిదశ ప్రాజెక్టు పనులను రానున్న నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలన్నారు. వీటి నిర్మాణానికి కేంద్రం నుండి రావాల్సిన నిధులను రాబట్టేందుకు కృషి చేయాలనీ, రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. టిడ్కో ఎండి బియం దివాన్ మైదీన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ కింద వివిధ పట్టణాల్లో 5,29,786 ఇళ్లు మంజూరుకాగా, వాటిలో 4,60,492 ఇళ్లకు టెండర్లు ఖరారయ్యాయనీ, 3,60,365 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభించామనీ, 1,33,631 ఇళ్లు శ్లాబు దశకు చేరాయనీ తెలిపారు. అదేవిధంగా ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్‌కు సంబంధించి 4,28,444 గృహాలు మంజూరుకాగా, వాటిలో 1,61,751 ఇళ్లకు అనుమతులు లభించాయనీ, వీటిలో 1,09,757 ఇళు గ్రౌండ్ అయ్యాయనీ, 71 వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. 11 పట్టణ స్థానిక సంస్థలు (యుఎల్‌బి), 5 పట్టణాభివృద్ధి సంస్థలు(యుడిఎ) నుండి 41 ప్రతిపాదనలు వచ్చాయనీ, వీటి ద్వారా 57,433 ఇళ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. దీనికి మొత్తం రూ.3,183 కోట్లు వ్యయం కానుండగా కేంద్రం నుండి రూ.861 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.676 కోట్లు సమకూరనున్నట్లు ఆయన తెలిపారు. మరో రూ.453 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల నిమిత్తం ఖర్చు చేయనుండగా మిగతా రూ.1,191 కోట్లు లబ్ధిదారుల వాటాగా భరించాల్సి ఉందని వివరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాములు, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికల వలవన్, మున్సిపల్‌శాఖ కమిషనర్ కె.కన్నబాబు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్.కె.వి.సత్యనారాయణ,టిడ్కో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్షణం మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయాలి : పునేఠా

రాష్ట్రంలో ఈనెల 2 నుండి 11 వరకు జరుగుతున్న జన్మభూమి కార్యక్రమానికి సంబంధించి ఇంకా కొన్ని గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కూడిన మల్టీ డిసిప్లినరీ బృందాలను ఏర్పాటు చేయలేదనీ, బుధవారం సాయంత్రంలోగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా ఆదేశించారు. జన్మభూమి కార్యక్రమంపై ఆయన బుధవారం సాయంత్రం సచివాలయంలోని తన కార్యాలయంలో ప్రణాళికాశాఖ కార్యదర్శి, ఆర్టిజిఎస్ సిఇఒ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

నిలదీతలు, నిరసనలు, బహిష్కరణలు

- రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు 'జన్మభూమి' తీరు
- కర్నూలు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకులపై టిడిపి నాయకుల దౌర్జన్యం
- విశాఖ ఏజెన్సీలో కిడారి శ్రావణ్‌కుమార్‌ను నిలదీసిన గిరిజన మహిళలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా బుధవారం నుంచి ప్రారంభించిన జన్మభూమి-మాఊరు గ్రామసభల్లో తొలిరోజే ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి సభల వల్ల ప్రయోజనం ఏంటని ప్రజాప్రతినిధులపైనా, అధికారులపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిలదీతల పర్వం కొనసాగింది. పలుచోట్ల గ్రామసభలను ప్రజలు బహిష్కరించారు. విశాఖ జిల్లా ఏజెన్సీలోని అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ బగ్గమర్రివలసలో తాగునీరు, ఇతర సమస్యలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌ను సిపిఎం ఆధ్వర్యంలో గిరిజన మహిళలు నిలదీశారు. ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్టలో ఉపాధి హామీ బిల్లు బకాయిల చెల్లింపుల్లో జాప్యంపై అధికారులపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెథాయ్ తుపాను నష్టపరిహారం చెల్లించకపోవడంపై తీరం ప్రాంతంలోని నక్కపల్లి మండలం గొడిచర్ల గ్రామంలో రైతులు నిలదీశారు. కరువు, పెథాయ్ తుపాను వల్ల జరిగిన పంట నష్టంపై సర్వే నిర్వహించకపోవడం, పరిహారం చెల్లించకపోవడంపై రావికమతం మండలం కొత్తకోటలో రైతులు ప్రశ్నించారు. పద్మనాభం మండలం రేవిడి జన్మభూమిలో స్థానిక సమస్యలపై మహిళలు నిలదీశారు. విశాఖ జివిఎంసి పరిధిలోని 31, 32 వార్డుల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజలు ఇళ్లు, ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధురవాడలో జన్మభూమి కార్యక్రమంలో తాగునీరు, అండర్ డ్రెయినేజీ, ఇళ్ల మరమ్మతులు తదితర సమస్యలపై సిపిఎం, సిపిఐ, వైసిపి, జనసేన ఆధ్వర్యాన ప్రజలు అధికారులను నిలదీశారు. విజయనగరం జిల్లా కొత్తవలస, వేపాడ మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని జన్మభూమి సభల్లో అధికారులను రైతులు డిమాండ్ చేశారు. బాడంగి మండలం కోడూరు, బాడంగి, పిన్నవలసల్లో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందలేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను నిలదీశారు. పలు జన్మభూమి సభల్లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంపై శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం జోణంకి పంచాయతీ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిత్లీ తుపాను పరిహారం అందకపోవడంపై శ్రీకాకుళం జిల్లాలోని పలు జన్మభూమి సభల్లో బాధితులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేవారు. ఇళ్ల బిల్లులు మంజూరు చేయకపోవడంపై పలాస ఒకటో వార్డు జన్మభూమి గ్రామసభలో ప్రజలు నిలదీశారు. పది రోజుల్లో ఇళ్ల బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ ఎఇ, కమిషనర్ ఎన్.రమేష్‌నాయుడు శాంతింపజేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆందోళన చేస్తున్న ప్రజలను పోలీసులు అడ్డుకున్నారు. రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంపై ఆమదాలవలస మండలం తొగరాంలో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలోని 1, 2, 3 వార్డుల్లో జరిగిన సభల్లో రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల కోసం ప్రజలు నిలదీశారు. వివిఎం పల్లి కాలనీలోని రెండు బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానికులు డిమాండ్ చేశారు. పనబాకం పంచాయతీలో తమకు శ్మశానవాటిక లేదని, తమపై కులవివక్ష చూపుతున్నారని స్థానిక దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేసినా బిల్లులు మంజూరు చేయకపోవడంపై కల్‌రోడ్డులోపల్లి సభలో స్థానికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతపురం నగరంలోని 48వ డివిజన్‌లోని సమస్యలపై అధికారులను సిపిఎం ఆధ్వర్యాన ప్రజలు నిలదీశారు. ప్రజాసమస్యలు పరిష్కారం కాని జన్మభూమి ఎందుకంటూ రాజీవ్ కాలనీ పంచాయతీలో సిపిఎం, వైసిపి ఆధ్వర్యాన ప్రజలు అడ్డుకున్నారు. శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు మండలం కోమటికుంట్లలో తాగునీరు కూడా ఇవ్వలేని ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమం నిర్వహించడం ఎందుకంటూ జన్మభూమి ఫ్లెక్సీలను తొలగించారు. కర్నూలు జిల్లా పెద్దకడుబురు మండలంలో సమస్యలను నివేదించేందుకు వచ్చిన డివైఎఫ్ఐ నాయకులపై స్థానిక టిడిపి నాయకులు దౌర్జన్యం చేశారు. కర్నూలు నగరంలోని గడియారం ఆస్పత్రి వద్ద జరిగిన జన్మభూమి కార్యక్రమంలో సమస్యలపై అధికారులను స్థానికులు నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలం పశుపల్లిలో జన్మభూమి సభ రసాభాసగా సాగింది. ఎన్నికైన తర్వాత స్థానిక ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి ఆ గ్రామానికి ఒక్కసారి కూడా రాకపోడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను సభకు తీసుకురావాలంటూ ఎంపిపి దాసరి వీరవెంకట సత్యనారాయణను, ఎంపిడిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌ను ప్రజలు నిలదీసి కొద్దిసేపు జన్మభూమి సభను బహిష్కరించారు. రేషన్ కార్డులు, పింఛన్లు సమస్య పరిష్కారం కాకపోవడంపై ఎటపాక మండలం గుండాల గ్రామంలో అధికారులను ప్రజలు దీశారు. కొరుకొండ మండలం గాదరాడలో లైన్‌మెన్‌ను వెంటనే నియమించి విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు రహదారిపై పడుకుని నిరసన తెలపడంతో ట్రాఫిక్ స్తంభించింది. గ్రామంలో పోలీసు బందోబస్తుతో అధికారులు సభను నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రౌతులపూడి మండలం దిగువ సివాడ గ్రామ పంచాయతీలో జన్మభూమి సభను గ్రామస్తులు అడ్డుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా జీలుగుమిల్లి మండలంలో పి.అంకంపాడు, జీలుగుమిల్లిలో జరిగిన సభల్లో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలపై అధికారులను ప్రజలు నిలదీశారు. కృష్ణా జిల్లాలో నందిగామ గ్రామ పరిధిలోని చెరుకుకొమ్ముపాలెం, కొత్త బెల్లంకొండవారిపాలెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని జన్మభూమి సభలో పెద్దవరం గ్రామస్తులు నిరసన తెలిపారు. పెథాయ్ తుపాను బాధితులకు ఇచ్చిన హామీ మేరకు నిత్యావసరాలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామ పరిధిలోని మైనవానిలంక (కొట్లకాడ) గ్రామ మత్స్యకారులు జన్మభూమి గ్రామసభను అడ్డుకున్నారు. దీంతో, ప్రత్యేక అధికారి ఎ.శ్రీనివాసరావు అర్థాంతరంగా సభను ముగించారు. మొవ్వ మండలం మొవ్వవారిపాలెంలో పెథాయ్ తుపాను పరిహారం అందించాలని కోరుతూ రైతులు నినాదాలు చేశారు. నూజివీడు పట్టణంతోపాటు ముసునూరు మండలం రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెంలో స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం పెసర్లంక సభలో సమస్యలపై అధికారులను స్థానికులు ప్రశ్నించారు. మంగళగిరి 3వ వార్డులో ఉదయం పది గంటలకు సభ ఉంటుందని ప్రకటించిన అధికారులు 12 గంటలైనా రాకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ప్రజలు బైఠాయించి ధర్నాకు దిగారు.



అనంతగిరి మండలం బగ్గమర్రిలో మంత్రి శ్రావణ్‌కుమార్‌ను నిలదీస్తున్న సిపిఎం నాయకులు


అనంతపురంలో జన్మభూమిలో సమస్యలపై నిలదీస్తున్న సిపిఎం నాయకులను లాగేస్తున్న పోలీసులు

రాజకీయ ప్రచారానికే జన్మభూమి

- హంద్రీనీవాతో చెరువులు నింపాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- హిందూపురం

రానున్న ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి పేరుతో అధికారులతో పార్టీ ప్రచారం చేయిస్తున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేత పత్రాలను విడుదల చేశారన్నారు. ఆ శ్వేతపత్రంలో అనేక గందరగోళాలు ఉన్నాయన్నారు. పన్నులు, అప్పుల రూపంలో ఖజానాకు వస్తున్న రూ.లక్షల కోట్లు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. శ్వేతపత్రంలో అభివృద్ధి, ఆదాయం కన్నా అంకెల గారడి మాత్రమే చూపించి జన్మభూమిలో ఈ శ్వేతపత్రాన్ని అధికారులతో చదివించి రాజకీయ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రాజెక్టుల్లో నీరున్నా.. పాలకుల నిర్లక్ష్యంతో కాలువ ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదన్నారు. పూర్తి చేసి ఉంటే కొన్ని వేల ఎకరాల భూములకు నీరు అందేవన్నారు. రాయలసీమకు సాగు, తాగునీరు తీసుకొస్తామని ప్రగల్బాలు పలికి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. చంద్రబాబు పాలనలో గిట్టుబాటు ధరలు లేక దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను రైతులు నష్టపోయారని తెలిపారు. విత్తనాలు, ఎరువులు తదితర వాటి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మరో రూ.1000 కోట్లు రైతన్నలపై అదనపు భారం పడిందన్నారు. కౌలు రైతుల రుణాలను ఎలాంటి షరతులూ లేకుండా మాఫీ చేయాలన్నారు.

భూ సేకరణ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూమిని లాక్కొంటున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, 2014 నుంచి ఇప్పటి వరకు హంద్రీనీవా నీళ్లతో నియోజకవర్గంలో వుండే అన్ని చెరువులనూ నింపుతామని హామీ ఇచ్చారన్నారు. బాలకృష్ణ ఐదు మాసాలుగా నియోజకవర్గానికి రాకుండా కేవలం సినిమాలకే పరిమితమయ్యారన్నారు. పెనుకొండ సమీపంలో నిర్మాణమవుతున్న కియా పరిశ్రమలో కేవలం 15 మందికి మాత్రమే అక్కడ ఉద్యోగాలిచ్చారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై సిపిఎం తరుపున పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు, సిపిఎం దక్షిణ ప్రాంత జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పాల్గొన్నారు.

అప్పలబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- శెట్టూరు

అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అనంతపురం జిల్లా శెట్టూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శెట్టూరు మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన బోయ తిప్పరాజప్ప(45) తనకున్న 5 ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేసేవాడు. బోరులో నీరు ఎండిపోవడంతో రూ. 3 లక్షలతో మరో రెండు బోర్లు వేశాడు. నీరు పడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక బుధవారం ఉదయం చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్‌మనీకి యువకుడి బలి

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)


మనోహర్ (ఫైల్)

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని లంబాడీపేటలో బుధవారం వెలుగు చూసింది. అయితే వడ్డీ వ్యాపారులు వేధింపులే ఇందుకు కారణమని కుటుంబీకులు చెబుతున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. లంబాడీపేటకు చెందిన దాసరి మనోహర్ (30)కు సమీపంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన సుప్రియతో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. క్రిస్మస్, నూతన సంవత్సరం దృష్ట్యా సుప్రియ పుట్టింటికి వెళ్లింది. బుధవారం ఉదయం మనోహర్ ఇంట్లో చున్నీతో ఉరేసుకుని మృతి చెందాడు.తాను చనిపోవడానికి ఎవరూ కారణం కాదని, అప్పుల బాధ తట్టుకోలేక చనిపోతున్నానని గోడపైన రాసి ఉంది. తనకున్న పొలం ఎవరికీ అమ్మలేదని, అగ్రిమెంట్ కాలేదని రాయడంతోపాటు సిఆర్‌డిఎ కౌలు జమయ్యే బ్యాంకు ఖాతానంబరూ రాసి ఉంది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో భార్యకు ఫోన్‌చేసి ఐలవ్‌యు, గుడ్‌నైట్ అని మెసేజ్ పెట్టినట్లు ఫోన్‌లో సమాచారం ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్షన్నర హెక్టార్ల క్షీణత

- రబీలో తగ్గనున్న సాగు
- కరువూ వరదలే కారణం
- సర్కారు అంతర్గత అంచనా
- ఈశాన్యం లోటు 58 శాతం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ తడవ రబీలో ఏతావాతా లక్షన్నర హెక్టార్ల వరకు సాగు తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒక్క వరి విస్తీర్ణమే సుమారు యాభై వేల హెక్టార్ల మేర తగ్గుతుందని అంచనా. మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము, శనగ, నూనెగింజలు, పొగాకు, మిరప ఈ పంటల సేద్యం సైతం కొద్దో గొప్పో తగ్గనుంది. రబీ సీజను అక్టోబర్ 1 నుంచి ప్రారంభంకాగా ఇప్పటికి మూడు మాసాలు గడిచాయి. ఇంకా గట్టిగా రెండు నెలలే సమయముంది. మామూలుగా అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో చిరుధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, పొగాకు, మిరప వంటి వాణిజ్య పంటల సాగు ముమ్మరంగా సాగాలి. వర్షాధారంపై వేసే వరి నాట్లు కూడా డిసెంబర్ ఆఖరికి దాదాపు పూర్తవుతాయి. డెల్టాల్లో మాత్రం జనవరి, ఫిబ్రవరిల్లో వరి సాగు ఊపందుకోవడం ఆనవాయితీ. ఈ మారు జనవరి వచ్చాక కూడా అపరాలు, నూనెగింజలు, వాణిజ్యపంటల సాగులో లోటు కనిపిస్తోంది. కరువు, ప్రాజెక్టుల్లో నీటి కొరత ఇత్యాది సమస్యలను బేరీజు వేసుకున్నాక ఈ సంవత్సరం రబీ సాధారణ విస్తీర్ణంలో లక్ష నుంచి లక్షన్నర హెక్టార్ల వరకు తగ్గుదల కనిపిస్తున్నదని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. సర్కారు తీసుకున్న లక్ష్యంలో సుమారు మూడు లక్షల హెక్టార్ల మేర సాగు క్షీణించనుంది. కరువు వలన ఖరీఫ్‌లో నాలుగు లక్షల హెక్టార్ల మేర సాగు తగ్గింది.

వేసినవీ దెబ్బతింటున్నాయి!

ఖరీఫ్‌లో సాగు లేని మెట్ట ప్రాంతాల్లో రబీ పంటలను సాగు చేయించాలని సర్కారు నిర్ణయించింది. ఆ విధంగా ఖరీఫ్‌లో బీడుపడ్డ రెండు లక్షల హెక్టార్లను అదనంగా సాగు లోకి తీసుకురావాలని టార్గెట్లు పెట్టింది. అయితే మామూ లుగా సాగయ్యేదాని కంటే కూడా సేద్యం తగ్గుతోంది.

డిసెంబర్ ఆఖరుకు చూసుకుంటే అన్ని పంటలూ కలుపుకొని 16.74 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 15.24 లక్షల హెక్టార్లలో సాగయ్యాయి. నిరుడు ఈపాటికి 18.25 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఈ ఏట ఇప్పటికి వరి 60 వేల హెక్టార్లలో తగ్గింది. సజ్జలు, మొక్కజొన్న, పెసర, మినుము, అన్ని నూనెగింజలు, పొగాకు, మిరప, పత్తి, ధనియాలు ఈ పంటల సాగు కూడా తగ్గింది. సాగు తగ్గడం ఒక ఎత్తయితే వేసిన పంటలు దెబ్బతినడం మరొక ఎత్తు. వర్షాభావం వలన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో, తుపాన్లు, భారీ వర్షాల వలన ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో వేసిన రబీ పంటలు దెబ్బతిన్నాయి. రైతులు అవకాశం ఉన్నచోట తిరిగి సాగు చేపడుతున్నారు.

వర్షపాతం

మాసం	సాధారణ వర్షం మిమీ	కురిసిన వర్షం మిమీ	వ్యత్యాసం శాతం
జూన్	93.7	93.2	-01
జులై	151.3	121.6	-20
ఆగస్టు	158.3	146.7	-07
సెప్టెంబర్	152.7	95.1	-38
మొత్తం నైరుతి	556.0	456.6	-18
అక్టోబర్	168.2	44.9	-73
నవంబర్	102.4	36.5	-64
డిసెంబర్	25.4	42.7	+68
మొత్తం ఈశాన్యం	296.0	124.1	-58

మొత్తమ్మీద 32 శాతం తక్కువ

ఈశాన్య రుతుపవన కాలం డిసెంబర్‌తో ముగిసింది. తుపాన్లు వచ్చినప్పటికీ రాష్ట్రంలో సగటున 58 శాతం మేర వర్షపులోటు నెలకొంది. ప్రాంతాలవారీగా ఉత్తరకోస్తాలో లోటు 45 శాతం, దక్షిణకోస్తా 59 శాతం, రాయలసీమలో 42 శాతం తక్కువ వర్షం నమోదైంది. నైరుతి, ఈశాన్యం రెండూ కలుపుకున్నాక కూడా జూన్ నుంచి డిసెంబర్ వరకు సగటున రాష్ట్రంలో 32 శాతం మేర తక్కువ వర్షం కురిసింది. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు ఆరు జిల్లాల్లో సాధారణ వర్షం నమోదుకాగా రాష్ట్రంలోని తతిమ్మా ఏడు జిల్లాల్లో తక్కువ వర్షం పడింది.

క్రమశిక్షణతోనే లక్ష్యసాధన

- రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఎమ్‌డి చౌదరి
- ఘనంగా అమరావతి బాలోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ప్రతి ఒక్కరికీ క్రమ శిక్షణ, సమయ పాలన లక్ష్య సాధనకు మూలస్తంభాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.వి.చౌదరి అన్నారు. విజయ సాధనకు ఇష్టంతో కష్టపడి పనిచేయాలని చిన్నారులకు పిలుపునిచ్చారు. పిల్లల పండుగ అమరావతి బాలోత్సవం విజయవాడలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. పటమటలోని చిగురుపాటి శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మూడు రోజులపాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య వేదికపై ముఖ్యఅతిథిగా పాల్గొన్న చౌదరి ప్రారంభించారు. ఈ వేడుకల్లో తొలుత జాతీయ పతాకాన్ని చౌదరి, బాలోత్సవ పతాకాన్ని చలువాది మల్లిఖార్జునరావు ఆవిష్కరించారు. అనంతరం చౌదరి మాట్లాడుతూ చిన్నారుల్లో ఉత్సాహం నింపేలా బాలోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావిధానం అధ్వానంగా ఉందన్నారు. విద్య కార్పొరేటీకరణతో చదువు భారంగా మారిందన్నారు. కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలకు ఆట పాటలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి పాఠశాలా బాలోత్సవానికి వేదిక కావాలని ఆకాంక్షించారు. బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, నిర్వహణా కమిటీ అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు, కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ జ్ఞాపక శక్తికి 'పరీక్ష' అన్నట్లు ఉన్న నేటి విద్యావిధానం సరైంది కాదన్నారు. చదువు 'కొనేది'గా కాకుండా ప్రతి ఒక్కరూ నేర్చుకునేదిగా ఉండాలని ఆకాంక్షించారు. నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ క్రియ పిల్లల పండుగ కన్వీనర్ ఎస్ఎస్ఆర్.జగన్నాథరావు, రాష్ట్ర గ్రంథాలయ సంఘ కార్యదర్శి డాక్టర్ రావి శారద, జనశిక్షణా సంస్థాన్ పూర్వ సంచాలకులు విద్యా కన్నా, నిర్వహణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు, తరుణి తరంగాలు నిర్వాహకురాలు జి.జ్యోత్స్న, కృష్ణా బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు, ప్రముఖ ఇంజినీర్ కెఎల్.కాంతారావు, కాట్రగడ్డ వెంకట సుబ్బయ్య హైస్కూల్ శాశ్వత ట్రస్టీ కాట్రగడ్డ నారాయణరావు, చిగురుపాటి విద్యాసంస్థల డైరెక్టర్ కెవి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతి బాలోత్సవం ప్రారంభంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.వి.చౌదరి

నెత్తురోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో 9మంది మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు, విజయపురిసౌత్, పెదకాకాని (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా రహదార్లు మరోసారి నెత్తురోడాయి. జిల్లాలో బుధవారం వాటిల్లిన మూడు రోడ్డు ప్రమాదాల్లో 9 మంది దుర్మరణం చెందారు. మరో 8 మంది తీవ్రంగా గాయ పడ్డారు. వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం ములకలచెరువుకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు రాజమండ్రికి కారులో మంగళవారం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బుధవారం మధ్యాహ్నం యడ్లపాడు మండలం వంకాయలపాడు వద్దకు రాగానే జాతీయరహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్‌ను వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారులోని దాట్ల సీతారామరాజు (33), సంతలూరి భారతి (54), సంతలూరి సూర్యనారాయణ (29), సుశివర్మ (2) అక్కడికక్కడే మృతి చెందారు.

తెలంగాణ రాష్ట్ర నల్గొండ జిల్లాకు చెందిన రామదాసు బ్రహ్మచారి, భార్య నాగలక్ష్మీ, వారి పిల్లలు వెంకటసాయి (11), మణిదీప్తి (8), ఝాన్సీ కలిసి దుర్గి మండలంలోని ఓబులేసుని పల్లెలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నారు. ఇదే సందర్భంలో మాచర్లకు చెందిన సురేష్ (35), వడివేలు సాగర్‌లోని బంధువుల ఇంట్లో అన్నప్రాసనకు హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగొస్తున్నారు.

ఈ రెండు వాహనాలు తాళ్లపల్లి ఎన్‌టిపిసి సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో వెంకటసాయి, మణిదీప్తి, సురేష్ అక్కడికక్కడే మృతిచెందారు. మరో ప్రమాదంలో గుంటూరు నుండి విజయవాడవైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో గుంటూరు సంగడిగుంట ప్రాంతానికి చెందిన కుంచాల పవన్ (29), విజయవాడకు చెందిన మణికంట (22) అక్కడికక్కడే మృతి చెందారు.

శ్వేతపత్రాలపై చర్చ పెట్టాలి : ఉండవల్లి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం శాఖలవారీగా విడుదల చేస్తున్న శ్వేతపత్రాలపై చర్చపెట్టాలని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్వేతపత్రం అంటే వాస్తవిక అంశాలతో ఇచ్చేవని, ప్రభుత్వ శ్వేతపత్రాల్లో వాస్తవికత కొరవడిందని విమర్శించారు. పరిశ్రమల శాఖ శ్వేతపత్రాన్నే పరిశీలిస్తే రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రకటించారని, పరిశ్రమలు ఎక్కడ వచ్చాయో కన్పించడం లేదని అన్నారు.

సంపాదకీయం

మహిళా మహాకుడ్యం

కేరళ మహిళలు చేతులు చేతులు కలిపి నిర్మించిన మహాకుడ్యం మౌనంగా ఉండే మాములు గోడ కాదు. లక్షలాది గొంతులతో నినదిస్తుంది! చరిత్రకు సాక్షీభూతం కాదు...కొత్త చరిత్రను సృష్టిస్తుంది! దాడులతో బీటలు వారి కుప్పకూలే గోడ కాదది! దాడి జరిగిన ప్రతిసారీ మరింత దృఢంగా నిలబడుతుంది. ప్రతిఘటనకు అండవుతుంది. పోరాట రూపమౌతుంది! ఎక్కడైతే మనువాదులు, మతోన్మాదులు చెలరేగి పోవడానికి కుట్రలు చేశారో, ఎక్కడైతే వివక్ష ప్రదర్శనకు ప్రకృతి ధర్మాలను సైతం సాకుగా వాడుకోవాలని చూశారో! ఎక్కడైతే పచ్చటి బతుకులపై విష బీజాలను వెదజల్లాలని ప్రయత్నించారో...అక్కడే...ఆ మలయాళ గడ్డపైనే మహిళాలోకం కదిలిన తీరు అపూర్వం! చెప్పిన సమాధానం అనితర సాధ్యం! ఆమూల కాసర్‌గఢ్ నుండి రాష్ట్ర రాజధాని తిరువనంతపురం వరకు 620 కిలోమీటర్ల మేర సుదీర్ఘంగా నిర్మించిన మహిళాహారమే ఒక చరిత్ర! ఈ మహాకుడ్య నిర్మాణం ద్వారా వారు అందించిన స్ఫూర్తి మరో చరిత్రకు నాంది! కేరళకు ఉత్తర సరిహద్దుగా ఉన్న కాసర్‌గఢ్ నుండి రాష్ట్ర రాజధాని తిరువనంతపురం వరకు నిర్మాణమైన ఈ మానవహారంలో 35 లక్షల మంది మహిళలు పాల్గొన్నారని యూనివర్శల్ రికార్డు ఫోరమ్ ప్రకటించింది. 50 లక్షల మంది చేతులు చేతులు, కలిపి గళం విప్పారని ఆ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ పేర్కొన్నారు. 2011 లెక్కల ప్రకారం ఆ రాష్ట్రంలో మొత్తం మహిళల జనాభా 1.63 కోట్లు!

కేరళలో కొన్ని దశాబ్దాల పాటు చాప కింద నీరులా విష ప్రచారాన్ని సాగిస్తున్న మతోన్మాద శక్తులు, కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత బాహాటంగానే బరితెగించాయి. మనువు నాటి ధర్మాలను ఉటంకిస్తూ మహిళాశక్తికి సంకెళ్లు వేయడానికి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నించాయి. బడి పిల్లల యూనిఫారాల నుండి, కట్టు, బొట్టు వరకు ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేశాయి. మహిళా బిల్లును బుట్టదాఖలు చేయడం, మహిళాభివృద్ధికి నిధులు అంతంతమాత్రంగానే విడుదల చేయడం, ఆత్మగౌరవాన్ని భంగపరిచేలా కేంద్ర మంత్రులే మాట్లాడటం, హక్కులను హరించడం వంటి కేంద్ర ప్రభుత్వ నిర్వాకాలను చూస్తూ ఊరుకోవడానికి కేరళ సమాజం గతంలో మాదిరి మధ్య యుగాల దశలో లేదు. ఇప్పుడది ప్రగతిశీల ఉద్యమాలకు, ప్రజాతంత్ర పోరాటాలకు కేంద్రం! ఆ పోరాట రథ సారథులు అక్కడి మహిళలే! అందుకే. మహాకుడ్యంగా నిలిచి ఆరు నూరైనా హక్కులు సాధించుకుంటామని, లింగ అసమానతను పారదోలుతామని, అణచివేతను ప్రతిఘటిస్తామని, అన్ని రకాల వివక్షలను తరిమివేస్తామని ప్రతిన చేశారు! సిపిఎం, వామపక్షాలు, ఇతర అభ్యుదయ, పురోగామి శక్తులు ఈ ప్రతిజ్ఞతో గొంతు కలిపాయి. ఆ పార్టీలు, సంఘాలకు చెందిన పురుషులు ఈ మహత్తర కార్యక్రమంలో మహిళలకు అండగా నిలిచారు.

అయితే, మహిళా లోకంలో వెల్లువెత్తిన ఈ ఐక్యతే ముష్కర మూకలకు కలవరం సృష్టించింది. మహాకుడ్య నిర్మాణం ఒకవైపు జరుగుతుండగానే సోషల్ మీడియా వేదికగా విషప్రచారానికి దిగారు. మహిళా హక్కుల కోసం, లింగవివక్షకు, అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా జరిగిన ఈ మహా కుడ్య ప్రదర్శనను ఒక మతానికి వ్యతిరేకంగా చిత్రీకరించే ప్రయత్నం వారి వంకర బుద్ధులకు, వక్ర చేష్టలకు నిదర్శనం. అన్ని మతాల్లోని మహిళల హక్కుల పరిరక్షణే ఈ మహాకుడ్య లక్ష్యం! కులమతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తేడా లేకుండా చేయి చేయి కలిపింది దీనికే! మానవహారం విఫలమైందంటూ బిజెపి అధికారికంగా చేసిన వ్యాఖ్య కూడా తిమ్మినిబమ్మి చేసే ప్రయత్నమే! మహా మానవ హారాన్ని ప్రత్యక్ష ప్రసారం కానీయకుండా ప్రధానమంత్రి ఇంటర్వ్యూ పేరిట పిఎంఓ కార్యాలయమే కుట్ర చేసినా జాతీయ మీడియా విస్మరించ లేకపోవడమే ఏ స్థాయిలో విజయవంతమైందో చెబుతోంది. ఈ కార్యక్రమంతో సమాజంలో చీలికలు వస్తాయని కేరళ కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించడం మరీ చిత్రంగా ఉంది. అన్ని మతాలు, కులాలకు చెందిన వారు చేతులు కలిపి నినదిస్తున్న ఐక్యతా చిత్రం కళ్ళెదుట కనిపిస్తుంటే దానిని చూడటానికి నిరాకరించడమంటే విచ్ఛిన్న శక్తులకు వంత పలకడమే! ఎన్నో సంఘ సంస్కరణ ఉద్యమాలకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ ఈ స్థాయికి పతనం కావడం విచారకరం! ఇదే ధోరణి కొనసాగితే ప్రజల్లో ఇప్పుడున్న మద్దతును కూడా కోల్పోయి ఆ పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉంది. ఈ నిజాన్ని భవిష్యత్తులోనైనా గుర్తిస్తారో లేదో చూడాలి! ఏది ఏమైనా, కేరళ మహిళా లోకం నిర్వహించిన అతి పెద్ద మానవహారం కీలక సమయంలో దేశానికి దిశానిర్దేశం చేసింది. ఆ స్ఫూర్తిని దేశ ప్రజానీకం అందిపుచ్చుకోవాలి. ఎన్నో కష్టనష్టాలను అధిగమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహాకుడ్య నిర్మాతలకు జేజేలు!

ఇదీ విషయం



నేనిప్పుడు
వాడి చేతిలో పంటనొల్లుకుని
కంట్లో కారం జల్లిన వాళ్లనే ప్రశ్నిస్తాను
ఖండాంతర లావాదేవీల్లో
జాతి వెన్నెముకని తాకట్టు పెట్టిన వాళ్లనే ప్రశ్నిస్తాను
శవాల ఉసురు పోసుకునే చీకటి డబ్బునీ
దాని కాపలా కుక్కల్నీ ప్రశ్నిస్తాను
మట్టిని నమ్ముకున్న బతుకు మట్టిలోనే పాలి అయినప్పుడు
అది ఖచ్చితంగా హత్యే
చేసిందెవరనే నేను ప్రశ్నిస్తాను

- పాపినేని శివశంకర్

విశ్లేషణ

ఉపాధి కల్పన హామీ హుళక్కే!



డా॥ కె హేమలత

'నాకు ఉపాధి ఏది?' మోడీ నాయకత్వం లోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ నేటికీ నెరవేరని పరిస్థితుల్లో యువతరం వేస్తున్న ప్రశ్న ఇది. కానీ మోడీ ప్రభుత్వం చెవికి ఎక్కించుకోవటం లేదు. 2014 పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని బీజేపీ హామీ ఇచ్చింది. తదనంతరం 'మేక్ ఇన్ ఇండియా', 'స్కిల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహ యోజన' (పీఎంఆర్‌పీవై) వంటి నినాదాలతో అనేక భ్రమలు కల్పించింది. ఈ పథకాల సారాన్ని ఒకసారి చూద్దాం.

గ్యాంగ్‌మెన్, గేట్‌మెన్, హెల్పర్ వంటి 62,907 రైల్వే ఉద్యోగాల కోసం 1.9 కోట్ల మంది దరఖాస్తు చేశారు. వీరిలో అత్యధికులు పీజీ విద్యార్థులే. ఉత్తరప్రదేశ్‌లో 400 'క్లాస్ 4' ఉద్యోగాల కోసం 23 లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరిలో 50 వేల మంది పట్టభద్రులు. పశ్చిమ బెంగాల్లో 6 వేల 'క్లాస్ 4' ఉద్యోగాల కోసం 25 లక్షల మంది పోటీ పడ్డారు. వీరిలో అత్యధికులు పట్టభద్రులు, పీజీ అర్హతలు కలిగిన వారే. ముంబాయిలో 1,137 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు 2 లక్షల మంది పోటీ పడ్డారు. కనీస విద్యార్హత ఇంటర్మీడియెట్ అయితే 543 మంది పీజీ, 425 మంది ఇంజినీర్లు పోటీలో ఉన్నారు.


ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ చేసిన అనేక మంది ఆటోలు నడుపుతూ, షాపు గుమస్తాలగాను, రెస్టారెంట్ల లోను అతి తక్కువ వేతనాలకు పని చేయటం ఉపాధి కల్పనలో ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియజేస్తోంది. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, బీజేపీకి చెందిన త్రిపుర ముఖ్యమంత్రి, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వంటి వారి వ్యాఖ్యలు గమనిస్తే దేశంలో పకోడీ అమ్మటం, పాన్ షాప్ నిర్వహించటం, గోవులను సంరక్షించటం వంటివి కూడా ఉపాధి గాను, రోజుకి రూ.200 ఆదాయం వస్తుందని చెప్పటం హాస్యాస్పదం. ఈ వృత్తుల్లోని వారికి నిరంతరం పని దొరుకుతుందన్నది కూడా అనుమానమే.

దేశంలోని ఉపాధి కల్పన స్థితిగతులపై అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ఒక నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం 2013-2015 70 వేల నూతన ఉద్యోగాలు రద్దయ్యాయి. సెప్టెంబర్ 2018 నాటికి టెలికాం రంగంలో 15 వేల నుండి 20 వేల మంది ఉపాధి కోల్పోయారు. మానవ వనరుల నిర్వహణ సంస్థ టేకు లీజ్ సర్వీసు అంచనా ప్రకారం మార్చి 2019 నాటికి 65 వేలు టెలికాం ఉద్యోగులు ఉపాధి కోల్పోతారు.

'ఇండియా స్పెండ్' పత్రిక కథనం ప్రకారం 8 ముఖ్యమైన రంగాల్లో కొద్దిగా ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ అవి చాలా స్వల్పమనే చెప్పాలి. 1991 తరువాత ఎకానమీ అభివృద్ధిలో ఉన్న ఉపాధిలో వెనక పట్టులో ఉంది. ఐటీ రంగంలో కూడా ఉద్యోగాలు ఆటోమేషన్ల వల్ల, మానవ రహిత టెక్నాలజీ వల్ల ఉపాధి బాగా తగ్గిన పరిస్థితి ఉంది. 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సీఎంఐఈ) నివేదిక ప్రకారం 2017 అక్టోబర్ నుండి 2018 సెప్టెంబరు నాటికి 90 లక్షల ఉద్యోగాలు రద్దయ్యాయి. అదే నివేదిక ప్రకారం 2017 జులైలో నిరుద్యోగం రేటు 3 శాతం ఉండగా 2018 సెప్టెంబర్ నాటికి 8 శాతానికి పెరిగింది. నివేదికలో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే ఉన్నత చదువులు చదివిన వారిలో నిరుద్యోగం రేటు 16 శాతం పెరిగింది.

'లేబర్ బ్యూరో' నివేదికలను గమనించినా కూడా తాత్కాలిక, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వంటివి ఎక్కువగా కనబడుతున్నాయి. శాశ్వత ఉద్యోగాల కల్పన మాటే లేదు. సర్వే విధానాన్ని మారుస్తామని చెప్పి 'లేబర్ బ్యూరో' నివేదికలను కూడా 2016-2017 నుండి విడుదల చేయలేదు.

మార్కెట్ స్థితిగతులు వ్యాపార అవసరాలు విక్రయాల స్థాయిలో మార్పులు కారణంగా అనేక ఫ్యాక్టరీలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవటం, టెక్నాలజీని మార్చటం లేదా ఆపివేయటం వలన సుమారు 15 లక్షల ఉద్యోగాల రద్దయ్యాయి. వీటిలో కాంట్రాక్టు, క్యాజువల్ లేదా టెంపరరీ ఉద్యోగాలు అత్యధికం. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇటువంటి ఉద్యోగాల కోతలు, తొలగింపులు రద్దు చేయటం అధికమైంది.



మార్కెట్ స్థితిగతులు వ్యాపార అవసరాలు విక్రయాల స్థాయిలో మార్పులు కారణంగా అనేక ఫ్యాక్టరీలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవటం, టెక్నాలజీని మార్చటం లేదా ఆపివేయటం వలన సుమారు 15 లక్షల ఉద్యోగాల రద్దయ్యాయి. వీటిలో కాంట్రాక్టు, క్యాజువల్ లేదా టెంపరరీ ఉద్యోగాలు అత్యధికం. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇటువంటి ఉద్యోగాల కోతలు, తొలగింపులు రద్దు చేయటం అధికమైంది.

ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి, ఈపీఎఫ్ఓ లాంటి వ్యవస్థలు అబద్ధాలు ప్రచారం చేయటం కూడా ఎక్కువైంది. 2017-18లో 46 లక్షల మందికి ఉపాధి కల్పించామని ప్రధాని ప్రకటించారు. 70 లక్షల మందికి ఉపాధి కల్పించామని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

అసలు పీఎంఆర్‌పీవై అనేదే ఒక మోసం. దీనినే ఆగస్టు 2016లో ప్రధాని స్వయంగా అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం కొత్తగా నియమించిన ఉద్యోగుల ఈపీఎఫ్ చందాల్లోని మేనేజ్‌మెంట్ వాటాలను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఇది కార్పొరేట్లకు ఒక కొత్త రకం ఇన్సెంటివ్. ఈ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలతో లాలూచీ పడి ప్రభుత్వం దొంగ లెక్కల ద్వారా ఉపాధి కల్పన అంకెలను పెంచి చూపిస్తోంది. దీంట్లో మరో మోసం ఏమిటంటే కార్పొరేట్ యాజమాన్యాలు తమ బాధ్యతగా చెల్లించాల్సిన ఈపీఎఫ్ సొమ్ములను ప్రజలు కట్టే పన్నులు నుంచి ప్రభుత్వం చెల్లించటం. ఇలా కార్పొరేట్లను సంతృప్తి పరుస్తున్న ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈడీబీ) ర్యాంకు 130 నుండి 77కు ఎదిగామని గొప్పలు చెబుతుంది.

ప్రభుత్వం చెప్పేవి అబద్ధాలని వారే ఒప్పుకోవాల్సి వస్తుంది. ఇందుకు ఉదాహరణగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 'ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి?' అనే ప్రశ్ననే చూడొచ్చు. ఈపీఎఫ్ఓ సమాచార పట్టికల్లో ఉపాధి కల్పన సమాచారం అసలు ఉండదని మన దేశ ముఖ్య గణాంక శాస్త్రవేత్త చెప్పిన విషయం గమనార్హం.

మన దేశ జనాభాలో 25 సంవత్సరాల్లోపు వారు 50 శాతం, 35 సంవత్సరాల్లోపు 65 శాతం ఉన్న విషయం తెలిసిందే. నాలుగేళ్ల కాలంలో 87 కోట్ల మంది పని చేయగలిగే వయస్సు వారు ఉన్న దేశంలో సరైన విధానాలు అమలు చేస్తే ఉత్పత్తి రంగంలో, సేవా రంగంలో విస్తృతంగా ఉపాధి కల్పించొచ్చు. కానీ దీనికి భిన్నంగా కార్పొరేట్ సేవల్లో మునిగి ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని నిర్వీర్యం చేస్తోంది.

ఆర్థిక రంగం అభివృద్ధిలో ఉంది. తదనుగుణంగా ఉద్యోగాలు వస్తాయన్నది అపోహ మాత్రమే అని అనేక జాతీయ, అంతర్జాతీయ నివేదికలు తెలియజేస్తున్నాయి. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ నివేదిక ప్రకారం 1970-80 కాలంలో జీడీపీ అభివృద్ధి 3-4 శాతం ఉండగా ఉపాధి కల్పనాభివృద్ధి 2 శాతంగా ఉంది. అదే 1990-2000 మధ్య కాలంలో జీడీపీ వృద్ధి 7 శాతం ఉన్నప్పటికీ ఉపాధి కల్పనాభివృద్ధి ఒక శాతం దగ్గరే ఆగిపోయింది.

మొత్తంగా ఈ కాలంలో కాంట్రాక్టు, క్యాజువల్, టెంపరరీ, ఫిక్స్‌డ్ టర్మ్, పార్ట్ టైం, అప్రంటీస్, ట్రైనీస్ వంటి పేర్లతో స్థిరత్వం లేని ఉద్యోగాలు వస్తున్నప్పటికీ 2008 తరువాత అది కూడా కుంచించుకుపోయింది.

ఉపాధి కల్పన డిమాండ్‌తో దేశంలో కార్మికవర్గం అనేక పోరాటాలు చేస్తోంది. కార్పొరేట్లకిచ్చే రాయితీలను ఉపాధి కల్పనకు లింక్ చేయాలని ఒక ప్రధాన డిమాండ్. సంవత్సరానికి రూ.5 లక్షల కోట్ల చొప్పున పన్ను రాయితీలు, సౌకర్యాల కల్పన వంటి లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల ఉపాధి కల్పనను మాత్రం గాలికొదిలేశారు. ప్రజలు కట్టిన పన్ను నుండి రాయితీలు అనుభవిస్తూ లాభాలను పెంచుకుంటున్నారు.

ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల జాతీయ సమ్మె చేస్తున్న 12 డిమాండ్లలో ఉపాధి కల్పన కూడా ఒక ముఖ్యమైన డిమాండ్. జాతి వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సమ్మె జరగనుంది. ప్రభుత్వ విధానాల వలన, కార్పొరేట్ల లాభాపేక్ష వలన దేశంలో ఉపాధి లేమి పెద్ద ఎత్తున కనబడుతోంది. తాము చదువుకున్న చదువులకు, తమ నైపుణ్యాలకు తగిన ఉద్యోగం, ఉపాధి అభివృద్ధి అవకాశం లేకపోవటాన్ని దేశంలో యువజనులు నిరసిస్తున్నారు.

ఆందోళనలో ఉన్న యువత ఐక్యమవ్వకుండా బీజేపీ/ఆర్ఎస్ఎస్, వారి మిత్రులు కుల, మత, ప్రాంతీయ వైషమ్యాలు సృష్టిస్తున్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, దళిత వంటి విభజనవాద అంశాలను ముందుకు తెచ్చి విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారు. అయోధ్య, శబరిమల, సర్దార్ పటేల్ వంటివి దీనికి ఉదాహరణలు.

ఇతర అన్ని డిమాండ్లతోపాటు ఉపాధి కల్పన డిమాండ్‌ను కూడా దేశంలోని అన్ని వర్గాల ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. దేశంలోని అన్ని రంగాల కార్మికులకు తమ తమ యూనియన్ అంశాలను దాటి ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు కోరుతోంది. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాతంత్రవాదులు, కార్మికులు, కర్షకులు అందరూ ఈ దేశవ్యాప్త జాతీయ సమ్మెకు మద్దతునివ్వాలని సిఐటియు విజ్ఞప్తిజేస్తోంది.

కామెంట్

ఆర్థికంగా కుంగదీస్తున్న కాలుష్యం



మన దేశంలో కలుషితమైన గాలి పీల్చి జబ్బుపడే వారు, మరణించే వారు చాలా ఎక్కువగా ఉన్నారని లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ సంస్థ వెలువరించిన పరిశోధనా ఫలితాలు తెలియచేస్తున్నాయి. ఆరోగ్య సంక్షోభం తాండవించే దశలో ఉన్నాం. కలుషితమైన గాలి నుంచి జనాన్ని రక్షించడానికి తక్షణం చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

మన దేశంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. అయితే కలుషితమైన గాలి పీల్చడం వల్ల ఆరోగ్య సమస్యలు, జీవన ప్రమాణాలకు ముప్పు ఉందన్న విషయాన్ని మనం గ్రహించడం లేదు.

వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు దేశమంతటా సర్వే చేసి ఈ ఫలితాలు వెల్లడించారు. మన చుట్టూ ఉన్న ధూళి కణాలు, ఇళ్లల్లో పీల్చే గాలిలో ఉన్న కాలుష్యంపై వివిధ రాష్ట్రాలలో 2017లో ఈ పరిశోధన కొనసాగింది. మరణాలు, రోగాల బాధ, జీవన ప్రమాణాలు అన్న మూడు వర్గాల కింద కాలుష్య సమస్యను చూపించారు.

మన దేశంలో గాలి కాలుష్యం వల్ల సోకే జబ్బులు పొగాకు వాడడంవల్ల వచ్చే రోగాలకన్నా ఎక్కువ. దీనివల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతం, మధుమేహం లాంటివి ఎక్కువ అవుతున్నాయి. 2017లో 10 లక్షల 24 వేల మంది వాయు కాలుష్యం వల్ల మరణించారు. వీరిలో 51.4 శాతం మంది 70 ఏళ్లకు పైబడినవారే.

వాయు కాలుష్యం కనీస స్థాయి కన్నా తక్కువగా ఉండి ఉంటే జీవన ప్రమాణం 1.7 సంవత్సరాలు పెరిగేది. గాలిలో ధూళి కణాలు, ఇంట్లో పీల్చే గాలిలో కాలుష్య స్థాయి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంది. అందువల్ల దాని దుష్ప్రభావంలో కూడా తేడాలు ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో గాలిలో ధూళి కణాలు ఎక్కువ. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అస్సాంలో ఇళ్లల్లో పీల్చే గాలిలో కాలుష్యం అధికంగా ఉంది. అంటే వాయు కాలుష్యం నగరాలకు, పట్టణాలకే పరిమితం కాలేదు. గ్రామీణ ప్రాంతాలలోనూ ఈ బెడద ఉంది. గ్రామీణ ప్రాంతా లలో వంట చేసుకోవడానికి పిడకలు, బొగ్గులు, వంట చెరకు వాడడం వల్ల కాలుష్యం పెరుగుతోంది.

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కొద్దీ పరిశ్రమలు, వాహనాలు వెదజల్లే కాలుష్యం, పంటల నూర్పిళ్ల తర్వాత ఆ అవశేషాలను దగ్ధం చేయడం, భవన నిర్మాణాల వల్ల కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. ఢిల్లీలో విషపూరితమైన పొగమంచు బెడద శీతాకాలంలో మరీ ఎక్కువ అవుతున్నందువల్ల ప్రభుత్వం చర్యలు తీసుకోక తప్పలేదు.

కాలుష్యం వల్ల ఆర్థిక భారం ఎక్కువ పడుతుందని గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయలేం. కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడినప్పుడు కూడా ఆర్థిక భారం పడుతుంది. వాయు కాలుష్యం వల్ల భారత్ లో సంక్షేమానికి 505.1 బిలియన్ డాలర్ల మేర నష్టం కలిగిందని ప్రపంచ బ్యాంకు, వాషింగ్టన్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. 2013 నాటి కొనుగోలు శక్తి ఆధారంగా ఈ అంచనా వేశారు. కాలుష్యం వల్ల 2013లో పని దినాలు కోల్పోవడంవల్ల కలిగిన నష్టం 55.39 బిలియన్ డాలర్లు ఉంది. ఇది 2011 నాటి కొనుగోలు శక్తి ఆధారంగా వేసిన అంచనా. సంక్షేమం, పని దినాల నష్టం వల్ల 2013లో స్థూల జాతీయ ఉత్పత్తిలో కలిగిన నష్టం 8.5 శాతం ఉంది. అంటే ఆర్థికాభివృద్ధికి విపరీతమైన నష్టం కలుగుతోంది.

వాయు కాలుష్య ప్రభావం పెరుగుతూ ఉన్నందు వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ ప్రమాదాన్ని గుర్తించక తప్పలేదు. వాయు కాలుష్యం దేశమంతటా ఉన్న సమస్య. అందుకే వాయు కాలుష్యాన్ని అంచనా వేయడానికి జాతీయ పరిశుభ్ర వాయువు పథకం ప్రారంభించవలసి వచ్చింది.

అయితే ఇందులో కాలుష్యాన్ని తగ్గించడానికి నిర్దిష్టమైన చర్యలు లేనందువల్ల పర్యావరణ శాస్త్రవేత్తలు విమర్శలు గుప్పించారు. 2017 డిసెంబర్ నాటికి కాలుష్య నివారణ చర్యలకు కట్టుబడి ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం కాలుష్యం వెదజల్లే బొగ్గు ఆధారిత విద్యుత్ పథకాలకు అనుమతులు ఇస్తూనే ఉంది. ఈ మినహాయింపులు ఇవ్వడం వల్ల అంతకంతకూ పెరుగుతున్న కాలుష్య నివారణకు ప్రభుత్వం ఏ మేరకు కట్టుబడి ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాలుష్యాన్ని నివారించాలంటే ప్రాంతీయ సమన్వయం మాత్రమే కాకుండా, రాజకీయ సంకల్పం, ప్రజా సంకల్పం కూడా అవసరం.

('ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయం)

సందర్భం

మెరిసిన అక్షర కిరణం

కె విజయగౌరి

బడుగు బలహీన వర్గాల ఆడపిల్లలకు వేగుచుక్క, భారత తొలి ఉపాధ్యాయిని సావిత్రీభాయి పూలే. మహారాష్ట్రలో సతారా జిల్లాకు చెందిన నయాగావ్‌లో 1831, జనవరి 3న సావిత్రిభాయి పూలే జన్మించారు. ఈమెది బాల్య వివాహం. ఆనాటి సమాజంలో స్త్రీల సమగ్ర అభివృద్ధి కోసం, అన్ని వర్గాల మహిళల విముక్తి కోసం ఉద్యమాలు ఒక వైపు జరుగుతున్నాయి. సామాజిక, ఆర్థిక దాడి, స్త్రీ అస్తిత్వాన్ని నాశనం చేసే కుట్ర మరో వైపు. ప్రజల స్థితిగతులు, సాంఘిక దురాచారాలు, అవిద్య, బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటివి సావిత్రీభాయిని కదిలించాయి. అప్పటికే రాజారామ్మోహనరాయ్, ఈశ్వరచంద్ర, జ్యోతిరావు పూలేలు సాంఘిక దురాచారాల నుండి మహిళలను విముక్తి చెందించేందుకు సంస్కరణ ఉద్యమాలకు నాంది పలికారు. పీడిత ప్రజలను సంఘటిత పరచి, బానిస పీడన నుండి విముక్తి కోసం చేసే కృషితో పాటు స్త్రీలకు విద్య, మానవ హక్కుల ఉండాలని గళమిప్పిన దంపతులు సావిత్రీభాయి, జ్యోతిరావు పూలేలు... సాంఘిక దురాచారాల నుండి విముక్తి కావాలంటే విద్య అవసరం అని, విద్య ఒక్కటే సమాజాన్ని మార్చగలదని ఆమె విశ్వసించారు. దళితుల ఉద్ధరణ కోసం సత్యశోధన సమాజాన్ని ఏర్పాటు చేశారు. నాటి సమాజంలో కులమత వ్యత్యాసాలు తీవ్రంగా వుండేవి. మహర్, మాంగ్ కులస్థులకు చదువు వుండేది కాదు. బానిస పేద బతుకులు, మహమ్మదీయులకు భాష సమస్య వుండేది. అసలు బాలిక చదువుకోవడానికి ఎక్కడా అవకాశం లేదు. అటువంటి పరిస్థితులలో పెత్తందారుల దాడుల మధ్య బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు ఆ దంపతులు. దాన్లో భాగంగా 1848లో మహారాష్ట్రలోని పూనెలో ఒక ఇంట్లో బోధన మొదలుపెట్టారు సావిత్రీభాయి పూలే. ఆమె ప్రధానోపాధ్యాయినిగా 9 మంది బాలికలతో ప్రారంభమైన ఆ బడి వేల సంఖ్యలో ఆడపిల్లలు చదువుకోవడానికి ఊపిరి పోశారు. స్త్రీలను పురుషులతో సమానంగా చూడాలని, మూఢ విశ్వాసాలను దూరంగా పారద్రోలాలని జానపద కళారూపాలను రూపొందించారు. వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకులను చైతన్యవంతులను చేశారు.



నేడు సావిత్రీభాయి పూలే జయంతి

అనాథస్త్రీలకు, పిల్లలకు శరణాలయాలు, ఆశ్రమాలు ఏర్పాటు చేయించారు. సత్యశోధక సమాజపు మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర, వితంతు వివాహాలను జరిపారు. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే తానే చితికి నిప్పు అంటించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె తెగువకు యావత్ భారతదేశం దిగ్భ్రాంతి చెందింది. ఆ రోజుల్లో పురోహితులు లేకుండా వివాహాలు జరపడం సాహసకార్యం. అయితే భర్త ఆశయాలతో గళం కలిపి స్వతంత్ర వ్యక్తిత్వంతో, అత్యంత ధైర్యశాలిగా ఆయన అడుగుజాడల్లో నడిచి దాంపత్యం జీవితం ఇదే అనే సందేశాన్ని భారత మహిళలకు అందచేశారు. తన దగ్గర చదువుకున్న బాలికలు విశాల భారతదేశంలో స్వాతంత్ర్యం కోసం, కుల, వర్ణ, మతతత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారిన పడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు రెండు వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. పాఠశాల విద్యారంగానికి ఆమె స్ఫూర్తిప్రదాత.

(రచయిత యుటిఎఫ్ రాష్ట్ర కన్వీనర్- మహిళా విభాగం)

సెటైర్

అప్పు దేశంలో ఉపదేశం

సుబ్రమణ్యం

'ఏరా! ఇంకా ఎన్నాళ్లు నన్ను తిప్పుతావు? నేనూ నీలాంటి ఉద్యోగస్తుడినేగద! చెప్పిన రోజుకు అప్పు తీర్చకపోతే నేనెలా చావను?' అని విసుక్కుంటూ వచ్చి కూచున్నాడు రామారావు. 'రావయ్యా రామారావూ! ఎందుకంత టెన్షన్ పడతావు! ఈ వయస్సులో టెన్షన్ పడితే ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు సుమా!' అని మిత్రుడిని ఆహ్వానించి కూచోబెట్టేడు అప్పారావు. అప్పారావు సార్థక నామధేయుడు. నిజానికి చంద్రబాబుకు ప్రత్యేక ఆర్థిక సలహాదారుగా ఉండదగ్గవాడు. ఎడాపెడా అప్పులు చేస్తాడు. చాణుక్యుడు చెప్పిన చందాన వ్యవహరించే చాకచక్యం వుంది. తుమ్మెద, పువ్వు నుంచి తేనెను, ఆ పువ్వుకే తెలియకుండా ఎలా జుర్రుకుంటుందో అలా ప్రజల నుంచి పన్నులు వసూలు చేయాలన్నాడు చాణుక్యుడు అర్థశాస్త్రంలో. అసలు అర్థశాస్త్రం అంటేనే అప్పుల శాస్త్రం అని దాని మర్మాన్ని జీర్ణించుకున్న వాడు మన అప్పారావు. అందుకే అందరి దగ్గరా రాబట్టగలిగిన మేరకు అప్పులు రాబడుతూనే వుంటాడు. 'ఎలాగ తీరుస్తా వయ్యా?' అని ఇంట్లో భార్య అడిగితే చిద్విలాసంగా నవ్వి 'ఇంకొకళ్ల దగ్గర అప్పు చేసి తీరుస్తానని బదులిచ్చేడు. 'అలా మనకి ఎప్పుడు పడితే అప్పుడల్లా అప్పులిచ్చే వాళ్లెవరు?' అంటే 'కారెవరూ మనకి అప్పివ్వడానికనర్హులు' అని ప్రకటించాడు. పులి అడవిలో కనపడే ప్రతి మేకలోనూ తనకి కాబోయే ఆహారాన్నే చూసిన చందాన 'రోడ్డు మీద పోయే ప్రతివాడూ ఈ రోజో, రేపో, కాకపోతే ఇంకో రోజో నాకు అప్పిచ్చేవాడే' అన్న తాత్విక దృష్టితో వ్యవహరిస్తాడు అప్పారావు.

ప్రస్తుతం సీన్ దగ్గరికొస్తే రామారావుకు ఒక్క నెల్లాళ్లలోపు తీర్చేస్తానని చెప్పి చేబదులుగా అయిదు వేల రూపాయలు తెచ్చాడు అప్పారావు. పెద్ద పండుగ వచ్చేస్తోంది. భార్యకి, పిల్లలకి కొత్త బట్టలు కొనాలనుకుంటున్న రామారావుకు చెప్పిన సమయానికి అప్పారావు తిరిగి ఇవ్వకపోవడంతో టెన్షన్ మొదలైంది. అదీ సంగతి.



'ఇలా కూచోవయ్యా, ఇంద ఈ కాఫీ తాగు ముందు' అని రామారావును స్థిమితపరిచేడు అప్పారావు. 'నీ అప్పు తీర్చకుండా ఎక్కడికి పోతాను?' అన్నాడు. 'ఇంతకీ నీ ప్యాంటు జేబులో ఎంత సొమ్ముంది చెప్పు?' అని కూపీ లాగేడు. రామారావు సామాన్యుడు. ఎంత సామాన్యుడంటే మోడీ గారు ప్రతి పేదవాడి బ్యాంక్ అకౌంట్‌లోనూ పదిహేను లక్షల రూపాయలు జమ అయిపోతాయని ప్రకటిస్తే నిజం అనుకొని నమ్మినవాడు. ఇంకా జమ కాలేదా అని అప్పుడప్పుడూ బ్యాంక్‌కి పోయి ఎంక్వైరీ చేసుకునే టైపు. అప్పారావు కబుర్ల మాయలో పడడంలో ఆశ్చర్యమేముంది?

ప్యాంట్ జేబులో నుంచి పర్సు తీసేడు. అందులో రూ.ఎనిమిది వేలు ఉన్నాయి. అప్పారావు ఆ నోట్లు చేతిలోకి తీసుకున్నాడు. అయిదు వేలు లెక్క పెట్టేడు. ఆ అయిదు వేలూ రామారావు చొక్కా జేబులో పెట్టేడు. 'ఇది నీ పాత అప్పు తీర్చేశాను' అన్నాడు. రామారావు ఈసారి అలర్ట్ అయ్యాడు. మరి 'ఇప్పుడు తీసుకున్న ఎనిమిది వేలు సంగతేమిట'ని పట్టుకున్నాడు. 'నువ్వు తెలివైన వాడివోయ్! ఇట్టే పట్టేశావు' అని మెచ్చుకుని అప్పారావు 'ఎనిమిదిలో అయిదు పోతే మిగిలినది మూడు, వీటిని తొందర్లో తీర్చేస్తాన్లే' అన్నాడు. రామారావు అయోమ యంగా బుర్ర ఊపి బయలుదేరేడు. గుమ్మం దాటే లోపు బుర్రలో బల్బు వెలిగింది. వెనక్కొచ్చి 'అయిదువేలు పాత బాకీ తీర్చమంటే అది మానేసి నా దగ్గర మరో మూడు వేలు లాగేశావే' అని అప్పారావును నిలేశాడు. అప్పారావు చిద్విలాసంగా నవ్వి 'పాత అప్పు తీరిపోయింది కదా! కొత్త అప్పు తీర్చేస్తాన్లే' అన్నాడు. కుదర దన్నాడు రామారావు. 'ఎందుకు కుదరదయ్యా! ఇది మోడీ రాజ్యం. బ్యాంకుల్లో అప్పులెగ్గొట్టిన వాళ్లకి పాత అప్పులు మాఫీ చేసి కొత్త అప్పులు ఇప్పించడం లేదా? నువ్వు మోడీ కంటే గొప్పవాడివా? జనాలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బుని కార్పొరేట్ దొంగలకి అప్పుగా ఇప్పించేడు మోడీ. వాళ్లు యథావిధిగా ఆ అప్పులు ఎగ్గొట్టారు. బ్యాంకులు గగ్గోలు పెట్టేయి. అప్పుడు 'నోట్ల రద్దు' అని ప్రకటించి మళ్లీ జనాల దగ్గరున్న సొమ్మునంతా బ్యాంకుల్లోకి చేర్చేడు మోడీ. ఇప్పుడు కూడా కార్పొరేట్ అప్పుల్ని మాఫీ చేయలేమని చేతులెత్తెయ్యడంతో బడ్జెట్‌లో నుంచి బ్యాంకుల రీక్యాపిటలైజేషన్ కోసం లక్షా ఆరు వేల కోట్ల రూపాయలు కేటాయించడానికి తయారయ్యాడు. బడ్జెట్లో డబ్బు ఎవరిది? జనాలది. బ్యాంకుల్లో డబ్బు ఎవరిది? జనాలదే. బ్యాంకులు నష్టపోవడం అంటే ఏంటి? జనం నష్టపోవడమే. ఆ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తున్నారు? మళ్లీ బడ్జెట్ నుండి జనాలే. ఇదీ మోడీ మాయ. అంతటి మహానుభావుడి ముందు నేనెంత? కార్పొరేట్లు ఎగ్గొట్టిన బాకీ రూ.పది లక్షల కోట్ల పైమాటే. ఆ మొత్తం ముందు నేను తీసుకున్న ఎనిమిది వేల రూపాయలు ఎంత? ఈ స్వల్ప విషయాలకు అంతగా వర్రీ కాకు. వెళ్లిరా' అని అప్పారావు రామారావుకు గీతోపదేశం చేసేడు. రామారావు బుర్ర గోక్కుంటూ ఇంటికి బయలుదేరేడు.

రాజ్‌మోహన్ గాంధీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు. ఈయన మహాత్మాగాంధీ కొడుకు దేవదాస్‌గాంధీ కుమారుడు. తల్లి లక్ష్మీ గాంధీ. స్వతంత్ర భారత తొలి ఉప రాష్ట్రపతి (రెండో గవర్నర్ జనరల్) చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ)కి తల్లి వైపు నుంచి మనుమడు. ఇద్దరు స్వాతంత్ర్య సమరశీలుర జీవన దార్శనికతకు ప్రతినిధిగా ప్రపంచానికి భారతీయ మేధో వారసత్వాన్ని తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా అందిస్తున్న ప్రతిభాశీలి. అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సౌత్ ఆసియన్ అండ్ మిడిల్ ఈస్ట్రన్ స్టడీస్ విభాగంలో పరిశోధక ఆచార్యునిగా పనిచేశారు. గాంధీ, వల్లభభాయ్ పటేల్, రాజాజీ, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ తదితరుల జీవిత చరిత్రలను, వివిధ చారిత్రక అంశాలపైనా ఎన్నో ప్రామాణికమైన పుస్తకాలు రాశారు.





దళిత, మహిళా సాధికారతే దేశ భవిష్యత్తు

సమకాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులు గమనిస్తుంటే దళిత, మహిళా సాధికారతతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందన్న సంకేతాలు బలంగా వ్యక్తమౌతున్నాయని మహాత్మాగాంధీ మనుమడు, ప్రముఖ జీవిత చరిత్రకారుడు రాజ్‌మోహన్ గాంధీ అన్నారు. విజయవాడలో ప్రారంభమైన 30వ పుస్తకమహోత్సవంలో పాల్గొనడానికి ఆయన తన సతీమణి ఉషాగాంధీతో హాజరయ్యారు. ఈ సందర్భంగా 'జీవన'తో ప్రత్యేకంగా సంభాషించారు. నేడు దేశంలో తలెత్తుతున్న పలు వివాదాస్పద అంశాలపై తన అభిప్రాయాన్ని సూటిగా పంచుకున్నారు. ఆ విశేషాలు.. ఆయన మాటల్లోనే ...

నేటి పరిస్థితుల్లో దేశ ప్రజల్ని ఎన్నోరకాల సంక్షోభాలు చుట్టుముడుతున్నాయి. అవి రాజకీయంగా, సామాజికంగా, మతపరమైనవి, ఆర్థికపరమైనవి కూడా. ఒక చరిత్ర రచయితగా ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా, ఎంతో ఆసక్తితో గమనిస్తున్నాను.

లౌకిక స్ఫూర్తి కాపాడాలి

పాలకులు రాజ్యాంగేతర శక్తిగా మతాన్ని ప్రోత్సహిస్తూ దానిని ప్రజల నెత్తిన పెట్టి, తాము లబ్ధి పొందాలని చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికప్పుడు బయటపడు తున్నాయి. వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మత భ్రమల్లో పడిపోకుండా రాజ్యాంగం తాలూకా లౌకికస్ఫూర్తిని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

స్వేచ్ఛకు భంగం

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 5 ద్వారా పౌరులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పిస్తున్నట్టు పేర్కొన్నప్పటికీ ప్రభుత్వాలు వాటికి అతీతంగా పాలన సాగిస్తున్నాయి. ఈ దేశంలో జన్మతహా ఎవరికైనా సరే పౌరసత్వం లభిస్తుందన్నది అతి సాధారణమైన విషయం. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఇందులో మత, కుల, లింగ వివక్షకు ఎలాంటి ప్రమేయం లేదు. అయినప్పటికీ పాలకులు పౌరుల్లో మతం, కులం, లింగపరమైన వివక్షలు రగిలిస్తూ వారిని సంక్షోభాల్లోకి నెట్టేసి, తాము మాత్రమే వారిని కాపాడగలమనే భ్రమలు కలిగిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలి. అప్పుడే ఇలాంటి చర్యలను తిప్పికొట్టగలరు.

చిచ్చు పెట్టే మందిర్ అజెండా


దేశ పౌరుల్లో చిచ్చుపెట్టేవి మత, రామమందిర్ వంటి అజెండాలు. ఇలాంటి వాటితో పెనవేసుకున్న రాజకీయ పార్టీలకు ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పి, వారిని ఇంటికి పంపించాలి. ప్రస్తుతం ఆ దిశగానే ప్రజల ఆలోచనలు సాగుతున్నాయి. దీనికి ఇటీవల తెలంగాణాతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలు, వాటి ఫలితాల తీరుతెన్నులే నిదర్శనంగా చెప్పొచ్చు. మత ఛాందసాన్ని దూరం పెట్టకపోతే ప్రపంచ దేశాలతో పోలిస్తే ఎంతో వెనుకబడిపోతామన్న అభిప్రాయం ఈనాటి యువతలో వ్యక్తమవుతోంది. ఇది ఎంతో ఆశావహమైన పరిణామం. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతించాలి.

అసమానతలు తగ్గాలి

దేశంలో చాలా మతాలు, కులాలు, వర్గాలు ఉన్నాయి. వారందరి మధ్య సామాజిక అసమానతల్ని, ఆర్థిక అసమానతల్ని తొలగించే ప్రయత్నాలయితే పెద్దగా జరగడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా, ఇది అసాధ్యమయ్యే అంశంగానే పాలకులు తమ విధానాలతో మార్చేశారు. అసమానతలను పెంచి పోషించడం తమ రాజకీయ, ఆర్థిక లబ్ధికి కీలమైన అంశంగా వివిధ రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. పాలన చేస్తున్న పార్టీ అయితే ఇలాంటి అజెండాతోనే కొనసాగుతోంది. కులమతాల్ని, పురుషాధిక్యతకు వత్తాసు పలుకుతూ మహిళలు, దళితులు, ముస్లిం మైనారిటీలపై వేధింపులకు, హింసాకాండలకు పాల్పడేవారికి ఊతమిస్తోంది. కానీ దళిత, మహిళా స్వయం సాధికారతపైనే ఈ దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్న వాస్తవాన్ని గ్రహించే పరిస్థితిలో పాలకులు లేరు.

రాజకీయ లబ్ధి కోసమే ...

ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుని గౌరవించడం, దానిని అమలయ్యేలా చూడడం పాలకుల, పౌరుల విధి. మతాన్ని రాజకీయాలతో కలిపేసిన కొన్ని పార్టీలు మహిళలు శబరిమల ఆలయంలో ప్రవేశించడాన్ని అడ్డుకుంటున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఇది కోర్టు ధిక్కారణ చర్య. ఆ ఆలయంలో మహిళలు ఎందుకు ప్రవేశించకూడదో వారు చెబుతున్న కారణాలు ఏమంత సహేతుకమైనవి కావు. మందిర్ అజెండాతో అధికారంలోకి వచ్చినవారి రాజకీయ లబ్ధికే ఈ వివాదం చేస్తుంది. అయితే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుని దశల వారీగా అమలు చేయడానికి అక్కడి ప్రభుత్వం సన్నాహాలు చేయాలి. క్షేత్రస్థాయిలో చర్చలకు, అభిప్రాయసేకరణకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. తీర్పుని అమలు కానీయకుండా అడ్డుకుంటున్న వారిలో అవగాహన కల్పించి, ఆలోచన పెంచాలి. ఎందుకంటే ఇది చాలా సున్నితమైన అంశం. ఇరువర్గాలు రెచ్చగొట్టుకోవడం వల్ల వివాదం ముదురుతుందేగానీ పరిష్కారం కుదరదు.



సంక్షోభంలోకి నెట్టడమే!

గోరక్షక ముఠాలు చేస్తున్న గూండాయిజం వివాదాలను రేపి, కొన్ని సామాజిక వర్గాలపై దౌర్జన్యం చేయడానికి మాత్రమే ఉపయోగ పడుతుంది. గోరక్షణ పేరుతో కొన్ని అసాంఘికశక్తులు ఉత్తరాది రాష్ట్రాలో ముస్లిం మైనారిటీ, దళిత సామాజిక వర్గాలపై దాడులకు పాల్పడుతున్నాయి. వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇది చాలా అమానుషం. వీరి దుశ్చర్యల వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో పాడిపరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులు, ఇతర వర్గాల ప్రజల జీవితాలు వీరి చర్యల వల్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

సామాజికోద్యమం అవసరం

సామాజిక అసమానతలపై కొత్త తరంలో అవగాహన పెరుగుతోంది. అయితే సమానత్వం కోసం ఉద్యమ దిశగా నడిపించే ప్రయత్నాలు జరగడం లేదు. ఇలాంటి అసమానతలపై స్వాతంత్ర్య పోరాట సమయంలోనే పెరియార్ రామస్వామి, అక్కమహాదేవి, నారాయణగురు వంటి నాయకులు ఎంతో పోరాటం చేశారు. వైకోమ్ సత్యాగ్రహం వంటి ఉద్యమాలు సాగించారు. ఎన్నో ఫలితాలు సాధించారు. వారి ఉద్యమ స్ఫూర్తి, ఆలోచనల ప్రభావం అంతర్లీనంగా ఇప్పటికీ ప్రజల భావాల్లో ప్రతిఫలిస్తోంది. అందువల్లే ఉత్తరాది రాష్ట్రాల్లో కన్నా దక్షిణాది రాష్ట్రాల్లో చైతన్యవంతులైన జనం ఉన్నారు. ఇక్కడ మత అజెండాలు, మందిర్ రాజకీయాలు, గోరక్షక్ వివాదాలు సాగవు. వాటికి ప్రోత్సాహం కూడా లభించదు.

స్వీయగౌరవానికి ప్రతీక

భీమ్ కొరెగామ్ దళితుల స్వీయ గౌరవానికి, సంఘటిత శక్తికి ఒక ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక స్థలం. అక్కడ అల్లర్లు సృష్టించడం ద్వారా పాలకపార్టీలు చేసిన కుట్రలు బహిర్గతమయ్యాయి. ఎన్నో వేల ఏళ్ల నుంచి దళితుల్ని అంటరానివారిగా, వివక్షకు గురిచేస్తున్న ఆనాటి సమాజంలో యూరోపియన్లు వారిలోని శక్తి సామర్థ్యాలను, అంకితభావాన్ని, శ్రమ సంస్కృతిని గుర్తించి, తగిన విధంగా ప్రోత్సహించారు. వారిని సైన్యంలో అవకాశమిచ్చి, వారి అస్తిత్వానికి ఊతమిచ్చారు. పీష్వాల అణిచివేతకు వ్యతిరేకంగా మహర్ సైనికులు సాగించిన ఆ మహత్తర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. దానిని అడ్డుపెట్టుకుని దళిత, ప్రజాతంత్ర ఉద్యమకారులపై అక్రమ నిర్బంధాలకు పాల్పడడం మంచిపద్ధతి కాదు.

నేటితరం కోసం

జీవితచరిత్రల అవసరం నేడు చాలా ఉంది. దేశం కోసం, దేశ ప్రజల కోసం నిరుపమాన త్యాగాలు చేసిన ప్రముఖుల జీవిత చరిత్రలు చాలా రాశాను. మహాత్మాగాంధీ, అబ్దుల్ గఫార్‌ఖాన్, రాజాజీ, పటేల్ వంటి నేతలు అరుదుగా ఉంటారు. ఆయా చారిత్రక సందర్భాల్లోని వ్యక్తులు వీరంతా. అటువంటి స్ఫూర్తివంతమైన జీవితాలు గడిపినవారి గురించి నేటి తరానికి అందించడం కర్తవ్యంగా భావించాను. ప్రజలకు ఏది మేలు చేస్తుందో దానిని సాధించేవరకూ విశ్రమించని పట్టుదలకు సంకేతాలు ఆ మహనీయులు. తమ మార్గానికి ఎన్ని అవరోధాలు ఎదురైనా, వాటిని అధిగమిస్తూనే ముందుకు సాగారు. వారి జీవితాలన్నీ నవతరానికి స్ఫూర్తి సంతకాలే.

మాటల్లో చెప్పలేని ప్రభావం


పుస్తకాల ప్రభావం మాటల్లో చెప్పలేనిది. అది కొన్ని సందర్భాలలో చాలా బలీయంగా ఉంటుంది. గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉన్న సమయంలో రైలులో ప్రయాణిస్తున్నప్పుడు హెన్రీ ఎడ్వర్డ్ పొల్లాక్ అనే ఆయన జాన్ రస్కిన్ రాసిన 'అన్ టు ది లాస్ట్' పుస్తకాన్ని ఇచ్చారట. ఆ పుస్తకం తన ఆలోచనల్ని ఎంతో ప్రభావితం చేసిందని గాంధీజీ అనేవారు. దానిని గుజరాతీలోకి 'సర్వోదయ' పేరుతో ఆయనే అనువాదం చేశారు. నేను టీనేజ్‌లో ఉన్నప్పుడు అలెన్ పేటన్ రాసిన 'క్రై ద బిలవ్డ్ కంట్రీ' పుస్తకాన్ని చదివాను. అది నాకు చాలా ప్రేరణ ఇచ్చింది. శరీర వర్ణం ఏదైనా మానవ హృదయ స్పందనలు ఒకటే అని చెప్పే ఈ పుస్తకం నన్నెంతగానో ప్రభావితం చేసింది.

సంభాషణ :
బెందాళం క్రిష్ణారావు, శాంతిశ్రీ

ఆధునిక దక్షిణ భారత చరిత్రపైనే

ఇటీవలే వెలువడిన నా తాజా రచన 'ఏ హిస్టరీ ఫ్రమ్ సెవంటీన్త్ సెంచరీ టూ అవర్ టైమ్స్' ప్రధానంగా ఆధునిక దక్షిణ భారతదేశ చరిత్రకు సంబంధించినది. దక్షిణాది రాష్ట్రాల చరిత్రను ఎలాంటి వక్రీకరణలకు, సొంత వ్యాఖ్యానాలకు తావు లేకుండా ఏ సమయంలో ఏం జరిగిందో పరిణామశీలతతో ప్రతిబింబించిన పుస్తకమిది. అంతకు ముందు వచ్చిన నా రచన 'ఏ టేల్ ఆఫ్ టూ రివోల్ట్స్' 19వ శతాబ్దంలో అటు అమెరికా, ఇటు ఇండియాలో వచ్చిన రెండు ప్రధానమైన తిరుగుబాట్లపై తులనాత్మక అధ్యయనం. భారత్‌లో ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన ప్రథమ స్వాతంత్ర్యపోరాటాన్ని, అమెరికా అంతర్యుద్ధాన్ని విశ్లేషించాను. అధ్యయనశీలురు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

- రాజ్‌మోహన్ గాంధీ





జర్నలిస్టు గాంధీ

ఆయన 1935, ఆగస్టు 7వ తేదీ (83 సంవత్సరాలు)న దేవదాస్ గాంధీ, లక్ష్మీగాంధీలకు జన్మించారు. ఆయన 1990–92 మధ్యకాలంలో ఉత్తరప్రదేశ్ నుండి రాజ్యసభ సభ్యులుగా పనిచేశారు. భార్య ఉషాగాంధీ, వీరికి ఇద్దరు పిల్లలు సుప్రియ, దేవదత్తా. రాజమోహన్‌గాంధీ బయోగ్రాఫర్‌గా పేరుపొందారు. ఈయన హిందుస్థాన్ టైమ్స్‌కు మేనేజింగ్ సంపాదకులుగా వ్యవహరించారు. న్యూఢిల్లీలోని కళాశాలలో చదివారు. అంతర్జాతీయ, మానవతావాద అవార్డు పొందారు.

బహుమతి పొందిన ముగ్గు



15 చుక్కలు, 5 వరుసలు, 5 వచ్చేవరకు.



పి. శృతి, కాణిపాకం, చిత్తూరు.



17 చుక్కలు, 3 వరుసలు, 3 నిలువ.



కె. పావని, హైదరాబాద్.

చిరునామా: 'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2. ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

ఎసిడిటీని.. నివారిద్దాం!

అసిడిటీ తగ్గించుకోవడానికి డాక్టర్ల దగ్గరకే పరుగు తీయక్కరలేదు. చిన్న చిట్కాలు పాటిస్తే చాలు ఎంతో ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

- తులసి ఆకులను నిత్యం మూడు పూటలా భోజనానికి ముందు నమలుతుంటే అసిడిటీ రాకుండా చూసుకోవచ్చు. అలాగే దీనివల్ల తిన్న ఆహారం కూడా సరిగ్గా జీర్ణమవుతుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపునే నాలుగైదు పుదీనా ఆకులను అలాగే నమిలి మింగాలి. పుదీనాలో ఉండే ఔషధ గుణాలు అసిడిటీని తగ్గిస్తాయి. భోజనం తరువాత పుదీనా ఆకుల రసాన్ని నీటిలో కలుపుకుని తాగినా.. అసిడిటీ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- భోజనం చేసిన తరువాత 20 నిమిషాలు ఆగి, కొబ్బరినీళ్లు తాగితే అసిడిటీ తగ్గుతుంది.
- కమలాపండ్ల రసాన్ని ఒక గ్లాస్ మోతాదులో తీసుకుని, కొద్దిగా జీలకర్ర పొడి కలిపి తాగితే అసిడిటీ నుంచి విముక్తి లభిస్తుంది.
- భోజనానికి ముందు గ్లాస్ గోరువెచ్చని నీటిలో ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ రాదు. ★



జీవన సౌరభం

మనకు తారసపడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత నేర్చుకోగలిగితే జీవితం సార్థకమైనట్లే.

మీకోసం

కిస్‌మిస్‌లను రాత్రి నానబెట్టి ఉదయాన్నే తింటే అజీర్తి సమస్యలు తగ్గుతాయి.



సెన్సెక్స్ ↓ 363
35,891

నిఫ్టీ ↓ 73
10,792

రూపాయి ↓ 73 పై
అమెరికా డాలరుకు రూ.
70.16

మంగత్‌రామ్ జ్యువెల్లరీస్‌కు పురస్కారం..

పి మంగత్‌రామ్ జ్యువెల్లరీస్ 2018లో అత్యంత ప్రాధాన్యం గల అభరణాల సంస్థగా పురస్కారాన్ని అందుకున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ముంబయిలో యుబిఎం ఇండియా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును బాలీవుడ్ హీరోయిన్ ఊర్వశి రౌతేలా చేతుల మీదుగా పి మంగత్‌రామ్ జ్యువెల్లరీస్ డైరెక్టర్ సంజయ్ గులబానీని ఈ అవార్డు అందుకున్నారని పేర్కొంది.



చెల్లింపుల్లో జెట్ ఎయిర్‌వేస్ విఫలం

న్యూఢిల్లీ : బ్యాంకులకు అప్పులు, వడ్డీలు చెల్లించడం లో తాము విఫలం అయిన ట్లు జెట్ ఎయిర్‌వేస్ ప్రకటన చేసింది. ఈ విమానయాన సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఎస్‌బిఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియంకు కట్టాల్సిన అసలు, వడ్డీ చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని అంగీకరించింది. 2018 డిసెంబర్ 31 గడువు నాటికి చేయాల్సిన చెల్లింపులను ఆలస్యం అవుతున్నాయని తెలిపింది. తాత్కాలికంగా నగదు నిల్వల్లో వచ్చిన తేడాలతో ఈ సమస్య ఏర్పడినట్లు పేర్కొంది. ఈ అంశంపై తాము బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. 25ఏళ్ల నుంచి విమాన సేవల్లో ఉన్న జెట్ ఎయిర్‌వేస్ గత కొన్ని నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. అప్పుల్లో కూరుకుపోవడంతో పైలట్లు, ఇతర సిబ్బందికి జీతాలు కూడా సరిగ్గా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జెట్ ఎయిర్‌వేస్‌ను కొనుగోలు చేయడానికి లేదా అందులో పెట్టుబడులు పెట్టడానికి ఓ దశలో టాటా గ్రూపు చర్చలు జరిపింది. అదే విధంగా అబుదాబికి చెందిన జెట్ ఎయిర్‌వేస్‌కు ఇప్పటికే ఈ సంస్థలో 24 శాతం వాటా ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో జెట్‌లో పెట్టుబడులు పెంచడానికి ఎతిహాద్ చర్చలు జరుపుతోంది. ముడిచమురు ధరల పెరుగుదల, బలహీన రూపాయి, చౌక చార్జీలు, తీవ్రమైన పోటీ తదితర అంశాలతో నరేష్ గోయల్ సారథ్యంలోని జెట్ ఎయిర్‌వేస్ తీవ్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లను లీజుకిచ్చిన సంస్థలకు, ఉద్యోగులకు చెల్లింపులు జరపడంలోనూ విఫలమవుతోంది. క్రితం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసిక ఫలితాల్లో జెట్ ఏకంగా రూ.1,261 కోట్ల నష్టాలు చవి చూసింది.

హెటిరో చేతికి స్పెయిన్ ఫార్మా కంపెనీ

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ హెటిరో గ్రూపునకు చెందిన యూరోపియన్ సబ్సిడరీ అమరొక్స్ లిమిటెబ్ స్పెయిన్ కేంద్రంగా పని చేస్తున్న టర్బిస్ ఫార్మాను స్వాధీనం చేసుకుంది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు చేసింది వివరాలను వెల్లడించలేదు. టర్బిస్ ఫార్మా స్పెయిన్‌లో పలు ఉత్పత్తులతో పాటు రిటైల్ వ్యాపారంలో మంచి మార్కెటింగ్ నెట్‌వర్క్ కలిగి ఉన్నట్లు హెటిరో పేర్కొంది. ఈ స్వాధీనం తమ సంస్థ మరింత పటిష్టానికి దోహదం చేయనుందని తెలిపింది. అమరాక్స్ వేదిక ద్వారా యూరోపియన్ యూనియన్‌లో మరింత మంది వినియోగదారులను చేరడంతో పాటు తమ ఉత్పత్తుల విక్రయాలను పెంచుకోవడానికి దోహదం చేయనుందని హెటిరో లాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎవి నరస రెడ్డి పేర్కొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ కొత్త ఆఫర్లు

హైదరాబాద్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ టెలికం బిఎస్ఎన్ఎల్ సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. ప్రీ పెయిడ్, బ్రాడ్‌బ్యాండ్, లాండ్‌లైన్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వాయిస్, డేటా ప్లాన్‌లను తీసుకువచ్చినట్లు ఆ సంస్థ తెలంగాణ సర్కిల్ సిజిఎం వి సుందర్ వెల్లడించారు. ప్రీ పెయిడ్ వినియోగదారుల కోసం 'వార్షిక-1699, 'వార్షిక ప్లస్-2099' పేరుతో రెండు ఆఫర్లను ప్రవేశపెట్టామన్నారు. వార్షిక -1699 ప్లాన్ వ్యాలిడిటీ 365 రోజులు కాగా.. ఢిల్లీ, ముంబయి మినహా సర్కిళ్లకు అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2జిబి అపరిమితి డేటా, వంద ఎస్ఎంఎస్‌లు, ఫ్రీ కాలర్ ట్యూన్ తదితర సేవలు అందిస్తున్నామన్నారు. అదే విధంగా టాప్-అప్స్‌లో పది శాతం అదనపు ప్రయోజనాలు అందిస్తున్నామన్నారు.

అమ్మకాల సెగ



- సెన్సెక్స్ 363 పాయింట్ల పతనం
- ఐదు రోజుల లాభాలకు గండి
- పడిపోయిన రూపాయి విలువ

ముంబయి : ఆటో, బ్యాంకింగ్ తదితర స్టాక్స్ అమ్మకాల సెగతో మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. దీంతో ఐదు రోజుల వరుస లాభాలకు గండి పడింది. అంతర్జాతీయ మార్కెట్లు కొత్త ఏడాదిలో నేల చూపులు చూడటంతో పాటు దేశీయంగా రూపాయి విలువ పడిపోవడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఈ నేపథ్యంలో బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 363 పాయింట్లు లేదా 1 శాతం నష్టపోయి 35,891కి దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 117 పాయింట్లు లేదా ఒక్క శాతం తగ్గి 10,792కు పడిపోయింది.

నిఫ్టీలో ఆటో సూచీ 3.05 శాతం పడిపోయింది. ముఖ్యంగా ఐచర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి స్టాక్స్ అమ్మకాలకు ఒత్తిడికి లోను కావడంతో ఈ రంగం సూచీ నష్టపోయింది. అదే విధంగా టాటా స్టీల్, వేదాంత స్టాక్స్ నేల చూపులు చూడటంతో లోహ సూచీ 3.41 శాతం క్షీణించింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ 1.26 శాతం, స్మాల్‌క్యాప్ 0.74 శాతం చొప్పున తగ్గాయి. డిసెంబర్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల్లో 13 శాతం తగ్గడంతో ఐచర్ మోటార్స్ 8.71 శాతం నష్టపోయింది. అదే విధంగా అప్పుల చెల్లింపుల్లో విఫలమైన జెట్ ఎయిర్‌వేస్ సూచీ 6.16 శాతం పతనమైంది. సెన్సెక్స్-30లో సన్ ఫార్మా 1.50 శాతం, టిసిఎస్ 0.93 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.66 శాతం, ఇన్ఫోసిస్ 0.46 శాతం, యస్ బ్యాంకు 0.24 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.21 శాతం చొప్పున మాత్రమే లాభపడ్డాయి. మిగితా 24 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. వేదాంత 4.35 శాతం, ఎంఅండ్ఎం 4.28 శాతం, టాటా స్టీల్ 4.18 శాతం, టాటా మోటార్స్ 3.23 శాతం, హీరో మోటో కార్ప్ 2.99 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. యూరోపియన్ స్టాక్స్ 2019 తొలి రోజు భారీ నష్టాలు చవి చూశాయి. ప్రపంచ వృద్ధి రేటుపై అనుమానాలు, వాణిజ్య యుద్ధ భయాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు, రాజకీయ అనిశ్చితి ప్రపంచ మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి.



73 పైసలు పతనం..

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 73 పైసలు పతనమై రూ.70.16 వద్ద ముగిసింది. గత నాలుగు రోజుల్లో అత్యధికంగా విలువ కోల్పోవడం ఇదే తొలిసారి. దేశీయ మార్కెట్లలో ఈక్విటీల అమ్మకాలకు తోడు డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయి విలువను దెబ్బతీసిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఉదయం డాలర్‌తో రూపాయి విలువ 69.60 పటిష్ట స్థాయి వద్ద ప్రారంభమైంది. ఓ దశలో ఏకంగా 70.23 కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం సెషన్‌లో రూపాయి విలువ 34 పైసలు బలపడింది.

ఎల్ఐసి చైర్మన్‌గా హేమంత్ భార్గవ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసి) తాత్కాలిక చైర్మన్‌గా హేమంత్ భార్గవ నియమితులయ్యారు. సోమవారం పదవీ విరమణ చేసిన వీకే శర్మ స్థానంలో ఆయనను నియమించింది ప్రభుత్వం. నూతన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కోసం ఇప్పటికే కేంద్రం వేట ప్రారంభించింది. ఫిబ్రవరి 2017లో భార్గవ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులై.. సంస్థ వృద్ధిలో కీలక పాత్ర పోశించారు. ఆయనతోపాటు మరో ఇద్దరు మేనేజింగ్ డైరెక్టర్లుగా ఉన్నారు.

నోకియా 106 ఫీచర్ ఫోన్ విడుదల

న్యూఢిల్లీ : హెచ్ఎండి గ్లోబల్ నూతన నోకియా ఫీచర్ ఫోన్ నోకియా 106 (2018)ను బుధవారం భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ధరను రూ.1299గా నిర్ణయించింది. ఇందులో 1.8 అంగుళాల డిస్‌ప్లే, 4ఎంబి ర్యామ్, 4ఎంబి ఇంటర్నల్ స్టోరేజ్, 2000 కాంటాక్ట్‌లు, 500 ఎస్ఎంఎస్‌లను స్టోర్ చేసుకునే వీలుంది. 800 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం కలిగి ఉంది.



వృద్ధిరేటు పెరగనుంది

- ఆర్థిక మంత్రిత్వ శాఖ రిపోర్టు

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20లో అధిక వృద్ధి రేటు నమోదు కానుందని బుధవారం ఒక రిపోర్టులో వెల్లడించింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడానికి పలు చర్యలు తీసుకున్నట్లు 2018 ఏడాది ముగింపు సమీక్షలో పేర్కొంది. ఈ మధ్య కాలంలో ప్రపంచ బ్యాంకు వెల్లడించిన రిపోర్టు ప్రకారం 2018లో సులభ వ్యాపారం ర్యాంకింగ్‌లో భారత్ 77వ స్థానానికి ఎగబాకినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమీక్ష ప్రకారం.. 2014-15 నుంచి 2017-18 మధ్య భారత వృద్ధి రేటు సగటున 7.3 శాతంగా నమోదయ్యింది. ప్రపంచంలోని ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే ఇది వేగవంతమైన వృద్ధి రేటుగా అభివర్ణించింది. 2018-19, 2019-20లో భారత్ అత్యంత వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలువనుంది.

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అక్టోబర్ 2018లో ఇదే విషయాన్ని పేర్కొంది. 2018-19 ప్రథమార్థంలో జిడిపి 7.6 శాతానికి చేరనుంది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ గాడిలో పడటంతో పాటు అధిక వృద్ధి రేటును సాధించనుంది.

తయారీకి ప్రోత్సాహం

దేశ ఆర్థిక వ్యవస్థలో విశ్వాసం నింపడానికి పలు చర్యలు తీసుకున్నట్లు ఈ రిపోర్టులో పేర్కొంది.

తయారీ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పాలసీలో మార్పులు, టెక్స్‌టైల్ పరిశ్రమకు ప్రత్యేక ప్రాకేజీ, మౌలిక వసతుల అభివృద్ధి, చౌక గృహాలు, తీర ప్రాంత కనెక్టివిటీపై దృష్టి సారించడం ద్వారా వృద్ధికి మద్దతు లభించింది. 2017-18లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 3.3 శాతానికి తగ్గింది. గత ఆరు ఏళ్లలో ఇదే అత్యల్పమని ఈ రిపోర్టు పేర్కొంది.

వర్తమానాంశాలు : అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉపాధి

ప్రపంచవ్యాప్తంగా స్త్రీ-పురుష అంతరాల్లో భారత్ స్థానం?



ఎ. ఉమామహేశ్వరరావు
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9985288150

అండమాన్ దీవుల పేర్లు మార్పు




అండమాన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ 2018 డిసెంబర్ 31న నికోబార్ దీవుల్లోని 3 దీవులకు కొత్త పేర్లను పెట్టారు.
- ద రోస్ ఐలాండ్ దీవికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ద్వీప్‌గా, ద నెయిల్ ఐలాండ్‌కి షాహీద్ ద్వీప్, హావ్‌లాక్ ఐలాండ్‌కి స్వరాజ్ ద్వీప్‌గా పేర్లను ప్రకటించారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చంద్రబోస్ తొలిసారి జాతీయ జెండాను ఎగరవేసి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయా పేర్లను పెడుతున్నట్లు మోడి వెల్లడించారు.
- ఈ సందర్భంగా 75 రూపాయల నాణేన్ని, నేతాజీ స్మారక స్టాంపును ప్రధాని విడుదల చేశారు. త్వరలోనే నేతాజీ పేరుతో విశ్వవిద్యాలయాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ప్రపంచ బ్లిట్జ్ ఛాంప్ మాగ్నస్ కార్ల్‌సన్




ప్రపంచ చెస్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ప్రపంచ బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నాడు.
- రష్యాలో జరిగిన ఈ టోర్నీలో మొత్తం 21 రౌండ్ల నుంచి 17 పాయింట్లు సాధించిన మాగ్నస్ కార్ల్‌సన్ అగ్రస్థానంతో టోర్నీని ముగించాడు. మాగ్నస్ కార్ల్‌సన్ ఈ టైటిల్ గెలవడం ఇది నాలుగోసారి.
- ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌ను రష్యా గ్రాండ్‌మాస్టర్ డానీ దుబోవ్ సొంతం చేసుకున్నాడు. విశ్వనాథన్ ఆనంద్ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో 23వ స్థానంలో, బ్లిట్జ్‌లో 46వ స్థానంలో నిలిచాడు.
- గాయం కారణంగా హరికృష్ణ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ నుంచి నిష్క్రమించాడు. మంచుపై జారిపడటంతో అతడి చేతికి గాయమైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్.బి.లోకూర్ పదవీ విరమణ




సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్.బి.లోకూర్ 2018 డిసెంబర్ 30న పదవీ విరమణ చేశారు. 2018 జనవరిలో అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా వ్యవహారశైలికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటుచేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ లోకూర్ ఉన్నారు.
- సుప్రీంకోర్టు జడ్జీలు, న్యాయవాదుల 2018 డిసెంబర్ 14నే జస్టిస్ లోకూర్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ 2018 డిసెంబర్ 30తో ఆయన పదవీకాలం పూర్తయింది.
- కేసు కేటాయింపు విషయంలో అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా తీరును వ్యతిరేకిస్తూ ప్రస్తుత సీజేఐ జస్టిస్ గొగోయ్, అప్పటి జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌తో కలిసి లోకూర్ మీడియా సమావేశంలో నిర్వహించారు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు కీలక కేసుల్లో తీర్పును వెలువరించారు. 1953, డిసెంబర్ 31న జన్మించిన లోకూర్, 1977, జులై 28న న్యాయవాదిగా పేరును నమోదు చేయించుకున్నారు.
- 2010-12 మధ్యకాలంలో గౌహతి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2012 జూన్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లోకూర్ పదోన్నతి పొందారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో కలిసి 47 కేసుల్లో కీలక తీర్పు ఇచ్చారు.

అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా రఘురాం



అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా 2019 సంవత్సరానికి 2018 డిసెంబర్ 30న డాక్టర్ రఘురాం బాధ్యతలు స్వీకరించారు.
- కిమ్స్ ఉషాక్ష్మి పేరిట రొమ్ము చికిత్స కేంద్రం డైరెక్టర్‌గా ఉన్న ఆయన డిసెంబరు 26-30 మధ్య చెన్నైలో ఏర్పాటైన 78వ సర్వసభ్య సమావేశంలో నూతన విధులు చేపట్టారు.
- 2020 సంవత్సరానికి ఏఎస్ఐ ప్రెసిడెంట్‌గా రఘురాం వ్యవహరిస్తారు. దేశవ్యాప్తంగా 10,000 మంది శస్త్రచికిత్స నిపుణులు హాజరైన చెన్నై సమావేశంలో కల్నల్ పండాల్కె స్మారక ఉపన్యాసమిచ్చే అరుదైన గౌరవాన్ని రఘురాం సొంతం చేసుకున్నారు.
- తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్, ముఖ్యమంత్రి పళనిస్వామి నుంచి ఆయన కల్నల్ పురస్కారాన్ని అందుకున్నారు.

బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ మృతి



బెంగాలీ దర్శకుడు మృణాల్‌సేన్ (95) 2018 డిసెంబర్ 30న కోల్‌కతాలో మృతి చెందారు. సమాజ స్థితిగతులకు అద్దంపట్టే చిత్రాలను కళాత్మకంగా ఆవిష్కరించిన మృణాల్‌సేన్ 'భువన్ షోమ్' చిత్రంతో భారతీయ సినీ చరిత్రపై చెరగని ముద్ర వేశారు.
- 30కి పైగా చిత్రాలను రూపొందించారు. ఖరీజ్, ఏక్ దిన్ ప్రొతిదిన్, ఖాన్‌దార్ లాంటి చిత్రాలు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకొన్నాయి.
- తెలుగులో సేన్ రూపొందించిన 'ఒక ఊరి కథ' ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ పురస్కారం అందుకుంది.


నలుగురు సమాచార కమిషనర్ల నియామకం

కేంద్ర సమాచార కమిషన్(CIC) లో కొత్తగా నలుగురు సమాచార కమిషనర్లు నియమితులయ్యారు.
- సమాచార కమిషనర్లుగా మాజీ ఉన్నతాధికారులు యశ్వర్ధన్ కుమార్ సిన్హా, వనజ ఎన్ సర్నా, నీరజ్‌కుమార్ గుప్తా, సురేశ్‌చంద్ర నియామకానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపారు. సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో కలిపి 11 మంది సమాచార కమిషనర్లు ఉండొచ్చు.
- తాజా నియామకాలతో వారి సంఖ్య ఏడుకు చేరుకుంది. యశ్వర్ధన్ కుమార్ సిన్హా 1981 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీసు (ఐఎఫ్ఎస్) అధికారి. బ్రిటన్‌లో భారత హై కమిషనర్‌గా పనిచేశారు.
- కీలకమైన పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్-ఇరాన్ డివిజన్‌లోనూ అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. వనజ ఎన్ సర్నా 1980 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీసు (ఐఆర్ఎస్) అధికారి.
- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ చీఫ్‌గా పనిచేశారు. ప్రస్తుతం సీఐసీలో ఏకైక మహిళ ఆమే.
1982 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నీరజ్ పెట్టుబడు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- కేంద్ర న్యాయశాఖ కార్యదర్శిగా సురేశ్ ఈ ఏడాది పదవీ విరమణ పొందారు. సిన్హా, సర్నా, నీరజ్ కూడా ఈ ఏడాదే పదవీ విరమణ పొందారు.
CIC-Central Information Commission

తెలంగాణ శాంతిభద్రతల వార్షిక నివేదిక 2018

తెలంగాణ రాష్ట్రంలో 2018లో నేరాలు తగ్గుముఖం పట్టాయి. 2017తో పోల్చుకుంటే ముఖ్యమైన నేరాలు 5 శాతం తగ్గాయి.
- 2018లో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై 2018 డిసెంబర్ 30న హైదరాబాద్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి వార్షిక నివేదిక విడుదల చేశారు.
- శిక్షా శాతం పెరిగింది. జీవిత ఖైదు 11%, ఇతర ముఖ్యమైన నేరాల్లో 5%, మొత్తం మీద అన్ని కేసులు కలిపి 2% శిక్షలు పెరిగాయి.
- 2016లో 348, 2017లో 162, 2018లో 385 మందిపై పీడీ చట్టం ప్రయోగించారు.
- 2017లో 98 మందికి, 2018లో 109 మందికి జీవిత ఖైదు పడింది.
- రాష్ట్రానికి చెందిన 126 మంది మావోయిస్టు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. 17 మంది ఉన్న కేంద్రకమిటీలో 10 మంది తెలంగాణ వారే.
- తెలంగాణ రాష్ట్రకమిటీలో ఉన్న 82 మందిలో 18 మంది మాత్రమే ఈ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా వారంతా చత్తీస్‌గఢ్‌కు చెందినవారు.
- 2018లో మొత్తం ఎదురు కాల్పుల ఘటనలు మూడు జరగ్గా, 19 మంది మావోయిస్టులు మరణించారు. 120 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 10 మంది లొంగిపోయారు.
- సైబర్ నేరాలు 9,418 నుంచి 9,199కు తగ్గాయి.

అమెరికాలో దినపత్రికలపై సైబర్ దాడి



అమెరికాలో దినపత్రికలపై సైబర్ దాడి చోటు చేసుకుంది. దీంతో 2018 డిసెంబర్ 29న కొన్ని ప్రధాన పత్రిక ముద్రణ, పంపిణీ ఆలస్యమైంది. దేశవ్యాప్తంగా పలు దినపత్రిక ముద్రణ ప్రక్రియ చేపట్టే 'ట్రిబ్యూన్ పబ్లిషింగ్' కంప్యూటర్ నెట్‌వర్క్‌ను సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. అందులోకి మాల్‌వేర్‌ను చొప్పించారు. దీంతో లాస్ ఏంజిలెస్ టైమ్స్, శాన్ డీగో యూనియన్ ట్రిబ్యూన్, షికాగో ట్రిబ్యూన్, వాల్ స్ట్రీట్ జర్నల్, న్యూయార్క్ టైమ్స్ పత్రికలు కొన్ని గంటలు ఆలస్యంగా వినియోగదారులకు అందాయి.

ఆర్‌బీఐ రిటైల్ చెల్లింపు అలవాట్లను క్యాప్చర్ చేయడానికి సర్వే ప్రారంభం

ఆరు నగరాల్లో ఆర్‌బీఐ రిటైల్ చెల్లింపు అలవాట్లను క్యాప్చర్ చేయడానికి సర్వే ప్రారంభించింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, గువహతి. Survey on Retail Payment Habits of Individuals (SRPHi%). RBI 25th Governor: Shaktikanta Das. Headquarters: Mumbai Founded: 1 April 1935, Kolkata ★

స్త్రీ, పురుష అంతరాల్లో భారత్‌కు 108వ ర్యాంకు

ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుష అంతరాలకు అద్దంపట్టే 'గ్లోబల్ ర్యాంకింగ్'లో భారత్‌కు 108వ ర్యాంకు లభించింది. - వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) 149 దేశాలపై జెండర్ గ్యాప్ రిపోర్టు, 2018ను వెల్లడించింది. గత సంవత్సరంలో కూడా భారత్‌కు 108వ ర్యాంకు లభించింది. - ఆర్థిక భాగస్వామ్యం-అవకాశాలు, విద్య, ఆరోగ్యం-మనుగడ, రాజకీయ సాధికారత అంశాల (సబ్ ఇండెక్స్) ఆధారంగా డబ్ల్యూఈఎఫ్‌ఈ ర్యాంకులిచ్చింది. - నివేదిక ప్రకారం భారత్ వేతన వ్యత్యాసాలను తగ్గించడంలో కొంత ప్రగతి సాధించింది. విద్యా రంగంలో 114వ స్థానంతో మెరుగైన పనితీరు కొనసాగించింది. స్త్రీలను ఆర్థికవ్యవహారాల్లో భాగస్వామిగా చేయడం, అవకాశాలు కల్పించడంలో వెనకబడింది. - ఈ విభాగంలో భారత్ 142వ ర్యాంక్‌తో సరిపెట్టుకుంది. రాజకీయ సాధికారత విషయంలో గత ఏడాది 15వ ర్యాంక్‌రాగా, ఈసారి 19కి పడిపోయింది. స్త్రీ 'ఆరోగ్యం-మనుగడ' సూచీలో అట్టడుగుకు చేరింది. - గత సంవత్సరం 141 స్థానంలో ఉండగా ఈ యేడాది 147 స్థానానికి దిగజారింది. ఆర్మీనియా (148), చైనా (149) చివరి రెండు స్థానాల్లో వున్నాయి. ఈ విభాగంలో ఒకటో స్థానానికి చేరిన దేశాల్లో శ్రీలంక కూడా వుంది. - ర్యాంకింగ్ పరంగా తొలి 8 స్థానాల్లోని దేశాలు తమ దేశాల్లో 80 శాతం వరకు అసమానతను రూపు మాపాయని నివేదిక తెలిపింది. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే స్త్రీ-పురుష అంతరాలను పూడ్చే దిశగా దక్షిణాసియాలో మెరుగైన కృషి జరిగిందని నివేదిక పేర్కొంది. - ప్రపంచవ్యాప్తంగా సగటు తీసుకుంటే రాజకీయ సాధికారత విషయంలో ఎక్కువ అంతరం (77.1 శాతం) ఉంది. ఆర్థిక భాగస్వామ్యం-అవకాశాల విషయంలోనూ (41.9 శాతం) అంతరం ఎక్కువగా ఉంది. - విద్య (4.4శాతం), ఆరోగ్యం- మనుగడ (4.6 శాతం) అంశాల్లో వ్యత్యాసాలను బాగా తగ్గించగలిగారు. మార్పు ఇలా మందగమనంతో సాగితే స్త్రీ పురుషుల మధ్య అంతరాలను మొత్తంగా రూపుమాపాలంటే మరో 108 ఏళ్లు పడుతుందని నివేదిక పేర్కొంది.
- బంగ్లాదేశ్ దక్షిణాసియా విభాగంలో టాప్ ర్యాంకు (48) సాధించింది. రాజకీయ సాధికారత విషయంలో ముందడుగేసి బంగ్లాదేశ్ మెరుగైన ర్యాంక్ పొందింది. అంతర్జాతీయంగా 8వ ర్యాంకు సాధించిన ఫిలిప్పీన్స్.. ఆసియాలో ర్యాంకింగ్ పరంగా తొలి స్థానంలో ఉంది. - చైనా 100 నుంచి 103కి దిగజారింది. పాకిస్తాన్ చివరి నుంచి రెండో స్థానంలో ఉండగా, యుద్ధంతో సతమతమవుతున్న యెమెన్ చివరి స్థానంలో ఉంది. ఐరోపాలోని ఐస్‌ల్యాండ్, నార్వే, స్వీడన్ వరసగా మొదటి మూడు ర్యాంకులు సాధించాయి. ఫిన్లాండ్, నికరాగువా, రువాండా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. బ్రిటన్ 15, కెనడా 16, అమెరికా 51, ఆస్ట్రేలియా 53వ ర్యాంకు సొంతం చేసుకున్నాయి.

కంచర్ల రంగారావు మృతి

ప్రజాశక్తి - విజయవాడ : రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గన్నవరం మండలం అజ్జంపూడికి చెందిన కంచర్ల రంగారావు(74) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామంలోనే నివశిస్తున్నారు. ఆయన పెద్దకుమారుడు జేవియర్ రాజు ప్రజాశక్తిలో సంపాదకవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నాడు. మరణ వార్త తెలుసుకున్న అనంతరం ప్రజాశక్తి సంపాదకులు ఎం.వి.ఎస్.శర్మ, డిప్యూటీ ఎడిటర్ తులసీదాసు, సంపాదకవర్గ సభ్యులు అన్నపురెడ్డి కోటిరెడ్డి, వి.సురేష్, బి.అమరనారాయణ తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ మోహనగాంధీ



లౌకిక వాదానికి పెనుముప్పు

ప్రొఫెసర్ రాజమోహన్‌గాంధీ ఆందోళన ● 'తెలుగునాట గాంధీబాట' పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో లౌకిక వాదానికి పెనుముప్పు ఏర్పడిందని మాజీ ఎంపి, మహాత్మాగాంధీ మనమడు రాజమోహన్ గాంధీ ఆందోళన వెలిబుచ్చారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ రాసిన 'తెలుగునాట గాంధీబాట' పుస్తకాన్ని స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. 'గాంధీ సిద్ధాంతాలు-నేటి ఆవశ్యకత' అంశంపై నిర్వహించిన సదస్సులో రాజమోహన్‌గాంధీ మాట్లాడుతూ 1946-48 మధ్య కాలంలో ఉన్న పరిస్థితులు మళ్లీ ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ జీవితం దేశానికి ఒక స్ఫూర్తి, దిక్సూచి అని చెప్పారు. దేశంలో నిరుద్యోగం పెరగుతోందని, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలన్నారు. నిరుద్యోగంతో యువతలో అశాంతి పెరిగితే దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు పెంచకపోతే రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలుకు విఘాతం ఏర్పడినట్లేనని చెప్పారు. దేశంలోకి ఇతర దేశాల నుంచి చొరబాట్లను కఠినంగా నియంత్రించాలనీ, ఈశాన్య రాష్ట్రాల్లోకి 30 ఏళ్ల కిందట వచ్చిన అనేక మంది చొరబాటు దారులకు మానత్వంతో ఇక్కడ జీవించే అవకాశం ఇవ్వాలనీ, వారికి కాకుండా వారి పిల్లలకు మాత్రం ఓటు హక్కు ఇవ్వాలనీ ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రతి ఒక్కరూ బహుభాషలను నేర్చుకోవాలని, దక్షిణాది రాష్ట్రాల్లో చాలా మంది బహుభాషలు వచ్చిన వారు ఉన్నారని కొనియాడారు. ఎక్కువ భాషలు రావడం వల్ల దేశ సమగ్రత పరిఢవిల్లుతుందన్నారు. దక్షిణాదిలో ఒక రాష్ట్రం పట్ల మరో రాష్ట్రానికి శతృత్వం లేదని ఆయన పేర్కొన్నారు.

సహకార ఉద్యోగుల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి యంత్రాంగం : సహకార ఉద్యోగుల ఆందోళన కొనసాగుతోంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగుల సమ్మె 17వ రోజుకు చేరింది. కర్నూలులో నిరసనకు కెడిసిసి ఛైర్మన్ మల్లిఖార్జున రెడ్డి సంఘీభావం తెలిపారు. కాట్రేనికోన, రామచంద్రాపురం డిసిసిబి బ్యాంకుల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వ ంతో తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ఎంపిడిఒ కార్యాల యం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. నరసాపురంలో సహకార కేంద్ర బ్యాంకు వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియ జేశారు. శ్రీకాకుళం సమ్మె శిబిరం వద్ద పిఎసిఎస్ ఉద్యోగు లు రక్తదానం చేసి వినూత్న రీతిలో తమ నిరసన తెలిపారు.

కరాటే, ఈత పోటీల్లో ఈడ్పుగల్లు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెనమలూరు

జాతీయ స్థాయిలో ఈత, కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందని కృష్ణా జిల్లా ఈడుపుగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.ప్రభాకర్ అన్నారు. జాతీయ స్థాయిలో ఈత, కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జి.సంపత్ కుమార్ యాదవ్ చిన్నతనం నుండే ఈత పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రశంసా పత్రాలు, గోల్డ్ మెడల్స్ సాధించాడని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికై స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఢిల్లీలో నిర్వహించిన ఈత పోటీల్లో ప్రతిభ చూపి ఆరో స్థానంలో నిలిచాడని చెప్పారు. ఏడో తరగతి చదువుతున్న టి.చేతన్ కరాటే పోటీల్లో జూనియర్స్ విభాగంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందాడని తెలిపారు. 5, 6 తేదీల్లో కర్ణాటకలో జరుగబోయే ఇంటర్‌నేషనల్ కరాటే పోటీల్లో పాల్గొంటున్నాడని తెలిపారు. తమ పాఠశాలకు పేరుతెచ్చిన వీరిద్దరినీ ప్రధానోపాధ్యాయునితో పాటు పీడీ దుర్గాభవానీ, ఉపాధ్యాయులు విఎస్ఆర్ఎం మూర్తి, బి.సుభాషిణి అభినందించారు.

విభజన హామీల్లో విశాఖ రైల్వే జోన్ లేదు : కన్నా

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్ర విభజన హామీల్లో విశాఖ రైల్వే జోన్ లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. విభజన హామీల్లోవి కానప్పటికీ విశాఖ రైల్వేజోన్, దుగ్గరాజుపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం ఐదు పార్లమెంటు నియోజకవర్గాల్లోని బూత్ కమిటీ, శక్తి కేంద్రాల సభ్యులతో ఫోన్ ఇన్ ట్రాక్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం కూడా ఉంది. ఈ నేపథ్యంలో విజయనగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన లక్ష్మీనారాయణ విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుకు నిజం చెప్పే అలవాటులేదని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేయవలసినవన్నీ చేసిందన్నారు. విజయనగరం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ, ఎయిర్ పోర్టు మంజూరు చేసిందని చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1. హేమంత్ భార్గవ్
2.బెంగాల్ జట్టు
3.జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్
4.పికె పింగ్
5.పశ్చిమ బెంగాల్

సార్వత్రిక సమ్మె జయప్రదానికి విస్తృత ప్రచారం

పలుచోట్ల పాదయాత్రలు, జీపుజాతాలు, ప్రదర్శనలు, సమావేశాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఈ నెల 8, 9 తేదీల్లో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు, వివిధ కార్మికసంఘాలు ఆధ్వర్యాన బుధవారం పాదయాత్రలు, జీపు జాతాలు, ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, సన్నాహక సమావేశాలు, పోస్టర్ ఆవిష్కరణలు తదితర రూపాల్లో ప్రచారయాత్రలు నిర్వహించారు. పలుచోట్ల కార్మికులతో సమావేశాలు నిర్వహించి, సమ్మె ప్రాధాన్యతను, జయప్రదం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

విజయనగరం జిల్లా పార్వతీపురంలో భవన నిర్మాణ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు పాదయాత్ర చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో సమ్మె సన్నాహక సదస్సు నిర్వహించారు. సమ్మె పోస్టర్‌ను సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసు, డి.గోవిందరావు ఆవిష్కరించారు. విశాఖజిల్లా చినగంట్యాడ సిఐటియు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనకాపల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు. కె.కోటపాడులో సిఐటి యు ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఎఐటియుసి, సిఐటియు, ఇఫ్టూ, ఐఎన్‌టియుసి ఆధ్వర్యాన జీపు జాతాను ప్రారంభిం చారు. జాతాలో అన్నిరంగాల ఉద్యోగ, కార్మికులు పాల్గొని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని అన్నే భవనంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పోలవరంలో జీపు యాత్ర ప్రారంభమైంది. భీమడోలులో విజయ డెయిరీ కార్మికుల వద్దకు వెళ్లి సమ్మె ఆవశ్యకతను సిఐటియు నాయకులు వివరించి, వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. తాళ్లపూడిలో సిఐటియు ప్రచారయాత్ర సాగింది. ఏలూరులో ఇఫ్టూ అనుబంధ పట్టణ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యాన ర్యాలీ చేశారు. తణుకులో సమ్మె పోస్టర్‌ను సిఐటియు నాయకులు



తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జాతా నిర్వహిస్తున్న నాయకులు

ఆవిష్కరించారు.

గుంటూరు జిల్లా మంగళగిరిలో అన్ని కార్మిక సంఘాలతో సదస్సు నిర్వహించగా, సిఐటియు గుంటూరు తూర్పు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు మాట్లాడారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య నగర్‌లో నిర్వహించిన కార్మికుల సమావేశంలో సిఐటియు గుంటూరు తూర్పు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడారు. కారంపూడిలో సమ్మె సన్నాహక సమావేశంలో సిఐటియు గుంటూరు పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్, పిడుగురాళ్లలో నిర్వహించిన సదస్సులో సిఐటియు పల్నాడు డివిజన్ అధ్యక్షులు ఏపూరి గోపాలరావు మాట్లాడారు. కృష్ణాజిల్లాలో పలుచోట్ల సిఐటియు, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కంచికచర్లకు చెందిన పారిశుధ్య కార్మికులు గ్రామ కార్యదర్శి వి.బ్రహ్మంకు సమ్మె నోటీసును అంద జేశారు. మండవల్లిలో సమ్మె వాల్‌పోస్టర్ ను భవన నిర్మాణ కార్మికులు ఆవిష్కరిం చారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని చిత్తూరు జిల్లా పుత్తూరు సిఐటియు కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. శ్రీకాళహస్తిలోని ఆర్టీసి సర్కిల్ వద్ద శ్రీసిటి, గ్రీన్‌ప్లే, ల్యాంకో, అమరరాజ, కోకోకోలా కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు సమ్మె కరపత్రాలను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణబాబు ఆధ్వర్యాన మంగళవారం రాత్రి పంచిపెట్టారు. దేశవ్యాప్త సమ్మెలో సివిల్ సప్లై హమాలీ యూనియన్ పాల్గొంటున్నట్లు అనంతపురం జిల్లా హిందూపురం దక్షిణ ప్రాంత నాయకులు తెలిపారు. సమ్మె నోటీసును సివిల్ సప్లై అధికారి జయశేఖర్‌కు అందజేశారు. అనంతపురంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజారామిరెడ్డి ఆధ్వర్యాన సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కర్నూలులో సిఐటియు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నంద్యాలలో ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రచార కార్యక్రమంలో భాగంగా జీపు ప్రచార జాతా ఒంగోలులోని ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఆవరణలో ప్రారంభమైంది. సిఐటియు తూర్పు ప్రకాశం జిల్లా అధ్యక్షులు సిహెచ్ మజుందర్, ఎఐటియుసి జిల్లా నాయకులు కె వెంకటేశ్వర్లు జెండాఊపి జాతాను ప్రారంభించారు.

గౌతంరెడ్డికి షోకాజ్ నోటీసు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మరోసారి వివాదాల్లో చిక్కుకున్నారు. ఓ టివి ఛానల్ ఇంటర్వ్యూలో ముస్లింల మనోభావాలను కించపరిచేలా మాట్లాడినందుకుగాను పార్టీ ఆగ్రహానికి గురయ్యారు. ఈ మేరకు బుధవారం పార్టీ క్రమశిక్షణా సంఘం ఆయనకు నోటీసు జారీ చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నోటీసు జారీ చేసినట్లు పేర్కొంది. పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయకూడదు, ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదనే అంశంపై మూడు రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేసింది. నోటీసును స్వయంగా గౌతంరెడ్డికి అందజేసినట్లు తెలిపింది. గతంలో వంగవీటి రంగా హత్యపై కూడా ఇదే తరహాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పార్టీ నుంచి గౌతంరెడ్డి సస్పెండ్ అయ్యారు. కృష్ణా జిల్లాలో జగన్ పాదయాత్ర సమయంలో గౌతంరెడ్డిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. దీంతో ఆయన తిరిగి వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా నియమితులయ్యారు.

సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - వినుకొండ (గుంటూరు జిల్లా)

దెబ్బతింటున్న పంటలను కాపాడుకోవడానికి సాగునీరు విడుదల చేయాలని గుంటూరు జిల్లా నూజెండ్ల మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో.. వారికి మద్దతుగా వైసిపి నాయకుల బైఠాయింపు, పోలీసుల జోక్యం వెరసి ఉద్రిక్తలకు దారితీసింది. వివరాల ప్రకారం.. సాగునీటి కోసం రైతులు నూజెండ్లలోని రాష్ట్ర రహదారిపై ఉదయం 11 గంటలకు రాస్తారోకో చేపట్టారు. వీరికి మద్దతుగా వైసిపి వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు రోడ్డుపై బైఠాయించారు. ఒంటిగంట అనంతరం బయ్యారం హెడ్‌రెగ్యులేటర్ పిబిసి (పమిడిపాడు బ్రాంచ్ కెనాల్) వద్దకు రైతులతో వెళ్లిన బ్రహ్మనాయుడు లాకుల వద్ద బైఠాయించారు. సాయంత్రం 4 గంటల వరకు కెనాల్ రెగ్యులేటర్ వద్దే ఆందోళన కొనసాగింది. సమాచారం అందుకున్న ఎన్ఎస్‌పి (నాగార్జున సాగర్ ప్రాజెక్ట్), రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ప్రత్యేక బలగాలనూ రప్పించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఆందోళన విరమించాలని కురిచేడు తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. అరెస్టులు చేయాల్సి వస్తుందని దర్శి సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సాగు నీరు విడుదల చేసే వరకూ ఆందోళన విరమించేది లేదని బొల్లా, రైతులు స్పష్టం చేశారు. దీంతో పోలీసులకు, బొల్లాకు వాగ్వాదం తలెత్తింది. బొల్లా ఆరెస్టుకు పోలీసులు సిద్ధమవడంతో రైతులు, వైసిపి కార్యకర్తలు అడ్డుపడ్డారు. బొల్లాను బలవంతంగా తీసుకెళ్లే క్రమంలో ఆయనకు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. దీంతో ఆయన్ను దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆరోగ్యం కుదుటపడడంతో రాత్రి డిశ్చార్జి చేశారు. మరోవైపు బొల్లా ఆరెస్టును నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో వినుకొండలో శివయ్య స్తూపం సెంటర్‌లో ఆందోళనకు దిగారు. సిఎం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

పెథాయ్ సాయం అందించకపోవడంపై మత్స్యకారుల ధర్నా

అధికారుల నుంచి ఆదేశాలు రాలేదు : డీలర్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పెథాయ్ తుపాను బాధితులకు వెంటనే సాయమందించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ దుమ్ములపేటకు చెందిన మత్స్యకారులు బుధవారం రేషన్‌షాపుల వద్ద ధర్నా చేశారు. కాకినాడ 10వ డివిజన్‌లోని దుమ్ములపేట సముద్రతీర ప్రాంతాన్ని ఆనుకుని ఉంది. ఇక్కడ సుమారు ఎనిమిదివేల మంది నివసిస్తున్నారు. వీరిలో దాదాపు మూడు వేల మంది మత్స్యకారులు చేపలవేట ఆధారంగా జీవిస్తున్నారు. కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు దత్తత తీసుకున్నారు. గతేడాది డిసెంబర్ 17న తీరం దాటిన పెథాయ్ తుపాను వల్ల వారం రోజులపాటు ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 18న జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అదే నెల 20వ తేదీలోగా నిత్యావసర సరుకులను అందజేయాలని ఆదేశాలిచ్చారు. 50 కేజీల బియ్యం, ఒక్కో కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, కేజీ పామాయిల్, అరకిలో పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. దుమ్ములపేటలో షాపు నెంబర్ 24, 25కు గత నెల 20న సరుకులు చేరుకున్నప్పటికీ అధికారులు వాటిని పంపిణీ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారంటూ మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం సరుకులు పంపిణీ చేయాలని మైలపల్లి జాన్, ఓసూపల్లి దుర్గాభవాని తదితరులు డిమాండ్ చేశారు. కొద్దిసేపు రేషన్ దుకాణాల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. దుకాణాలకు చేరుకున్న కుళ్లిపోయిన బంగాళా దుంపలు, మొలకలు వచ్చిన ఉల్లిపాయలను చూపి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కావాలనే తమకు సరుకులు ఇవ్వకుండా నిలుపుదల చేశారని ఆరోపించారు. దీనిపై రేషన్ డీలర్లు కిషోర్, వెంకట్రావులను ప్రజాశక్తి ప్రశ్నించగా సరుకులను పంపిణీ చేయాలనే ఆదేశాలు అధికారుల నుంచి ఇంకా రాలేదని తెలిపారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల ర్యాలీ

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

న్యూకోచింగ్ కాంప్లెక్స్‌లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న 'రాంపా ఎయిర్ కాన్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రైల్వే కాంట్రాక్టు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ డిఆర్ఎం కార్యాలయం వరకు సాగింది. అనంతరం డిఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాంపా ఎయిర్ కాన్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. 2018 అక్టోబరు 1వ తేదీ నుంచి రావాల్సిన ఎరియర్స్ చెల్లించలేదని తెలిపారు. నవంబరు నెల జీతాలు ఇంతవరకూ చెల్లించలేదని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణం రైల్వే ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ర్యాలీలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి కిడ్నాప్...హత్య!

ప్రజాశక్తి- శింగనమల

అనంతపురం జిల్లా శింగనమల మండలానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. అతడిని కిడ్నాప్ చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండలం, బొందలేడు గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (22) జెసిబి ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత వారం రోజుల నుంచి అతను కనిపించడం లేదు. ఈ మేరకు అతని తల్లిదండ్రులు శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంలో అదే జెసిబిని మరో ఆపరేటర్ రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామానికి చెందిన సందీప్‌కుమార్ తన స్నేహితుడైన మోహన్‌బాబుకు ఫోన్ చేసి రాజకుమార్‌ను కిడ్నాప్ చేశానని తనకి రూ.2 లక్షలు నగదు ఇస్తేనే అతన్ని అప్పగిస్తానని చెప్పాడు. దీంతో మోహన్‌బాబు విషయాన్ని రాజ్‌కుమార్ తల్లిదండ్రులకు తెలిపాడు. కిడ్నాపర్ సందీప్‌కుమార్ కరీంనగర్ జిల్లా జగిత్యాలలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం చేరింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా రాజ్ కుమార్‌ను హత్య చేసి పాతిపెట్టినట్టు నిందితుడు ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. పోలీసుల విచారణలో వాస్తవాలు తెలియాల్సి ఉంది.

'తూర్పు' మన్యంలో

విజృంభిస్తున్న కిడ్నీ వ్యాధులు

- పది రోజుల్లో ముగ్గురు మృతి
- చింతూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా మన్యం మరో ఉద్దానంలా మారుతోంది. 10 రోజుల్లోనే ముగ్గురు కిడ్నీ వ్యాధితో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన రాము (25), భిక్షం (40) కూలిపనులు చేస్తుంటారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో రాము 10 రోజుల క్రితం, భిక్షం ఈనెల 1న మృతి చెందారు. రత్నాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వంజం సంకురమ్మ (27) బుధవారం ఇంటి వద్ద మృతి చెందడంతో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

ఆరోగ్యశ్రీ వర్తించకపోవడం వల్లే అంగన్‌వాడీ టీచర్ మృతి

ఆరోగ్యశ్రీ వర్తించకపోవడం వల్లే సంకురమ్మ మృతి చెందిందం టూ ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుపెట్టుకుంటున్నారు. సంకురమ్మ అల్లిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తోంది. రెండు నెలలుగా కిడ్నీ వ్యాధి తీవ్రం కావడంతో సెలవు పెట్టిన సంకురమ్మ రాజమ హేంద్రవరంలోని



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రయివేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకునేందుకు చేరింది. రేషన్‌కార్డు ఉంటే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని ఆసుపత్రివర్గాలు తెలిపాయి. రేషన్‌కార్డులో పేరు తప్పుగా ఉండటంతో సరిచేయించేందుకు ఆమె భర్త చంద్రరావు చింతూరులో సంబంధిత అధికారులను కలిశాడు. నెల రోజులు పడుతుందని చెప్పటంతో వెనుదిరిగాడు. అప్పటికే వైద్యానికి రూ.3 లక్షలు ఖర్చు చేశారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో చికిత్స చేయించే స్తోమత లేక... ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సంకురమ్మ బుధవారం మృతి చెందింది.

సంకురమ్మ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వర్తించదని, రేషన్‌కార్డులో పేరు సరిచేయాలని చికిత్స నిలిపివేసి సంకురమ్మ ప్రాణాలు బలితీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆమె కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం ప్రభుత్వం వెంటనే అందజేయాలని సిపిఎం నాయకులు యర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సంకురమ్మ మృతదేహాన్ని వారు సందర్శించారు. మన్యంలో కిడ్నీ వ్యాధితో గిరిజనులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చింతూరు డివిజన్ కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

చింతూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నా రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు. అప్పటి నుంచి నేను మా గ్రామం నుంచి వారానికి రెండుసార్లు రంపచోడవరం వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నాను. బస్‌ఛార్జీలు, నాతో ఒక మనిషికి ఇద్దరికి కలిపి నెలకు రూ.4 వేలు ఖర్చవుతోంది. నాది చాలా పేద కుటుంబం. అంత ఖర్చు భరించలేకపోతున్నాను. చింతూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే మాలాంటి పేద గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- చిలకం దేవయ్య, రత్నాపురం, కిడ్నీ బాధితుడు

110 మునిసిపాలిటీల్లో ఉచిత వైఫై : సిఎస్ పునేఠా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో 970 ప్రాంతాలకు త్వరలో ఉచిత వైఫైను ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఎపి టిఎల్, ఎపి ఫైబర్ నెట్ కార్యకలాపాలపై ఉన్నతాధికారులతో సచివాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి డిజిటల్ ఇన్‌ఫ్రాతో ఒప్పందం చేసుకున్న కంపెనీకి వచ్చే ఆదాయం నుంచి ఏటా 30.30 శాతం ప్రభుత్వానికి సమకూరే అవకాశముందనే అంశాన్ని ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్ తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వారికి కావాల్సిన ప్రభుత్వ స్థలాలను న్యాయమైన ధరలకు అద్దెకివ్వాలని సూచించారు. రాబోయే మూడేళ్లలో 5జీ సేవల కోసం 12000 టవర్ల అవసరం ఉంటుందని, ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా, కేవలం స్థలాలను ప్రయివేట్ కంపెనీకి అద్దెకివ్వడం ద్వారా స్థానిక సంస్థలతో పాటు పలు శాఖలకు ఆదాయం సమకూరుతోందని వివరించారు. ప్రభ్వుత స్థలాలు, భవనాలపై ఏర్పాటు చేసే టవర్లకు ఎంత అద్దె వసూలు చేయాలనే విషయాన్ని పొరుగు రాష్ట్రాల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15 నాటికి 1000 కేంద్రాలు ప్రారంభించటమే ఎపీ ఫైబర్ లక్ష్యంగా పెట్టుకుందని అధికారులు తెలిపారు. రూ.53 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టులో గూగుల్ భాగస్వామి అవుతోందని, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం గూగుల్ ప్రభుత్వానికి చెల్లిస్తుందని పేర్కొన్నారు.

రవాణా మంత్రికి ఇయు సమ్మె నోటీసు

50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఉద్యోగులకు 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఆర్టీసి ఇయు నాయకులు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు బుధవారం సమ్మె నోటీసును అందజేశారు. ఆర్టీసి నష్టాలకు కార్మికులు కారణం కాదని, డీజిల్ రేట్లు ప్రభుత్వ విధానాలు, అక్రమ రవాణా వల్లే నష్టాలొస్తున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో నష్టాల పేరు చెప్పి వేతన సవరణ చేయనందునే సమ్మె నోటీసిచ్చామని తెలిపారు. ఆర్టీసిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో యాజమాన్యం సమక్షంలో సమావేశం నిర్వహించి చర్చిస్తామని, సమ్మె లేకుండా సమస్యల్ని పరిష్కరించుకుందామని అన్నారు. చర్చలకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాల్సిన బాధ్యత మంత్రిపై ఉందని ఇయు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర నాయకులు ఎం హనుమంతురావు, రామ చంద్రరావు, సిద్దిక్, శంకరరావు, సుభాని, చక్రవర్తి, వై.యస్.రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిసిఎస్ బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం

ఆర్టీసి ఉద్యోగుల అవసరాల కోసం సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకున్న క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీకి యాజమాన్యం బకాయిలను చెల్లించకపోతే ఉద్యమం తప్పదని ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యుల నుంచి రికవరీ చేసిన రూ.215 కోట్లు యాజమాన్యం సిసిఎస్‌కు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సిసిఎస్‌కు బకాయి ఉండటం వల్ల నష్టాల బారిన పడిందని తెలిపారు. సిసిఎస్ బకాయి చెల్లించి సంస్థను కాపాడాలని కోరారు.

పోలీస్ పరీక్ష రాసే వారికి మరో రోజు పరీక్ష

పిఇటి అభ్యర్థులకు వెసులుబాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ కానిస్టేబుల్, పిఇటి, ఆర్‌పిఎఫ్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాష్ట్రప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పోలీస్ కానిస్టేబుల్ , రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్) పోస్టులకు రాతపరీక్ష, పిఇటి అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష ఈ నెల 6న జరుగనున్నాయి. ఒకే రోజు మూడు పరీక్షలకు అభ్యర్థులు ఎలా హాజరవుతారని డిసెంబర్ 27న 'ఒకే రోజు రెండు పరీక్షలు' శీర్షికతో ప్రజాశక్తి ప్రచురించిన విషయం తెలిసిందే. ఈనెల 6న ఇతర పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు మరో రోజు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణి వెల్లడించారు. అభ్యర్థులు వారి పూర్తి వివరాలు, ఇతర పరీక్షకు సంబంధించిన హాల్ టిక్కెట్లను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎంవ.ఖజూ.స్త్రశీజ.జఅ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని వివరించారు. వీరికి మాత్రమే మరో రోజు పరీక్ష నిర్వహిస్తామని బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. శుక్రవారం నుంచి జరిగే పిఇటి అభ్యర్థుల భౌతిక సామర్థ్య పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో పూర్తిచేశామని తెలిపారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లు, పరీక్షకు సంబంధించిన రోజు వారీ, సెషన్ వారీ వివరాలు, విధివిధానాలు, సూచనలను అభ్యర్థుల కోసం వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. మ్యూజిక్ అభ్యర్థుల పరీక్షకు సంబంధించిన వివరాలు కూడా వెబ్‌సైట్‌లో పొందు పరిచామని తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన సెషన్‌లో హాజరు కాకపోతే, వారికి మరోసారి నిర్వహిం చామని స్పష్టం చేశారు. ఇతర పోటీలకు హాజరయ్యే అభ్యర్థులకు మాత్రమే మరోరోజు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

ప్రధానితో ముఖాముఖి చర్చకు సిద్ధం : రాహుల్

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంపై ప్రధానితో ముఖాముఖి చర్చించడానికి తాను సిద్ధమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. '20 నిముషాలు సమయం ఇవ్వండి, ప్రధానితో చర్చిస్తా, కానీ మోడీకి అంత ధైర్యం లేదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.. రాఫెల్ ఒప్పందంపై పార్లమెంట్‌లో బుధవారం చర్చ జరిగిన తర్వాత మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ పై డిమాండ్ చేశారు. కొత్త ఏడాది తొలి రోజున మోడీ ఇచ్చిన మీడియా ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ రాహుల్, అనేక ప్రశ్నలకు మోడీ సమాధానం చెపాల్సి వుందన్నారు. రాఫెల్ కొత్త ఒప్పందానికి ఎయిర్ ఫోర్స్ అభ్యంతరం చెప్పలేదా?, విమానం ధర రు.526కోట్ల నుండి 1600కోట్లకు ఎందుకు పెరిగింది? అని ఆయన ప్రశ్నించారు.



కాశ్మీర్లో హిమపాతం

నెలరోజులుగా మంచుతో కప్పేసిన కాశ్మీర్‌లో బుధవారం మంచువర్షం కురిసిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దీంతో జమ్ము-శ్రీనగర్‌కు 300 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారి, పూంచ్, రాజౌరి జిల్లాలను కలిపే మొఘల్ రోడ్‌లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. గుల్మార్గ్, పెహల్గామ్ పర్యాటక రిసార్టుల పరిసరాలు మంచుతో నిండిపోయాయని తెలిపారు. ప్రయాణానికి అనుకూలంగా లేకపోవడంతో నాగోర్టా, ఉదమ్‌పూర్ వద్ద సుమారు 300 వాహనాలను నిలిపేసినట్లు పేర్కొన్నారు.

ప్రధాని పదవి పట్ల మోడీకి గౌరవం లేదు

ఏచూరీ విమర్శ



న్యూఢిల్లీ : నరేంద్రమోడీకి ప్రధానమంత్రి పదవి పట్ల ఏ మాత్రం గౌరవం లేదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం చేసిన ట్వీట్‌లో బెంగాల్, కేరళ, కర్నాటకల్లో బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున హత్యలకు గురవుతున్నారంటూ మోడీ చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. 'వాస్తవానికి త్రిపుర, కేరళలో బిజెపి, ఆర్ఎస్ఎస్ గూండాలు మా కార్యకర్తలను పెద్దసంఖ్యలో చంపుతున్నారు. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ఎప్పటి మాదిరే మోడీ దేశ ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. అసత్యాలను చెబుతున్నారు'. అని ఆయన పేర్కొన్నారు.

కేరళ మహిళా లోకానికి సిపిఎం అభినందనలు

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

కొత్త సంవత్సరం ఆరంభం రోజున కేరళలో 176 సామాజిక, ప్రజాసంఘాలు మహిళలతో నిర్మించిన 'మహిళా కుడ్యం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర మహిళా లోకానికి సిపిఎం పొలిట్‌బ్యూరో అభినందనలు తెలియచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా కుల, మత వర్గాలకు అతీతంగా దాదాపు 55 లక్షల మందికి పైగా మహిళలతో నిర్మించిన ఈ మహిళా కుడ్యం మహిళల హక్కులు, సామాజిక సంస్కరణల కోసం కేరళలో జరిగిన ఉద్యమాలను ఐక్యంగా ముందుకుతీసుకుపోతామన్న సందేశాన్ని ఇచ్చిందని ప్రశంసించింది. ఆరెస్సెస్ నేతృత్వంలోని మితవాద శక్తులు దేశమంతటిపైనా తిరోగమన 'మనువాది' సిద్ధాంతాలను రుద్దేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ విధమైన కృషికి విస్తృత ప్రాధాన్యత ఉన్నదని, ఈ మహిళాకుడ్యం ఇటువంటి ప్రతిఘటనలు పెద్దసంఖ్యలో జరిగేందుకు ప్రోత్సహిస్తుందని పేర్కొంది.

'అయోధ్య'పై మోడీ వైఖరికి ఖండన

న్యాయప్రక్రియ పూర్తైన తర్వాత రామమందిర నిర్మాణానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందంటూ ప్రధాని నరేంద్రమోడీ పరోక్షంగా చెప్పటాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో న్యాయ ప్రక్రియ అనంతరం రామమందిర నిర్మాణానికి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని చెప్పారు. ప్రధాని వ్యాఖ్యలను 'సానుకూల చర్య'గా ఆరెస్సెస్ స్వాగతించటం ఖండనార్హమని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది. కోర్టు తీర్పు ఎలా వచ్చినా మందిర నిర్మాణానికి ప్రభుత్వం అనుకూలంగా ఉందని చెప్పటం తమకు అనుకూల తీర్పు కోసం సుప్రీంకోర్టుపై వత్తిడి పెంచటమేనని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. రాజ్యాంగ బద్ధంగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ప్రధాని కోర్టు తీర్పును అనుసరించాలని, దానిని అమలు చేయటానికి కట్టుబడి ఉండాలని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

రాఫెల్ రహస్యాలన్నీ పారిక్కర్ పడక గదిలో..!

ఆడియో విడుదల చేసిన కాంగ్రెస్

పణాజి : రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై కేంద్రం, కాంగ్రెస్‌ల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కీలకమైన సమాచారాన్ని వెల్లడిస్తున్న ఒక ఆడియో ఫైల్‌ను కాంగ్రెస్ బుధవారం విడుదల చేసింది. గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రానెకు, గుర్తు తెలియని వ్యక్తికి మధ్య జరిగిన సంభాషణ ఆ ఫైల్‌లో వుంది. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన కీలకమైన ఆధారాలు గోవా ముఖ్యమంత్రి, ఆ సమయంలో రక్షణ మంత్రి అయిన మనోహర్ పారిక్కర్ వద్ద ఆయన బెడ్‌రూమ్‌లో వున్నాయని గోవా మంత్రి విశ్వజిత్ రాణె చెబుతున్నట్లు ఆ ఆడియోలో వుంది. పార్లమెంట్ వెలుపల మీడియా ఎదుట కాంగ్రెస్ ముఖ్య ప్రతినిధి రణదీప్ సూర్జెవాలా ఈ ఆడియోను విడుదల చేశారు. కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకే ఆయన వాటిని తన వద్ద అట్టిపెట్టుకున్నారని సూర్జెవాలా పేర్కొన్నారు. అయితే పారిక్కర్ దీన్ని తిరస్కరిస్తున్నారు. ఆ సంభాషణల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) దర్యాప్తు వేయడానికి కేంద్రం వెనుకాడడానికి కారణం ఇదేనా అని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. పైగా అనారోగ్యంతో వున్నా పారిక్కర్‌ను విధుల నుండి తప్పించకపోవడానికి కారణం కూడా ఇదే అయి వుండవచ్చునని భావించాల్సి వస్తోంది. వాస్తవాలను తారుమారు చేసేందుకు నిరాశా నిస్పృహలతో చేసిన ప్రయత్నమే ఇదని పారిక్కర్ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు.

మళ్ళీ సుప్రీంకు రాఫెల్ వివాదం

రివ్యూ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : రాఫెల్ వివాదం మళ్ళీ సుప్రీంకోర్టుకు చేరింది. మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, ప్రశాంత్ భూషణ్‌లు బుధవారం ఈ మేరకు 31పేజీల పిటిషన్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. తమ ఒరిజినల్ పిటిషన్‌లోని కీలకమైన డిమాండ్లలో ఒకదాన్ని పరిష్కరించకపోవడాన్ని వారు అందులో ప్రశ్నించారు. సీల్డ్ కవర్‌లో ప్రభుత్వం అందచేసిన సమాచారంలో నిజానిజాలకు సంబంధించి పలు ప్రశ్నలను వారు లేవనెత్తారు.. భారత ప్రతినిధి బృందం (ఇండియన్ నెగోషియేటింగ్ టీమ్ -ఐఎన్‌టి) అభ్యంతరాలకు సంబంధించిన కొత్త సమాచారాన్ని కూడా కోర్టు పరిశీలన నిమిత్తం అందులో పొందుపరిచారు. తదనంతర కాలంలో తప్పుగా రుజువు చేయబడిన వాస్తవాల ప్రాతిపదికన ఈ తీర్పును వెలువరించారని పిటిషనర్లు తమ లేఖలో పేర్కొన్నారు. కాగ్ నివేదికపై వివాదం తలెత్తడం ఇక్కడ ప్రధాన అంశంగా వుందని అన్నారు. బహిరంగ కోర్టులో మౌఖిక విచారణ జరగాలని వారు కోరారు.

దశాబ్దాల కాలంగా నన్‌లపై మత బోధకుల అత్యాచారాలు

వెల్లడించిన అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక

కురవిలంగడ్ (కేరళ) :దేశంలో నన్‌ల పరిస్థితి దారుణంగా మారింది. క్రైస్తవ మత బోధకులు తమ పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరును నన్‌లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మత బోధకులు నన్‌లపై లైంగిక దాడులకు పాల్పడటం ఇప్పటిది కాదని, దశాబ్దాల కాలంగా అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని ప్రముఖ వార్తా సంస్థ అసోసియేటెడ్ ప్రెస్ తన నివేదికలో వెల్లడించింది. జీసెస్ క్రీస్తు ప్రతినిధులుగా తామున్నామని నమ్మ బలుకుతూ నన్‌లతో మత బోధకులు లైంగిక దాడులకు దిగుతున్నారు. నన్‌లపై అత్యాచారం, లైంగిక దాడుల ఘటనలపై కాథలిక్ చర్చికి ఎన్నో ఫిర్యాదులు అందాయి. ఆసియా, యూరప్, దక్షిణ అమెరికా, ఆఫ్రికా తదితర దేశాలలో మత బోధకులు, బిషప్‌లు నన్‌లపై చేస్తున్న లైంగిక దాడుల సంఘటనల పట్ల వాటికన్ సిటీకి సమాచారముంది. అయినా వాటిని నివారించేందుకు వాటికన్ చేసింది చాలా తక్కువ. వీటిపై గత ఏడాది ప్రముఖ పత్రికల్లో కథనాలు వచ్చాయి.

ప్రస్తుతం భారత్‌లో దశాబ్దాల కాలంగా చర్చిలలో నన్‌లపై జరుగుతున్న వెలుగులోకి రాని లైంగిక దాడుల సంఘటనలపై అసోసియేటెడ్ ప్రెస్ దర్యాప్తు జరిపింది. దీనిపై ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. మత బోధకుల నుండి ఎదుర్కొన్న లైంగిక దాడులు, వేధింపులు, లైంగిక సంబంధాల కోసం వారిపై వచ్చిన ఒత్తిడిని నన్‌లు ఆ కథనంలో సమగ్రంగా వివరించారు. చర్చిలలో మత బోధకుల లైంగిక వేధింపులకు తాము గురయ్యామని దాదాపు 25 మంది దాకా నన్‌లు, మాజీ నన్‌లు తెలిపినట్లు ఆ కథనం పేర్కొంది. ఇంకా ఇప్పటికీ 'మౌనం' అనే ముసుగులో ఇటువంటి పలు ఘటనలు వెలుగులోకి రావడం లేదు. కాని గడిచిన ఏడాది ఒక నన్ మాత్రం ఈ విషయమై బాహాటంగానే పోరాటం జరిపింది. చర్చి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుండి ఎటువంటి స్పందన లేదు. రెండేళ్ళ కాలంలో తనపై పలుమార్లు అత్యాచారం జరిపాడని ఆరోపిస్తూ ఒక బిషప్‌పై 44 ఏళ్ళ నన్ పోలీసు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదును పోలీసులు అంతగా పట్టించుకో లేదు. దీంతో బిషప్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కొంతమంది నన్‌లు బాహాటంగా నిరసన ఆందోళనలు జరిపారు. ఈ ఆందోళనలతో దేశంలోని కాథలిక్‌లు రెండుగా చీలిపోయారు. బాధితురాలు, ఆమెకు మద్దతిస్తున్న వారు ఇప్పుడు వెలివేయబడ్డారు. బిషప్‌ను సమర్థిస్తున్న పలువురు ఇతర నన్‌ల నుండి వేరు చేయబడ్డారు. తాము చర్చికి వ్యతిరేకంగా పనిచేస్తున్నామని కొంతమంది ఆరోపిస్తున్నారంటూ బాధితురాలికి మద్దతిస్తున్న సిస్టర్ జోసెఫైన్ విల్లూన్నికల్ తెలిపారు.

రైతులను అవమానిస్తున్న మోడి

రుణమాఫీ వ్యాఖ్యలపై ఎఐకెఎస్ ఖండన

న్యూఢిల్లీ : వ్యవసాయ రుణాల మాఫీని లాలిపప్స్‌తో పోలుస్తూ ప్రధాని మోడీ చేసిన బుద్ధిలేని వ్యాఖ్యలను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) బుధవారం ఒక ప్రకటనలో ఖండించింది. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడి రైతు ఆదాయాలు తగ్గి, రుణాలు పెరిగిన నేపథ్యంలో రుణ మాఫీ వారికి మంచి ఉపశమనం కలిగించే అంశమని పేర్కొంది. తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతులకు రుణ మాఫీ తాత్కాలిక ఊరట కలిగిస్తుంని తెలిపింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయానికి కళ్ళెం వేయడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమవ్వడమే కాకుండా పండిన పంటలకు ప్రోత్సాహక ధరను అందించడంలో కూడా రైతులకు ఏమీ చేయలేక పోయిందని విమర్శించింది. రుణాల మాఫీపై ఆయన చేసిన వ్యాఖ్యలు రైతులను కించ పరిచే విధంగా ఉన్నాయని పేర్కొంది. 2014 ఎన్నికల ప్రచార సమయంలో రైతు రుణాలు మాఫీ చేయడమే కాకుండా, ప్రతి ఒక్కరి ఖాతాలో కూడా రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చి తప్పారని ఎఐకెఎస్ తన ప్రకటనలో పేర్కొంది. ఎఐకెఎస్‌తో పాటు , ఇతర రైతు సంఘాలు కలిసి ఎఐకెఎస్‌సిసి కింద జరిపిన పోరాటాల కారణంగా 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరోమారు రైతు రుణాలు మాఫీ చేస్తామని మోడీ హామి ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. రైతాంగం నిరంతరం జరిపిన పోరాటాల కారణంగా మహారాష్ట్ర, రాజస్థాన్‌లలోని బిజెపి ప్రభుత్వాలు రైతు రుణాలు మాఫీ చేస్తూ ప్రకటనలు జారీ చేశాయన్నారు. కేరళలోని రుణ ఉపశమన కమిషన్‌ను పరిశీలించి బిజెపి ప్రభుత్వం రుణమాఫీకి చర్యలు చేపట్టాలని ఎఐకెఎస్ కోరింది. నిజమైన వ్యవసాయ దారులకు ప్రత్యేకించి భూములు లేని కౌలు రైతులకు, చిన్న మధ్య తరహా రైతులకు రుణమాఫీ చేయాలని పేర్కొంది.

నయా ఉదారవాద విధానాలను అమలు చేయడంలో దూకుడును తగ్గించి, వాణిజ్య, ఆర్థిక సరళీకరణను వేగవంతం చేయాలని, విధ్వంసకర పెద్ద నోట్ల రద్దు నిర్ణయంతో పూర్తిగా రుణాల ఊబిలో కూరుకు పోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తప్పుడు దిగుమతి విధానాలు ఉపసంహరించుకోవాలని మోడికి సూచించింది. రుణ



పంట రుణాల మాఫీ కోసం పాదయాత్ర చేస్తున్న మహారాష్ట్ర రైతులు(ఫైల్)

మాఫీపై మాట్లాడటానికి ముందుకు బిజెపి ప్రభుత్వం విధ్వంసకర విధానాలను వెనక్కి తీసుకోవాలని, విశ్వాస నిర్మాణ చర్యలను ముందుకు తీసుకు రావాలని ఎఐకెఎస్ సూచించింది. రుణ మాఫిని ప్రకటించిన రాష్ట్రాలు కూడా దిగుబడి ఖర్చులు తగ్గించడం, పంటల ఉత్పత్తులకు గిట్టుబాటుధరలు, అదనపు విలువ పెంచేలా ప్రత్యామ్నయ విధానాలు రూపొందించకుంటే రైతులు పదే పదే రుణాల ఊబిలో కూరుకుపోతుంటారనేది తమ ధృడమైన అభిప్రాయమని పేర్కొంది. రైతులకు ఇచ్చిన అన్ని హామీలను మోడీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చక పోతే రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించే వాతావరణాన్ని తమ పోరాటాల ద్వారా సృష్టిస్తామని హెచ్చరించింది.

గో గూండాల దాడికి ఖండన

రాజస్తాన్‌లోని ఆల్వార్‌లో సఫీర్‌ఖాన్, మరో ఇద్దరిపై గోగూండాలు దాడి చేయడాన్ని ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) ఖండించింది. కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో రైతులు, పశువుల పెంపకందారులపై దాడులు జరుగుతున్నాయని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. మేవట్ ప్రాంతంలో రైతులు, ముస్లిములను సంఘ్ పరివార్ శక్తులు నిందితులుగా చిత్రీకరించడంతో పాటు సమాజాన్ని మతం పేరుతో విభజించేందుకు యత్నిస్తున్నారని కిసాన్‌సభ ధ్వజమెత్తింది. మేవాట్‌లో ముస్లిములకు పాల ఉత్పత్తి ప్రధాన జీవనోపాధిగా ఉందని తెలిపింది. పోలీసులు, జిల్లా పరిపాలనా అధికారులు సంఘ్ పరివార్‌కు అనుకూలంగా పనిచేస్తూ పశువులను రవాణా చేసేవారిపై దాడులు జరుగుతున్నా పట్టించుకోడం లేదని, పశువులను రవాణా చేసేవారిని నిందితులుగా భావించొద్దని ప్రభుత్వాన్ని కోరింది. గోగూండాల దాడులను అడ్డుకునేందుకు వీలుగా అవసరమైన చోట్ల పోలీస్ అవుట్‌పోస్ట్‌లను ఏర్పాటు చేయాలని కోరింది. ఇప్పటి వరకూ పలుచోట్ల ఉన్న పోలీసు అవుట్‌పోస్టులు గోగూండాలకు అనుకూలంగా వ్యవహరి స్తున్నాయని, అటువంటి వాటిని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. మతోన్మాద శక్తులు పెంచి పోషిస్తున్న గోగూండాలపై కాంగ్రెస్ ప్రభుత్వమైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై జరిగిన దాడిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందిచకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొంది. రాష్ట్రంలో హిందూత్వం పేరుతో దాడులకు పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని, మత సామరస్యానికి కృషి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాకి విజ్ఞప్తి చేసింది.

సజీవ శిశువును పాతిపెట్టేందుకు తండ్రి ప్రయత్నం

అదుపులోకి తీసుకున్న పోలీసులు

శ్రీనగర్ : నవజాత శిశువును సజీవంగా పాతిపెట్టేందుకు యత్నించిన దారుణమైన ఘటన జమ్ముకాశ్మీర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. షాపెయిన్ జిల్లాలో నౌహట్ట నగరానికి చెందిన మంజూర్ హుస్సేన్ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడని, అతనిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నవజాత శిశువుకు పుట్టుకతోనే వచ్చే ఒక ప్రమాదకరమైన వ్యాధి వుండటంతో ఈ ఘాతు కానికి పాల్పడినట్లు ఆ తండ్రి పేర్కొన్నారు. కాగా, హుస్సేన్ గతంలో ఒక కేసులో అరెస్టై బెయిల్‌పై వచ్చాడని పోలీసులు తెలిపారు. శిశువును ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మేఘాలయలో అత్యవసర చర్యలకు పిటిషన్ దాఖలు

విచారణకు అంగీకరించిన సుప్రీం

గువాహటి : మేఘాలయలోని బొగ్గు గనుల్లో చిక్కుకుపోయిన 15 మంది మైనర్ బాలురను కాపాడటానికి అత్యవసరమైన చర్యలను కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి సిజెఐ రంజన్ గొగోయి, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. మైనర్లను రక్షించేందుకు తగిన మానవ వనురులను, సామాగ్రిని కోరుతూ ఆదిత్య ప్రసాద్ అనే ఒక న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. స్టాండర్ట్ ఆపరేటింగ్ ప్రొసిజర్(ఎస్ఒపి) సిద్ధం చేయాలని కేంద్రానికి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. గత నెల 13 నుండి ఎలుక బొరియాలు వంటి గనిలో మైనర్లు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. సహాయక చర్యలు చేపట్టినప్పటికీ... ఇప్పటి వరకు కేవలం మూడు హెల్మెట్లను మాత్రమే కనుగొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై 206 అవినీతి కేసులు

న్యూఢిల్లీ : గత ఏడాది జనవరి-నవంబరు మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై 206 అవినీతి కేసులను సిబిఐ నమోదు చేసిందని సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. గత ఏడాది నవంబరు వరకు సిబిఐ నమోదు చేసిన మొత్తం కేసులలో 45 కేసులలో మాత్రమే ఛార్జిషీటు దాఖలు చేసిందని సంబంధిత ప్రశ్నకు లిఖితపూర్వక సమాధాన మిస్తూ ఆయన చెప్పారు. ఇటువంటి కేసులు 2015లో 441 నమోదు చేయగా, 2016లో 400, 2017లో 338 కేసులు నమోదు చేసింది. 2015లో 361 కేసులలోనూ, 2016లో 272 కేసులలోనూ 2017లో 168 కేసులలోనూ చార్జిషీటు దాఖలు చేసినట్లు సింగ్ తెలిపారు. కాగా జనవరి 2015 నుండి 23 కేసులలో 17 మంది ఐఎఎస్ అధికారులపై ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. అదేవిధంగా గత మూడేళ్ళ కాలంలో (2015-2017) వరకు ముగ్గురు ఐపిఎస్ అధికారులను ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతిచ్చినట్లు తెలిపారు.

అఖిల భారత న్యాయ సర్వీసుల ఏర్పాటుకు ఇదే సమయం : మంత్రి రవి శంకర్

న్యూఢిల్లీ : అఖిల భారత న్యాయ సర్వీసులను ఏర్పాటు చేయాల్సిన సమయం వచ్చిందని న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ బుధవారం లోక్‌సభకు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న జిల్లా, సబార్డినేట్ కోర్టులలో 5 వేలకు పైగా న్యాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లా, సబ్‌ఆర్డినేట్ కోర్టులలో 2018, సెప్టెంబరు 30 నాటికి 22, 644 న్యాయాధికారుల పోస్టులు మంజూరు చేశామన్నారు. ఆయా రాష్ట్రాల హై కోర్టులు, ప్రభుత్వాలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ గణాంకాలను వెల్లడిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా జిల్లా కోర్టులలో 17, 509, సబార్డినేట్ కోర్టులలో 5, 135 న్యాయాదికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. అఖిల భారత న్యాయ సర్వీసులను ఏర్పాటు చేసి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. దీనిపై చర్చలు జరగుతున్నాయన్నారు. సబార్డినేట్ కోర్టుల్లో న్యాయమూర్తుల నియామక ప్రక్రియ బాధ్యత హైకోర్టులు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలదని ఈ సందర్భంగా తెలిపారు.

బెడిసికొట్టిన ఆపరేషన్ 'కమలం'

బెంగళూరు, ప్రజాశక్తి ప్రతినిధి : కర్ణాటకలో కుమారస్వామి మంత్రివర్గ విస్తరణ అనంతరం కాంగ్రెస్, జెడిఎస్ కూటమిలో బయటపడిన లుకలుకలను అవకాశంగా చేసుకుని 'ఆపరేషన్ కమలం' చేపట్టాలన్న బిజెపి యత్నాలు బెడిసికొట్టాయి. మంత్రి పదవులు దక్కని అసమ్మతి వాదులకు 'గాలం' వేయడం ద్వారా మరోసారి కర్ణాటకలో అధికారం చేజిక్కించుకునేందుకు బిజెపి పన్నుతున్న కుట్రలు ఫలించలేదు. గత మూడు రోజులుగా ఢిల్లీలో కాంగ్రెస్ అసమ్మతి నేతలతో రహస్య మంతనాలు జరిపిన మాజీ ముఖ్యమంత్రి బిఎస్.యడ్యూరప్ప 'వ్రతం చెడ్డా ఫలితం దక్కక పోవడం'తో బెంగళూరుకు తిరుగుముఖం పట్టారు. సంకీర్ణ మంత్రివర్గ తాజా విస్తరణలో మునిసిపల్ శాఖ మంత్రిగా ఉన్న బెళగావి కాంగ్రెస్ నేత రమేష్ జారకిహోళిపై ముఖ్యమంత్రి కుమారస్వామి వేటు వేయడంతో అలకవహించిన ఆయన తనవెంట పదిమంది ఎంఎల్ఎలు ఉన్నారంటూ, ఢిల్లీకి వెళ్లి బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాతో మంతనాలు జరపడం కలకలం సృష్టించింది. బిజెపి సారథ్యంలో కొత్త సర్కారు ఏర్పాటుకు మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధంగా వున్నామని రమేష్ జారకిహోళి హామీ ఇచ్చినట్లు వార్తలు వెలువడిన వెంటనే అప్రమత్తమైన మాజీ సిఎం సిద్దరామయ్య చాకచక్యంగా అసమ్మతివాదులను బుజ్జగించటంతో ఈ కుట్రలు భగ్నమయ్యాయి. రమేష్ జారకిహోళి వెంట కేవలం ముగ్గురు ఎంఎల్ఎలు మాత్రం ఉండటంతో సంకీర్ణ సర్కారును కూలగొట్టాలన్న బిజెపి ప్రయత్నాలు విఫలమయాయి.

కాంగ్రెస్, జెడిఎస్ పార్టీల నుంచి కనీసం 15 మంది అసమ్మతి శాసనసభ్యులు మద్దతు ఇస్తే తప్ప బిజెపి సర్కారు ఏర్పాటుకు తాము సిద్ధం కామని అమిత్‌షా స్పష్టం చేశాడు. వచ్చే ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగనుండటంతో ఈ సమయంలో కర్ణాటకలో కాంగ్రెస్-జెడిఎస్ సర్కారును కూల్చితే వ్యతిరేకత మరింత పెరుగుతుందనే భయంతో బిజెపి కేంద్ర నాయకత్వం ఈ యత్నానికి తాత్కాలికంగా బ్రేకులు వేసింది. మరో వంక మాజీ ప్రధాని దేవెగౌడ ఢిల్లీలో మకాం వేసి కమలనాథుల చర్యలను ఎండగట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కుమారస్వామి సింగపూర్ పర్యటన ముగించుకుని గురువారం బెంగళూరుకు వచ్చిన వెంటనే సంకీర్ణ ప్రభుత్వం సమన్వయసమితి సమావేశాన్ని ఏర్పాటుచేస్తారని, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించి సంకీర్ణ కూటమి ఉమ్మడి కార్యక్రమం అమలుచేస్తారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇంతకుముందు అసమ్మతి గళం విప్పిన అసమ్మతివాదుల్లో ఏడుగురికి కుమారస్వామి తన మంత్రి మండలిలో చోటు కల్పించటంతో పరిస్థితి సద్దుమణిగింది. అలకవహించిన సీనియర్ మాజీ మంత్రులకు కాంగ్రెస్ అధిష్టానం నచ్చజెప్పి లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచించటంతో అసమ్మతికి బ్రేకులుపడ్డాయి.

ప్రత్యేకం

జవాబు చెప్పని ప్రశ్నలెన్నో?

కీలక ప్రశ్నలకు సమాధానాలు దాటవేసిన మోడీ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్న కీలకమైన సంవత్సరం 2019 తొలి రోజున ప్రధాని నరేంద్ర మోడీ మీడియాకు ప్రత్యేకమైన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఐదేళ్ళ పదవీ కాలాన్ని పూర్తి చేస్తున్నా మోడీ ఇంతవరకు బహిరంగంగా ఒక్క పత్రికా సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. తొలిసారిగా కొత్త సంవత్సరం తొలి రోజున మోడీ 95 నిముషాల పాటు సుదీర్ఘమైన ఇంటర్వ్యూ ఇచ్చారు. పెద్ద నోట్ల రద్దు, రాఫెల్ వివాదం, రైతు రుణాల రద్దు, దేశవ్యాప్తంగా అల్లరి మూకల ఆగడాలు పెచ్చరిల్లడం వంటి పలు అంశాలపై మోడీ కీలక ప్రశ్నలను ఎదుర్కొన్నారు. అయితే సమాధానమిచ్చే సమయంలో కీలకమైన కొన్ని వాస్తవాలను ప్రస్తావించకుండా, సమాధానాలు దాటవేయడానికి యత్నించారు. దాంతో ఇంటర్వ్యూ మొత్తంగా ప్రశ్నలు, జవాబుల పరంపర కాకుండా సుదీర్ఘమైన ఏకపక్ష ప్రసంగంగానే కొనసాగింది. ఈ నేపథ్యంలో మోడీ సమాధానమివ్వకుండా తప్పించుకున్న పది ప్రశ్నల జాబితా ఇది.

పెద్ద నోట్ల రద్దు ప్రక్రియ విజయవంతమైందా? అని అడిగిన ప్రశ్నకు మోడీ బదులిస్తూ, ఇదేమీ 'ఆకస్మిక చర్య' కాదు, దీని గురించి ప్రజలకు ఏడాది ముందుగానే హెచ్చరించాం. నోట్ల రద్దుకు ముందు దేశంలో సమాంతర ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఈ చర్యతో ఎక్కడెక్కడ దాచిపెట్టిన కరెన్సీ అంతా బ్యాంకింగ్ వ్యవస్థకు చేరుకుందన్నారు. అయితే మోడీ వెల్లడించని విషయం ఏమిటంటే, నోట్ల రద్దు ప్రకటించినపుడు చలామణిలో వున్న నగదు మొత్తమంతా ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి బ్యాంకులకు తిరిగి వచ్చిందా రాలేదా అన్నది వివరించలేదు. తొలుత 99.3శాతం కరెన్సీ మాత్రమే వచ్చిందని ప్రకటించిన ఆర్‌బిఐ 2018 ఆగస్టులో ఇచ్చిన వార్షిక నివేదికలో మొత్తమంతా బ్యాంకింగ్ వ్యవస్థకు వచ్చినట్లు చెప్పారు. ఇక్కడ దేశానికి కీలకమైన సమాచారాన్ని మోడీ ఎందుకు వెల్లడించలేదు. అంటే రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి మోడీకి వాస్తవం తెలిసివుండకపోవచ్చు. లేదా ఎంతో వ్యయభరితమైన ఈ నోట్లరద్దు ప్రక్రియ ఘోరంగా విఫలమైందన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఆయన సిద్ధంగా లేకపోవడం దీనికి కారణం కావచ్చు.

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా గురించి ప్రశ్నించగా ఆయన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారని చెప్పారు. దీని గురించి గత ఆరేడు మాసాలుగా ఆయన చెబుతూనే వచ్చారని అన్నారు. అయితే ఆర్థిక మంత్రిత్వ శాఖకు, ఆర్‌బిఐకి మధ్య తలెత్తిన ఘర్షణ గురించి మోడీ మాట్లాడలేదు. అలాగే ఆర్‌బిఐ చట్టంలోని సెక్షన్ 7ను ఎందుకు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందో కూడా మోడీ వెల్లడించలేదు. ఈ సెక్షన్‌ను గతంలో ఎన్నడూ ఎవరూ అమలు చేయలేదు. ఇప్పుడు ఆ అవసరం ఎందుకు వచ్చిందో చెప్పలేదు. ఉర్జిత్ పటేల్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసి వుండవచ్చు, కానీ ఆ రాజీనామాకు దారి తీసిన పరిస్థితులను కారణాలను విస్మరించలేం. పైగా ప్రధాని హోదాలో మోడీ అ



విషయాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించి వుండాల్సింది.

సర్జికల్ దాడులు... ఈ దాడులు రాజకీయ సాధనంగా ఎందుకు మారాయి? అనే ప్రశ్నకు మోడీ సమాధానమిస్తూ, ఇందులో చాలా రిస్క్ వుందని, సూర్యాస్తమయం తర్వాత కొనసాగించవద్దని ఆదేశించానని చెప్పారు. కానీ ఇక్కడ రాజకీయ ప్రయోజనం కోసం వాటిని ఉపయోగించుకున్న తీరు వివాదాస్పదమైంది. ఈ విషయాన్ని లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) హుడా కూడా స్పష్టం చేశారు. ఈ దాడుల సమాచారంపై మీడియాలో చాలా ప్రచారం జరిగిందని, ఎంపిక చేసిన వీడియోలు, ఫోటోలను లీకు చేయడం ద్వారా రాజకీయం చేశారని వ్యాఖ్యానించారు. ఇదంతా అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. దాని గురించి మోడీ మాట్లాడలేదు. ఇక అల్లరి మూకల ఆగడాలపై మోడీ ఆందోళన వెలిబుచ్చారు. కానీ ఇక్కడ కూడా కొన్ని కీలకమైన వాస్తవాలను పక్కనపెట్టారు. జార్ఖండ్‌లోని హజారిబాగ్‌లో ఈ కేసులకు సంబంధించిన ఎనిమిది మంది నిందితులను మంత్రి జయంత్ సిన్హా పూల దండలు వేసి మరీ గౌరవించారు, దాని గురించి మోడీ ఏమీ మాట్లాడలేదు. అదంతా భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ వ్యాఖ్యానించిన నితిన్ గడ్కరీ గురించి ఏమీ మాట్లాడలేదు. దాద్రి నింది తుడి భౌతిక కాయంపై త్రివర్ణ పతాకం కప్పిన మరో మంత్రివర్గ సభ్యుడు మహేష్ శర్మ గురించి మోడీకూడా మాట్లాడలేదు. విద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారిని ట్విట్టర్‌లో మోడీ అనుసరించడాన్ని పలువురు జర్నలిస్టులు ప్రశ్నించారు. దీనిపై కూడా మోడీ నోరు మెదపలేదు.

రాఫెల్ విమానాల కొనుగోలుకు సంబంధించి తొలి ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందో మోడీ వివరించలేదు. అనీల్ అంబానీ సంస్థలకు (వాస్తవానికి దివాలా తీసిన సంస్థ) కాంట్రాక్టులు ఇవ్వడానికి గల కారణాలు చెప్పలేదు. ఈరంగంలో అపార అనుభవం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఎఎల్‌ను ఎందుకు ఈ పోటీ నుండి తొలగించారో కారణం వెల్లడించలేదు. తలాక్ బిల్లును లింగ సమానత్వంగా పేర్కొంటూ శబరిమల అంశాన్ని సాంప్రదాయంగా ఎలా పరిగణిస్తారో మోడీ వివరించలేదు.

రైతు రుణాల రద్దు..

ఇది రైతులకు మేలు చేసే అంశంగా బిజెపి మంత్రులు చాలా ఆర్భాటంగా చెప్పుకుంటూ వస్తున్నా, మోడీ మాత్రం రైతు రుణాల రద్దు సమస్యకు పరిష్కారం కాదని చెప్పారు. ఎందుకంటే మెజారిటీ రైతులు దీనివల్ల లబ్ది పొందడం లేదని, వీరిలో చాలా మంది బ్యాంకుల నుండి కన్నా వడ్డీ వ్యాపారుల నుండి రుణాలు తీసుకోవడమే ఇక్కడ ప్రధానంగా ఉందని చెప్పారు. అయితే గణాంకాలు చూస్తే పరిస్థితి వేరుగా వుంది. 2018 ఆగస్టులో నాబార్డ్ నిర్వహించిన అధ్యయనంలో 52.5 శాతం మంది రైతులు రుణ ఊబిలో కూరుకుపోయారు. వీరిలో కేవలం 11.5 శాతం మంది మాత్రమే వడ్డీ వ్యాపారుల నుండి రుణాలు తీసుకున్నారు. రైతు రుణ భారానికి ప్రధాన కారణం, వ్యవసాయంపై పెట్టుబడి పెరిగిపోవడమే.

తైవాన్ విలీనం చారిత్రిక కర్తవ్యం

చైనా నేత జిన్‌పింగ్ ఉద్ఘాటన

బీజింగ్: తైవాన్ పూర్తి పునరేకీకరణను ఒక చారిత్రిక కర్తవ్యంగా తాము భావిస్తున్నామని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. తైవాన్ ఎప్పటికైనా చైనా ప్రధాన భూభాగంలో తిరిగి విలీనం కావల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తైవాన్‌లోని తన సహ జాతీయులకు చైనా సందేశం పంపి 40 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఇక్కడి గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్ లో ఏర్పాటైన కార్యక్రమంలో సీ జిన్‌పింగ్ ప్రసంగించారు. 1949 నుంచి చైనా కమ్యూనిస్టు పార్టీ, చైనీస్ ప్రభుత్వం, ప్రజలు తైవాన్ సమస్యకు పూర్తి పునరేకీకరణే పరిష్కారమని, ఇదొక చారిత్రిక కర్తవ్యమని ప్రగాఢంగా భావిస్తున్నారని జిన్‌పింగ్ తెలిపారు. ఈ డెబ్బయ్యేళ్లలో తైవాన్‌తో సంబంధాల విషయంలో కొన్ని ముఖ్యమైన విజయాలు సాధించామన్నారు. చైనాతో తైవాన్ శాంతియుత పునరేకీకరణలో బయటి వ్యక్తుల జోక్యాన్ని, తైవాన్ వేర్పాటు వాదుల కుతంత్రాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని జిన్‌పింగ్ స్పష్టంగా తేల్చి చెప్పారు. చైనాతో తైవాన్ ఏకీకరణ 'ఒక దేశం, రెండు వ్యవస్థల' విధానంలో భాగమేనని, ఇది తైవాన్ దేశభక్తుల యోగక్షేమాలను పరిరక్షిస్తుందని ఆయన అన్నారు. 1949లో చైనా ప్రధాన భూభాగంపై పోరాటానికి తెరపడిన తరువాత ఇరు ప్రాంతాలు వేర్వేరుగా పాలింపబడినప్పటికీ, తైవాన్‌ను తాము ఇప్పటికీ తమ దేశంలో అంతర్భాగంగానే చూస్తున్నామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం 1992లో ఒక చైనా విధానం కింద మాతృ భూమితో తైవాన్ విలీనానికి సంబంధించి ఏకాభిప్రాయం కుదిరిందని ఆయన చెప్పారు. చైనాతో తైవాన్ పునరేకీకరణ తిరుగులేనదన్నారు. తైవాన్ జలసంధికి ఇరువైపులా వున్న ఈ రెండు భూ భాగాలు చారిత్రికంగా, చట్టపరంగా ఒక్కటిగా ఉంటూ వస్తున్నాయన్నారు.



సహజ బంధుత్వ పరంగా, జాతీయత పరంగా ఏ విధంగా చూసినా రెండు ప్రాంతాల చైనీయులు ఒక్కటిగానే వున్నారని, వీరిని ఏ శక్తీ వేరు చేయలేదని ఆయన చెప్పారు. శాంతియుత పునరేకీకరణ తరువాత కూడా చైనా సార్వభౌమత్వం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలు, సామాజిక వ్యవస్థకు లోబడి తైవానీయుల జీవన శైలిని, ప్రైవేట్ ఆస్తిని, తైవాన్ పాలకుల ప్రయోజనాలను చైనా పూర్తిగా గౌరవిస్తుంది, పరిరక్షిస్తుందని జిన్‌పింగ తెలిపారు.

శాంతియుత సంబంధాలనే కోరుకుంటున్నాం

60వ విప్లవవార్షికోత్సవంలో రావుల్ కాస్ట్రో



శాంటియాగో డి క్యూబా: అమెరికాతో గౌరవప్రదమైన శాంతియుత సంబంధాలను కొన సాగించేందుకు క్యూబా ఇప్పటికీ సిద్ధంగా వుందని ఆ దేశ మాజీ అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో పునరుద్ఘాటించారు. క్యూబన్ విప్లవ 60వ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో పరస్పర గౌరవంతో కూడిన శాంతియుత సహజీవనాన్ని తాము కోరు కుంటున్నామన్నారు. అమెరికాతో ఘర్షణ వాతావరణాన్ని తాము కోరుకోవటం లేదని, అదే అనివార్యమైతే దానిని ఎదుర్కొనేందుకు కూడా క్యూబా సిద్ధంగా వుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వం సమతుల్యతతో కూడిన ధోరణితో వ్యవహరించి ఈ పరిస్థితిని నివారిస్తుందని తాము ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. అమెరికా తమ దేశంపై దాదాపు ఆరుదశాబ్దాలుగా వాణిజ్య, ఆర్థిక దిగ్బంధాన్ని కొనసాగిస్తోందని ఆయన గుర్తు చేశారు. దీనితో పాటు క్యూబా విప్లవం సాధించిన విజయాలను కూడా ఆయన ప్రస్తావించారు.



బోల్సనారో తీరు బాగోలేదు

- క్యూబా వైద్యులు వెనక్కి రావడానికి ఇదే కారణం
- 'మోర్ ది డాక్టర్స్' కార్యక్రమంపై క్యూబా ప్రజారోగ్య మంత్రిత్వశాఖ

సుదీర్ఘ కాలంగా బ్రెజిల్‌లోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తూ వస్తున్న క్యూబన్ డాక్టర్లు ఇటీవల కాలంలో స్వదేశానికి తిరిగి పయనమయ్యారు. అందుకు దారి తీసిన పరిస్థితులు, కారణాలను క్యూబా ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ చానల్‌కు వెల్లడించింది.

బ్రెజిల్‌లో విజయవంతంగా నడుస్తున్న 'మోర్ ది డాక్టర్స్' కార్యక్రమంలో క్యూబా ప్రాతినిధ్యాన్ని ముగించడానికి దారి తీసిన పరిస్థితులేంటి?

ఆ దేశంలో మా డాక్టర్లు సేవలందించడానికి సంబంధించిన నియమ నిబంధనలను మార్చాలని బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికైన జైర్ బోల్సనారో పట్టుబడుతున్నారు. ఇందుకు సంబంధించి ఆయన చేస్తున్న ప్రకటనలు మా డాక్టర్ల వృత్తి నైపుణ్యాలను, అర్హతలను అనుమానించేలా వున్నాయి. పైగా డాక్టర్ల లైసెన్సులను పునస్సమీక్ష జరపాలని, వారి వ్యక్తిగత కాంట్రాక్టులను కూడా సమీక్షించాల్సి వుందని చెబుతున్నారు. బోల్సనారో బృందం లోని ఏ సభ్యుడూ కూడా ఈ అంశాలపై తమతో కనీసం చర్చించేందుకు కూడా ప్రయత్నించ లేదు. అంటే ఈ కార్యక్రమాన్ని కొనసాగించే ఆసక్తి అధ్యక్షుడికి లేదని దీన్ని బట్టి స్పష్టమవు తోంది. పైగా ఈ అంశంపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారు.

ఆ ప్రకటనలేంటి?

ఒకవైపు డాక్టర్లు తమ అర్హత, సామర్ధ్యాలను నిరూపించుకునేందుకు పరీక్షకు సిద్ధం కావాలి అని పేర్కొంటున్నారు. మరోవైపు ఆ పరీక్ష లేంటి, ఎప్పుడు నిర్వహిస్తారనే ప్రస్తావన రావడం లేదు. క్యూబా డాక్టర్లందరికీ రాజకీయ ఆశ్రయం కల్పిస్తానని బోల్సనారో ప్రకటిస్తున్నారు కానీ క్యూబాకు ఆ నమ్మకం కలగడం లేదు. అటువంటి అనిశ్చితి వాతావరణంలో వారు సురక్షితంగా వుంటారనే నమ్మకం మాకు కలగడం లేదు. బ్రెజిల్ ప్రజల ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించి అధ్యక్షుడు ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారు. బ్రెజిల్‌తో వున్న రాజకీయ సంబంధాలు, సహకారం ప్రాతిపదికగా ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుని మోర్ ది డాక్టర్స్ కార్యక్రమం చేపట్టాం.

బ్రెజిల్‌లోని పార్టీతో క్యూబా రాజకీయ సంబంధాలు కొనసాగిస్తోందనడంలో వాస్తవం ఏమైనా వుందా?

అందులో ఎలాంటి వాస్తవం లేదు. ఈ కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార ప్రాజెక్టుగా క్యూబా ఎన్నడూ పరిగణించ లేదు. బ్రెజిల్ రోగిని పట్టుకుని ఏ పార్టీకి చెందినవారు అని క్యూబా డాక్టర్లు ఎన్నడూ ప్రశ్నించలేదు. లక్షలాదిమంది బ్రెజిలియన్లకు మౌలిక ఆరోగ్య సౌకర్యాలు అందకపోవడంపై ఆందోళన చెందిన దిల్మా రౌసెఫ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎలాంటి లాభార్జన లేని , పరస్పర గౌరవం, సంఘీభావం ప్రాతిపదికన రెండు దేశాలు కలిసి చేపట్టిన కార్యక్రమం ఇది. మానవత్వం, సుహృద్భావం, శ్రామిక అంతర్జాతీయ సంబంధాలు కలిగిన చరిత్ర సాక్షిగా రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చెదిరిపోవు, ఎలాంటి మార్పు వుండదు, గతంలో మాదిరిగానే బ్రెజిల్ యువత క్యూబాకు వచ్చి వైద్య విద్యను అభ్యసించవచ్చు.

164 దేశాల్లో 6 లక్షల వైద్య బృందాలు విజయవంతంగా సేవలందించాయి. ఈ విధమైన అంతర్జాతీయ కృషికి క్యూబాను ప్రేరేపిస్తున్న ఆశయాలేమిటి?

క్యూబా అందించే అంతర్జాతీయ సహకారం రెండు అంశాల ప్రాతిపదికన వుంటుంది. ఒకటి, ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవలందించడం, సహకారం తీసుకునే దేశాలతో ఎన్ని విభేదాలున్నప్పటికీ వారి నుంచి విజ్ఞాపన వస్తే వెంటనే స్పందించడం. గత 60 ఏళ్లుగా క్యూబా చేస్తున్నది ఇదే. సౌహార్థత, పరస్పర ప్రయోజనాలు అనే సూత్రాల ఆధారంగానే క్యూబా తన అంతర్జాతీయ కృషిని కొనసాగిస్తున్నది. ఈ విషయంలో తమకు రాజకీయంగా ఎలాంటి ప్రతిబంధకాలు ఎదురుకాలేదు. అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమత్వం, సంస్కృతి, మతం, ప్రభుత్వాల స్వయం నిర్ణయాధికారాన్ని క్యూబా ఎప్పుడూ గౌరవిస్తుంది. క్యూబన్ జాతీయ ఆరోగ్య వ్యవస్థ పటిష్టపరచుకునేందుకు, క్యూబా వైద్యులు మంచి అనుభవాన్ని గడించేందుకు, నిబద్ధత, అంకితభావంతో సేవలందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. క్యూబా వైద్యులు చేస్తున్న ఈ కృషి ద్వారా క్యూబాకు అంతర్జాతీయంగా ఒక గుర్తింపు, గౌరవాన్ని తెస్తున్నాయి. విప్లవానికి మానవీయత అత్యంతావశ్యకం. దీనినే క్యూబా పాటిస్తున్నది.

క్యూబా వైద్య సహకారానికి సంబంధించి ఒక వాదన వినిపిస్తోంది. విదేశాల్లో సేవలందించే క్యూబన్ వైద్యులకు చెల్లింపులు బాగా వుంటాయని, వారి కుటుంబాలు విలాసవంతమైన జీవితాలకు గ్యారంటీ వుంటుందంటారు. దీనికి సంబంధించి వాస్తవమేమిటి?

విదేశాల్లో సేవలందించే క్యూబన్ వైద్యులకు జీతాలు క్యూబాలోనే చెల్లిస్తాం. వారి కుటుంబాలు కూడా ఆ బృందంతో ఉన్నప్పుడు వారికి సామాజిక సేవలు అందిస్తాం. వారు పనిచేసే దేశంలో స్టయిపెండ్ ఇస్తారు. దీంతో సహజంగానే వారి ద్వారా దేశానికి ఆదాయం పెరుగుతుంది. దీనిని మా ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు, దేశంలోని మారుమూల ప్రాంతాలకు ఆరోగ్య సేవల విస్తరణకు వినియోగిస్తాం. వైద్య పరికరాలు, మందుల సరఫరాలో అనేక ఇబ్బందులెదుర్కొంటున్నప్పటికీ ఒక్క పెన్నీ కూడా చెల్లించనవరసరం లేకుండా వైద్య సంస్థల నుంచి ప్రజలు వైద్య సేవలను పూర్తిగా పొందగలుగుతున్నారు. ఆరోగ్య సూచీలో క్యూబా ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ మార్పు కోరుకుంటుంది

బాబువి అన్నీ అబద్ధాలే!

వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యకర్తలతో ప్రధాని మోడీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఆంధ్రప్రదేశ్ మార్పు కోరుకుంటోంది. ఎపిలో ఏం జరుగుతుందో నాకు తెలుసు. చంద్రబాబు నిత్యం అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారు' దుయ్యబట్టారు. అని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అన్నారు. కాకినాడ, మచిలీపట్నం, నర్సాపురం, విశాఖ, విజయనగరం బిజెపి బూత్ స్థాయి కార్యకర్తలతో ప్రధాని మోడీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ప్రాధాన్యమున్న పది విద్యా సంస్థలను ఏపిలో ప్రారంభించామని, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినన్ని సంస్థలు దేశచరిత్రలో ఏ రాష్ట్రానికీ దక్కలేదని, ఇలాంటి సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో ఇంతకాలం ఏర్పాటు చేయనందుకు టిడిపి, కాంగ్రెస్ సమాధానం చెప్పాలని అన్నారు. అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తూనే ఉంటామని, మనం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, విజన్‌ను యువతకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు కుంభకోణాలకు పాల్పడ్డారు. నాడు ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను దుష్ట కాంగ్రెస్‌గా అభివర్ణిస్తే, ఇప్పుడు అధికారంలో ఉన్న వాళ్లు దోస్త్ కాంగ్రెస్ అంటున్నారు. తెలంగాణ తరహాలో ఏపిలోనూ మహాకూటమిని ప్రజలు తిరస్కరిస్తారు'అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షలను చాలా వరకు తమ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని, కేంద్ర పథకాలను టిడిపి తమ ఘనతగా చెప్పుకుంటోందని, ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు. 'రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏవిధంగా విభజించింది జనం మరిచిపోరు. ప్రజల మనోభావాలను లెక్క చేయకుండా అన్నదమ్ములను విడదీశారు. విభజనపై మిగతా పార్టీలు రాజకీయం చేస్తుంటే ఎపికి న్యాయం కోసం మాట్లాడింది బిజెపియే' అని ఆయన అన్నారు.

మొదటి పేజీ తరువాయి

నా కష్టానికి కూలి ఇవ్వండి

ఆశీర్వదించారు. ప్రభుత్వ పాఠశాలలో సరదగా పిల్లలతో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ. వచ్చే ఎన్నికల్లో బిజెపి నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లిములను జైల్లోపెడతామని ఆ పార్టీ నాయకులు హెచ్చరికలను ఆయన తప్పుపట్టారు. కేరళలో మహిళలను గుడిలోకి వెళ్లనివ్వకుండా బిజెపి ఇబ్బంది పెడుతోందన్నారు.. పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కాన్పుకోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే పేద గర్భిణులకు వైద్య ఖర్చులనూ ప్రభుత్వమే భరించేలా త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని పంపుసెట్లకు సోలార్ పవర్ కనెక్షన్లు ఇస్తామని, దీని ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఏడాదికి కేంద్రానికి ఆరువేల కోట్ల రూపాయలు పన్ను చెల్లిస్తున్నామని, కనీసం ఆ డబ్బు కూడా మనకు ఇవ్వడం లేదన్నారు. నిధులు ఇవ్వకపోయినా పోలవరాన్ని పూర్తిచేస్తానని పునరుద్ఘాటించారు. కక్ష సాధింపుగా చివరకు ఫోన్లు కూడా మోడీ ట్యాప్ చేస్తున్నారని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల దేశ ఆర్థిక స్థితి కుదేలయ్యిందన్నారు. కేంద్రం నిధులివ్వకపోయినా కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, రామాయంపేటలో నౌకాశ్రయాన్ని మనమే ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రం కోసం పవన్‌కళ్యాణ్ కూడా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓ కమిటీ ద్వారా రాష్ట్రానికి 70వేల కోట్ల రూపాయలు కేంద్రం నుంచి రావాల్సి ఉందని తేల్చారని, దీనిపైన పవన్ నిలదీయాలన్నారు. కెసిఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రజల కోసమే తాను ఓపిగ్గా ఉన్నానని, సభ్యతా సంస్కారం తనకు ఉన్నాయన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణాలోనూ ఇంత అభివృద్ధి జరగలేదని తెలిపారు. మోడీ తలచుకుంటే మళ్లీ జైలులో పెట్టిస్తాడన్న భయం జగన్‌లో ఉందని, ఆయనపైన ట్రయల్స్ కూడా పూర్తయ్యాయని, ఈ సమయంలోనే హైకోర్టు విభజన చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, కలెక్టర్ ప్రద్యుమ్న, డిఐజి కాంతిరాణాటాటా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఎంపిపి సాంబశివ, జడ్‌పిటిసి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ఆవు పన్ను

విడిగా సంచరిస్తున్న ఆవుల సమస్యను పరిష్కరించేందుకు ఇది తోడ్పడుతుందని తెలిపారు. ఆవుల కోసం తాత్కాలిక షెడ్లు నిర్మించేందుకు గాను ప్రభుత్వం స్థానిక సంస్థలకు రూ.100 కోట్లు మంజూరు చేసింది.

ఏక్తాశక్తి నిర్వాకంతో పస్తులు

(మొదటిపేజీ తరువాయి)

అలమటిస్తుంటే చలించిన ఉపాధ్యాయులు హుటాహుటిన అందుబాటులో ఉన్న అరటిపళ్లు, బిస్కెట్లు రప్పించడం, ఉప్మా వంటివి చేయించి పెట్టి చిన్నారుల ఆకలి తీర్చే ప్రయత్నం చేశారు. అలాగే ప్రకాశం జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ ఏజెన్సీకి అప్పగించడంపై నిరసనకు దిగిన కార్మికులను, నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఈడ్చుకుపోయారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని 3,253 పాఠశాలల్లో ఈ నెల 1 నుంచి జిల్లాలో మూడు క్లస్టర్ పాయింట్ల ద్వారా 650 పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందించే విధంగా ఢిల్లీకి చెందిన ఏక్తా శక్తి ఫౌండేషన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థ మంగళవారం నుండి బాధ్యతలను చేపట్టింది. మంగళవారం కొన్ని పాఠశాలలకు ఆప్షనల్ హాలీడే ప్రకటించడంతో పూర్తిస్థాయిలో బుధవారం నుండి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా ఏలూరు, ఉండి, యర్నగూడెం ప్రాంతాల్లో మూడు క్లస్టర్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఏలూరు క్లస్టర్ పరిధిలోని 214 పాఠశాలల పరిధిలోని 20,500 మందికి మధ్యాహ్న భోజనం అందలేదు. దీంతో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ వద్దనున్న సొమ్ముతో బిస్కెట్ ప్యాకెట్లు అందించే ప్రయత్నం చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కొన్ని పాఠశాలలకు ఫౌండేషన్ నుంచి భోజనం అందింది. ఫౌండేషన్ సంబంధీకులకు పాఠశాలలు ఎక్కడున్నాయో, ఎంత మందికి భోజనం అందించాలనేది స్పష్టత లేని విషయం బయట పడింది. ఏక్తాశక్తి నిర్వాహకులు విద్యాశాఖాధికారులకు అందుబాటులో లేకపోవడం, భోజనం తీసుకురావాల్సిన వ్యాన్‌డ్రైవర్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటం గమనార్హం. మొత్తంగా జిల్లాలోని 11 మండలాలకు చెందిన 500కుపైగా పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందలేదు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన కార్మికుల ద్వారా వంట చేయించి ఒంటిగంటన్నర ప్రాంతంలో విద్యార్థులకు భోజనాలు అందించారు.

తూర్పులో రెండోరోజూ అర్ధాకలే...

తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రెండోరోజైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పస్తులు తప్పలేదు. జగ్గంపేట మండలంలోని మల్లిశాల, రాజపూడి, మల్లిశాల మెయిన్, వెంగాయమ్మపురం, గోవిందపురం పాఠశాలలకు భోజనం సకాలంలో అందించలేదు. కొన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం చేరుకున్నప్పటికీ చాలీచాలనట్లుగా ఉండడంతో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా వంటలు చేయించాల్సిన పరిస్థితి తలెత్తింది. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, కొండుకుదురు పాఠశాల విద్యార్థులకు భోజనం సరఫరా చేయలేదు. దీంతో భోజనం లేక విద్యార్థులు విలవిల్లాడిపోయారు. పెద్దాపురం మండల పరిధిలో 78 పాఠశాలల్లో సగం పాఠశాలలకే వాహనాలపై భోజనాలు సరఫరా చేశారు. ముద్దముద్దగా మారిన అన్నం, ఉడికీ ఉడకని కోడిగుడ్లు, తాళింపు, రుచీపచీ లేని పప్పు సరఫరా చేయడంతో విద్యార్థులు ఈ అన్నం తినలేక పడేశారు.

ఒంగోలులో అరెస్టులు

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ప్రకాశం జిల్లా జాతీయ రహదారిపై త్రోవగుంట వద్దఉన్న ఏక్తాశక్తి కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. ట్రయల్‌రన్‌గా పాఠశాలలకు బోజనాన్ని తీసుకెళుతున్న వాహనాలను అడ్డుకున్నారు. ఆ పాటికే భారీ సంఖ్యలో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, జిల్లా కన్వీనర్‌తో పి.కల్పనతో సహా పది మంది కార్మికులను అరెస్టు చేసి తాలూకా స్టేషన్‌కు తరలించారు. కార్మికులు, విద్యార్థుల ప్రయోనాల కంటే ఢిల్లీ ప్రయివేట్ సంస్థ ప్రయోజనాలే ముఖ్యమా అని మధ్నాహ్నబోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మధ్యాహ్నబోజన ఫదకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తొలి కేసు జివిఎంసిది

(మొదటిపేజీ తరువాయి)

నాలుగోతేదీ నుండి కోర్టుకు సెలవు ఉంది. నేటి విచారణల అనంతరం 20వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులు. సిటీ సివిల్‌కోర్టు భవనాలు సిద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది కనుక సెలవుల అనంతరం నేరుగా అమరావతి నుండి కోర్టులు పనిచేస్తాయని న్యాయవాదులు తెలిపారు. న్యాయవాదులు కక్షిదారులు పెద్దఎత్తున నగరానికి చేరుకోవడంతో ప్రధాన హోటళ్లతోపాటు చిన్న చిన్న హోటళ్లన్నీ నిండిపోయాయి. తరలించిన రికార్డులను ఇంకా సర్దలేదని, వాటిని విచారణకు అనుగుణంగా మార్చుకోవడం, ప్రస్తుత కేసుల విచారణ నోట్ చేసుకోవడం సమస్యగా ఉందని అధికారులు చెబుతున్నారు. న్యాయమూర్తులు అడిగిన సమాచారం ఇవ్వడం కూడా కష్టంగా ఉందని తెలిపారు.

రాఫెల్ ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో టేపులను సభలో వినిపించాలని రాహుల్ పట్టుబట్టారు. స్పీకర్ అందుకు నిరాకరించారు. వెంటనే సభ 2.30కు వాయిదా పడింది. సభ పున్ణప్రారంభమయ్యాక రాఫెల్ అంశంపై జెపిసి వేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు కూడా రాఫెల్ విచారణ వ్యవహారం తమ పరిధిలోకి రాదని చెప్పింది కానీ, జెపిసి ఏర్పాటు చేయకూడదని ఎక్కడా అనలేదని రాహుల్ గుర్తు చేశారు. ఒప్పందంలో రాఫెల్ విమానాల ధరను పెంచడాన్ని రక్షణ శాఖ ఉన్నతాధికారులు సైతం అభ్యంతరం తెలిపారని, కేవలం తన "ప్రియ స్నేహితుడు" అయిన అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చేందుకే మోడీ ఒప్పందంలో మార్పులు చేశారని ఆరోపించారు. అనిల్‌అంబానీ పేరును ప్రస్తావించడానికి అభ్యంతరం చెబుతూ బిజెపి ఎంపిలు ఆందోళనకు దిగడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో సభ 3.30కు వాయిదా పడింది. అనంతరం ప్రారంభమైన సభలో రాహుల్ "ప్రపంచంలోనే అత్యంత విలువైన ఒప్పందాన్ని అనుభవం లేని అనిల్ అంబానీకి ఎందుకు ఇచ్చారు? దేశ సంపదను కొల్లగొట్టి అనిల్ అంబానీ జేబులో వేశారు" అని ప్రశ్నించారు. అయితే అనిల్ అంబానీ పేరు ప్రస్తావించడంపై స్పీకర్ అభ్యంతరం తెలిపారు. దీనికి రాహుల్ స్పందిస్తూ "అనిల్ అంబానీ పేరు చెప్పకూడదా? ఇదేమైనా కొత్త నిబంధనా? కనీసం "ఎఎ" అని కూడా అనకూడదా? అయితే "డబుల్ ఎ" అని చెప్పొచ్చా? అని ప్రశ్నించారు. ఆ తర్వాత "డబుల్ ఎ" అని చెబుతూ తన ప్రసంగాన్ని కొనసాగించారు.. టిఎంసి ఎంపి సౌగత్ రాయ్, బిజెడి ఎంపి కాలికేష్ నారాయణ సింగ్ దేవ్, శివసేన ఎంపి అరవింద్ ఘన్‌పట్ సావంత్, టిడిపి సభ్యుడు గల్లా జయదేవ్, ఎన్సీపి ఎంపి ధనంజయ భీమ్‌రాం మహదిక్ చర్చలో పాల్గొన్నారు.

ప్రభుత్వం రిలయన్స్ కోసమే పని చేస్తోంది: ఎండి సలీం, సిపిఎం

కేంద్రంలోని మోడీ సర్కార్ రిలయన్స్ కోసమే పని చేస్తోందని సిపిఎం లోక్‌సభ పక్ష ఉపనేత మహ్మద్ సలీం ధ్వజమెత్తారు. అంబానీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకే రాఫెల్ డీల్‌ను మోడీ సర్కారు ఆ కంపెనీలకు కేటాయించిందని విమర్శించారు. రక్షణ రంగంలో దేశాన్ని స్వయం సమృద్ధంగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వం రాఫెల్ ఒప్పందాన్ని ప్రైవేటు కంపెనీకి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. రాఫెల్ డీల్‌పై ప్రభుత్వ తీరుతెన్నులు తొలి నుంచి అనుమానాస్పదంగానే ఉన్నాయని అన్నారు. ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వటం లేదన్నారు. 7.7 శాతం ధరలు పెరిగాయని నిపుణులు తెలపడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు పార్లమెంట్‌కు ఎటువంటి నివేదిక ఇవ్వకముందే, ఇచ్చామని సుప్రీంకోర్టుకు చెప్పారని, దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. అందువల్లే రాఫెల్ డీల్‌పై సుప్రీం కోర్టు స్వతంత్ర విచారణ చేపట్టలేమని చెప్పినట్లు గుర్తు చేశారు. ఈ వాస్తవానికి భిన్నంగా సుప్రీంకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. రాఫెల్ డీల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాలని, అప్పుడే అన్ని విషయాలు వెలుగుచూస్తాయని వ్యాఖ్యానించారు.

శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశం

(మొదటిపేజీ తరువాయి)

మారడంతో వారు వెనుతిరగాల్సి వచ్చింది. బిందు అమ్మిని (41) కొజికోడ్‌లోని కొయిలాండికి చెందిన వారు కాగా, మల్లప్పురంలోని అంగదిప్పురానికి చెందిన కనకదుర్గ (41) అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వున్నారు. యాత్ర పూర్తి చేయడానికి పోలీసులు తమకు సహకరించారని వారిరువురు తెలిపారు. నిరసనలు వెల్లువెత్తే ప్రమాదాన్ని ఊహించి ముందు జాగ్రత్తగా ఇరువురి నివాసాల ముందు పోలీసు బలగాలను మోహరించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ, గతంలో అనేకసార్లు మహిళల ప్రవేశంపై అభ్యంతరాలు ఎదురైనా, ఈసారి అలాంటి అడ్డంకులు ఎదురవలేదన్నారు. ఎవరైతే శబరిమలను సందర్శించాలనుకుంటున్నారో వారికి పోలీసుల రక్షణ కల్పిసామని హామీ ఇచ్చారు. కాగా ఆలయ వ్యవహారాల ఇన్‌చార్జి మంత్రి సురేంద్రన్ మాట్లాడుతూ, వాట్సప్‌లో వచ్చిన వీడియో చూసేవరకు తనకు ఈ విషయం తెలియదన్నారు.

ఆలయ సంప్రోక్షణ

మహిళల ఆలయ ప్రవేశం పూర్తయిన కొద్ది గంటల్లోనే ఆలయ ప్రధాన పూజారి గర్భగుడి తలుపులను మూసివేసి ఆలయ సంప్రోక్షణ పూర్తిగావించారు. దేవస్థానం ఉన్నతాధికారి ఈ విషయాన్ని ధృవీకరించారు. అయితే ఇది సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించడమే కాగలదని మంత్రి సురేంద్రన్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

ఇదిలావుండగా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. తిరువనంతపురం సచివాలయం వరకు బిజెపి నిరసన ప్రదర్శన నిర్వహించింది. కొల్లాంలో రోడ్డుపై బైఠాయించారు.ఇదంతా పెద్ద డ్రామా అని, వారిద్దరు నిజమైన భక్తులు కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రన్ ఆరోపించారు. ముఖ్యమంత్రి విజయన్ ఆధునిక ఔరంగజేబు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధరన్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి మొండి వైఖరి కారణంగానే ఈనాటి సంఘటనలు చోటు చేసుకున్నాయని ప్రతిపక్ష నేత రమేష్ చెన్నితల ఆరోపించారు.

12 నుంచి సంక్రాంతి సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి సెలవుల్లో రాష్ట్రప్రభుత్వం మార్పులు చేసింది. ఈ నెల 12 నుంచి 20 వరకు రాష్ట్రంలోని పాఠశాలలకు సెలవులు ఉంటాయని రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ బుధవారం మెమో జారీ చేశారు. ఈ నెల 21న తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ముందుగా ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 8నుంచి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాల్సి ఉంది. 'జన్మభూమి -మా ఊరు' నేపథ్యంలో ప్రభుత్వం ఈ సెలవుల్లో మార్పులు చేసింది.

క్యాలెండర్ ప్రకారమే సెలవులివ్వాలి: ఎపిటిఎఫ్

అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే సంక్రాంతి సెలవులివ్వాలని ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి హృదయరాజు డిమాండ్ చేశారు. విద్యకు సంబంధించిన జన్మభూమి జనవరి 7న ఉందని, 8 నుంచి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు వారి సొంత పనుల రీత్యా కుటుంబాలతో సహా ఇంతర ప్రాంతాలకు ముందస్తు రిజర్వేషన్లు చేసుకున్నారని తెలిపారు. సెలవుల్లో మార్పులు చేయొద్దని కోరారు.

సమస్యలపై జన్మభూమిలో నిలదీయండి

రాష్ట్ర రైతాంగానికి ఎపి రైతు సంఘం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి గ్రామ సభల్లో రైతులు తమ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎపి రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై కేశవరావు, ప్రధాన కార్యదర్శి పి పెద్దిరెడ్డి బుధవారం ప్రకటనను విడుదల చేశారు. ఈనెల 5న వ్యవసాయరంగంపై గ్రామసభ నిర్వహించనున్నారని, ఆ రోజు రైతులు ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయం సుభిక్షంగా ఉందని చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని, వాస్తవానికి రుణభారం, మార్కెట్ సమస్యలు, కరువు, తుపానుల వల్ల రైతులు ఆర్థికంగా చితికిపోయారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పుడు లక్ష కోట్ల రుణమాఫీ ఉంటే రూ.24,500 కోట్ల రుణానికి సంతకం పెట్టిందని, ఇప్పటి వరకూ 4, 5 విడతల మాఫీ డబ్బులు జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రతి ఏడాదీ 300 మండలాల్లో తీవ్ర కరువు, ప్రకృతి విపత్తులు ఉన్నా ప్రభుత్వ సాయం నామమాత్రమని, రైతు ఆత్మహత్యలు, వలసలు ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. చనిపోయిన రైతులను గుర్తించకపోగా గుర్తించిన వారికి కూడా పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

పల్లెటూరును సెట్ చేస్తున్నారు


చిరంజీవి



చిరంజీవి 'ఖైదీ నంబర్ 150' తర్వాత నటిస్తున్న చిత్రం 'సైరా' నరసింహారెడ్డి'. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రతో తెరకెక్కిస్తుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ సుమారు రూ.200 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. ఇప్పటికే చాలా భాగం చిత్రీకరణ పూర్తిచేసుకుంది. తదుపరి షెడ్యూల్ సంక్రాంతి తర్వాత ప్రారంభించేందుకు యూనిట్ సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించనున్న సన్నివేశాల కోసం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ సెట్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో చిరంజీవితో పాటు నయనతార, అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి, తమన్నా తదితరులతో సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ భారీ షెడ్యూల్ తర్వాత మరో షెడ్యూల్‌తో మార్చినాటికి పూర్తయ్యేలా యూనిట్ సన్నాహాలు చేస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని జులైలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



ఒక్క క్షణం అలా కనిపించినా సక్సెస్ అయినట్టే

"నేను దివంగత హరికృష్ణగారికి పెద్ద అభిమానిని. ఓరకంగా ఆయనే నా ఇన్‌స్పిరేషన్. ఈ 'ఉన్మాది' సినిమాలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. ఒక్క క్షణం అలా కనిపించి ఉన్నా నేను సక్సెస్ అయినట్లే" అని దర్శకుడు ఎన్.ఆర్.రెడ్డి చెప్పారు. ఆయన దర్శకత్వంలో తయారవుతున్న చిత్రం 'ఉన్మాది'. చిత్ర ఆడియో ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతోంది. ఎన్.రామారావు నిర్మాత. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను రాజ్‌కందూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే రాఘవకు చెప్పి ఆయన సపోర్ట్ తీసుకున్నా. అలానే షూటింగ్ జరిగిన నకిరేకల్ ఊర్లో కూడా అందరి సపోర్ట్ లభించింది. ఇక నేను చేసిన 'డేర్' సినిమా కూడా చాలా మంచి సపోర్ట్ అందించారు. ఈ సినిమా స్టోరీ చాలా డిఫరెంట్‌గా ప్రేక్షకులకు థ్రిల్‌ను కలుగ జేస్తుంద'ని అన్నారు.

ఎన్.శంకర్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. తమిళ్‌లో రాజ్‌కుమార్ కూడా ఇదే వయసులో హీరోగా పరిచయం అయ్యారు. ఎన్.ఆర్.రెడ్డి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్‌లో అద్భుతంగా నటించారు. హీరోయిజం, విలనిజం రెండూ చూపించదగిన క్యారెక్టర్ అది' అని చెప్పారు. నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ 'కాన్సెప్ట్‌కి తగిన పేరు అని చెప్పారు. డేవిడ్ మంచి పాటలు ఇచ్చార'ని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ.. అన్ని పాటలు బాగా వచ్చాయి. ప్రేక్షకులు ఊహించిన దాని కంటే ఎక్కువగా మెస్మరైజ్ చేస్తుంది. ఈ సినిమా అందరూ ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

దీపిక దోశ



ఇప్పటి వరకూ రణవీర్ సింగ్, దీపికా పదుకొనే వివాహం, రిసెప్షన్‌లతో డిసెంబర్ అంతా వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం విహార యాత్రలో ఉన్న వీరిద్దరూ మరోసారి సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేస్తున్నారు. ఏదో సినిమా గానీ, కొత్తగా ఫ్యాషన్ వీక్‌లో మెరిస్తే వార్తల్లో నిలుస్తుంది దీపికా. కానీ ఆమె పేరు మీద దోశ అమ్ముతున్నట్టు తన అభిమాని ఒకరు ఈ బాలీవుడ్ హీరోయిన్‌కు ట్విట్టర్ ఖాతా ద్వారా తెలిపాడు. దానికి సంబంధించిన మెనూ కూడా రోస్టర్ కూడా ఫొటో తీసి పోస్టు చేశాడు. ఇదెక్కడో ఇండియాలో కాదు అమెరికాలోని టెక్సాస్‌లో ఓ హోటల్‌లో ఉంచిన మెనూలో 'దీపికా పదుకొనే దోశ' అని పెట్టారు. ఈ పోస్టుకు దీపికా స్పందిస్తూ..ఈ ఏడాది ఎంతబాగుందని రీట్వీట్ చేసింది. మరో నెటిజన్ ట్వీట్ చేస్తూ' పూణేలో కూడా మీ పేరుతో రోటీలు అమ్ముతున్నారు' అని పోస్టు చేశాడు. దీనికి రణవీర్ స్పందిస్తూ..ఆ రోటీని నేను తింటా అని పేర్కొన్నాడు.


ఆ నమ్మకంతో హక్కులు ఇచ్చారు


అశోక్ వల్లభనేని

"సినిమా బావున్నప్పుడు థియేటర్లు ఆటోమెటిక్‌గా పెరుగుతాయి. 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమా తక్కువ థియేటర్స్‌లో విడుదలైనా పెద్ద హిట్ అయ్యింది. 'అర్జున్‌రెడ్డి' సినిమాకు తక్కువ థియేటర్లు దొరికాయి. ఆ తర్వాత దాని స్థాయి ఏమిటో తెలిసిందే. మంచి సినిమా అనే నమ్మకంతో 'పేట'ను సంక్రాంతికి విడుదల చేస్తున్నాం. ఇప్పటికే 50 శాతం వ్యాపారం అయిపోయింది. మరో 50 శాతం బిజినెస్ ప్రాసెస్‌లో ఉంది" అని నిర్మాత అశోక్ వల్లభనేని చెప్పారు. రజనీకాంత్, కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న చిత్రం 'పేట్ట'. ఈ చిత్రాన్ని తెలుగులో 'పేట'గా ఈనెల 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అశోక్ వల్లభనేని మాట్లాడారు.

- బస్ కండక్టర్ నుంచి దక్షిణాది సూపర్‌స్టార్‌గా రజనీ ఎదిగారు. ఆయన నాకు స్ఫూర్తి. దాని వల్లే అతని సినిమా చేయగలిగే స్థాయిని అందుకోగలిగాను. ఆయనలో ఎన్నో సేవాగుణాలున్నాయి. తమిళ ప్రజలకు ఎంతో మేలు చేసిన రజనీకాంత్ తెలుగు ప్రజలకు ఏం చేశారనే ప్రశ్న వస్తుంది. అందుకోసమని ఈనెల 6న జరగబోయే 'పేట' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంచి సేవను అందిస్తోన్న రెండు, మూడు అనాథ శరణాలయాలకు రజనీకాంత్ చేతుల మీదుగా నగదును చెక్కుల రూపంలో అందించబోతున్నాం. నా పరిధిలో నేను సేవా కార్యక్రమాలను చేస్తుంటాను. వాటిని బయటకు చెప్పలేదు. ఈసారి రజనీ వంటి అగ్రనటుడిచే సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.
- దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, రజనీకాంత్‌కి వీరభక్తుడు. ఈ సినిమాతో కచ్చితంగా హిట్ కొడతాడని నమ్మకంగా ఉన్నారు. ట్రైలర్‌ను చూస్తే రజనీకాంత్ పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయారనిపించేంత గొప్పగా ఉంది. బాషా, నరసింహ తరహాలో ఉండే కథ. అన్ని అంశాలూ ఉన్నాయి. ఆయన గత చిత్రాలతో పోల్చితే నెక్స్‌ట్ లెవల్ మూవీ. అనిరుధ్ వెర్సటైల్ మ్యూజిక్ అందించారు. పాటలకు చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది.
- తెలుగులో మణిరత్నం డైరెక్ట్ చేసిన 'నవాబ్' సినిమాను నేనే స్వయంగా రిలీజ్ చేసి హిట్ కొట్టాను. అదేవిధంగా 'సర్కార్' సినిమాను అనుకున్న టైంలో రిలీజ్ చేసి విజయ్‌కి తెలుగులో ఓ మార్కెట్‌ను క్రియేట్ చేశాం. అదే నమ్మకంతో సన్‌పిక్చర్స్ సంస్థ ఎక్కువ ఆఫర్లు వచ్చినా నాకు తక్కువలోనే ఈ సినిమా తెలుగు హక్కులను ఇచ్చారు. అందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.
- తెలుగులో స్ట్రయిట్ సినిమాను ఈ ఏడాది ప్లాన్ చేస్తున్నాం. కథలు వింటున్నాను. మంచి కథ, హీరో దొరకగానే ప్రకటిస్తాను. లేకుంటే.. చిన్న బడ్జెట్ చిత్రాలు చేసుకుంటాను.

గోవింద... ఫన్నీ దొంగ



'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్ఎల్‌బీ' చిత్రాలతో హీరోగా తనకంటూ ముద్రను సంపాదించుకున్నాడు సప్తగిరి. తాజాగా ఓ చిత్రాన్ని చేయబోతున్నారు. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' తెరకెక్కించిన అరుణ్ పవార్ డైరెక్షన్‌లో శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ పవార్ మాట్లాడుతూ 'కథకు కరెక్ట్ టైటిల్ ఇది. ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. ఇతనొక ఫన్నీ దొంగ. ఇతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఆయనేం చేశాడన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు కూడా ఇందులో బాగా కుదిరాయి. సప్తగిరి బాడీ లాంగ్వేజ్‌కి పర్‌ఫెక్ట్‌గా సూటయ్యే కథ ఇది" అని చెప్పారు.

నిర్మాతలు మాట్లాడుతూ.. ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇప్పటికి 60 శాతం చిత్రం పూర్తయింది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని తెలిపారు. వైభవీ జోషీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ప్రేమికుల రోజున 'గల్లీ బాయ్'


రణవీర్ సింగ్, అలియా భట్

రణవీర్ సింగ్ ఈ సారి 'గల్లీబాయ్'గా రాబోతున్నాడు. అదీ ప్రేమికుల రోజున ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. మనకీ ఓ రోజు వస్తుంది అన్నది ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో అలియా భట్ కథానాయిక. జోయ్ అక్తర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో రెండు పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. అందులో ఒకటి రణవీర్, అలియా పక్కపక్కనే కూర్చొని ఒకే ఇయర్ ఫోన్‌ను చెరొక చెవిలో పెట్టుకుని బాధగా కూర్చొన్నది. మరొకటి రణవీర్ సింగల్‌గా ఉన్న ఫొటో ఒకటి. ఇందులో రణవీర్ వీధి ర్యాపర్‌గా కనిపించబోతున్నాడు. ఈ చిత్రంతో మొదటిసారిగా రణవీర్, అలియా జోడీ వెండితెరపై చూడబోతున్నాం.

రాజన్నా నిన్నాపగలరా..!


మమ్ముట్టి

వై.యస్. రాజశేఖర్ రెడ్డి రాజకీయ జీవితంలో పాదయాత్ర కీలక ఘట్టం. ఆ సమయంలో జరిగిన ముఖ్య సంఘటనల సమాహారంతో 'యాత్ర' సినిమా రూపొందింది. మలయాళ నటుడు మమ్ముట్టి వైఎస్ఆర్ పాత్రలో నటించారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్, టీజర్, డైలాగ్ టీజర్లకు మంచి స్పందన వచ్చిందని చిత్రబృందం చెబుతోంది. ఇప్పుడు 'రాజన్నా నిన్నాపగలరా..' అంటూ సాగే రెండవ సింగిల్‌తో ఆయన పాదయాత్ర వలన ప్రజల ఆనందాన్ని చూపించారు. 'ఆనందో బ్రహ్మ' దర్శకుడు మహి వి.రాఘవ్ తెరకెక్కిస్తున్నారు. 70 ఎంఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రాన్ని నిర్మిస్తోంది. శివ మేక సమర్పకుడు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫిబ్రవరి 8న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, మళయాలంలో కూడా రిలీజ్ చేయనున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'అప్పటి రాజకీయ అనిశ్చితి దృష్ట్యా ఆయన ప్రజలకి దగ్గరగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవటానికి యాత్ర మెదలుపెట్టారు. కానీ ఆ యాత్రలో ఎన్ని విషయాలను ఆయన ఎంత దగ్గరగా చూశారో, సాధారణమైన కష్టాలు కూడా తీర్చుకోలేని అతి సామాన్యుల్ని ఎలా కలిసారో, పేదవారంటే ఎవరో?.. వారు దేనికొసం చూస్తున్నారో? ఆయన ప్రత్యక్షంగా చూశారు. అవన్నీ ఈ చిత్రంలో కన్పిస్తాయ'ని పేర్కొన్నారు.

అమీ నిశ్చితార్థం



నటి అమీ జాక్సన్, బ్రిటన్‌కు చెందిన జార్జ్ పనయోటు 2015 నుంచి డేటింగ్‌లో ఉన్నారు. ఇప్పుడు వీరిద్దరూ వివాహ బంధంతో ఒకటి కాబోతున్నారు. జార్జ్ పవయోటు బ్రిటన్‌కు చెందిన ప్రాపర్టీ డవెలపర్, ది అబిలిటీ గ్రూప్ వ్యవస్థాపకుడు, బిలియనియర్ అడ్రియోస్ పనయోటు కొడుకు. దక్షిణాఫ్రికాలోని జంబియోలో ఆనందంగా గడుపుతున్న వీరు తమ నిశ్చితార్థం ఖరారు అయిందని అమీ జాక్సన్ బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ప్రకటించింది. ' ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి మా జీవితంలో కొత్త అడ్వాంచర్. ఐ లవ్ యు. ప్రపంచంలో నన్ను సంతోషకరమైన మహిళాగా చేసినందుకు ధన్యవాదాలు" అని పేర్కొంది అమీ. దీనికి ముందు క్రిస్మస్ సందర్భంగా 'మేరీ మాస్. మా కొత్త ఇంట్లో మొదటి క్రిస్మస్' అని తెలిపింది. అమీ జాక్సన్ మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి 16 ఏళ్ల ప్రాయంలో అంటే 2009లో మిస్ టీన్ వరల్డ్ కాంపిటీషన్స్ విజేతగా నిలిచింది. తొలిసారిగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తమిళంలో రూపొందిన 'మద్రాసపట్టినమ్'లో చేసింది. ఆ తర్వాత హిందీ, తెలుగు, కన్నడ వంటి భాషల్లో ఆమె నటించింది. తాజాగా రజనీకాంత్‌తో కలసి '2.ఓ' రోబోగా చేసింది.


అమీ జాక్సన్, జార్జ్ పవయోటు

మా నాన్నలా ప్రోత్సహించారు

'వైదేహి' ట్రైలర్ ఆవిష్కరణలో ఏవీఎస్ తనయుడు రాఘవేంద్రప్రదీప్


ఎ. జననీ ప్రదీప్, పసుపులేటి రమారావు, ఎన్. శంకర్, రాఘవేంద్ర ప్రదీప్

నటుడు ఏవీయస్ జయంతిని పురస్కరించుని 'వైదేహి' చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. బుధవారం రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు కేక్ కట్ చేశారు. ఏవీఎస్ తనయులు ఎ.జననీ ప్రదీప్ నిర్మాత. ఎ.రాఘవేంద్రప్రదీప్ దర్శకుడు. యాక్టివ్ స్టూడియోస్ పతాకంపై ఎ.జి.ఆర్. కౌశిక్ సమర్పణలో రూపొందుతోంది.

దర్శకుడు మాట్లాడుతూ 'నాన్నగారిని గుర్తుచేసుకుంటూ ట్రైలర్ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉంది. నన్ను ప్రోత్సహించిన వారు చాలా మంది ఉన్నారు. మా నటీనటులు, టెక్నీషియన్లను చాలా ఇబ్బందిపెట్టాను. రాత్రింబవళ్లు షూటింగ్‌లు చేసేవాళ్లం. అయినా వారందరూ చిరునవ్వుతో పనిచేసేవారు. ఎన్.శంకర్ నాకు చాలా ఆత్మీయులు. ఆయన చేతుల మీదుగా మా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. మా బావగారు నాకు ఇచ్చే సపోర్ట్ మర్చిపోలేను. చాలా సందర్భాల్లో ఆయన మా నాన్నగారిలాగా నన్ను ప్రోత్సహిస్తున్నార'ని అన్నారు.


ఎన్.శంకర్ మాట్లాడుతూ 'ఏవీయస్ మంచి మిత్రులు. అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న వ్యక్తి. సినిమాలను, సాహిత్యాన్ని ఔపాసన పట్టిన వ్యక్తి. ఆయనలేని లోటు ఇండస్ట్రీలో ఉంది. 'తుత్తి, రంగు పడుద్ది' వంటి మేనరిజాలు ఆయన చాలా బాగా వాడేవారు. ఆయన తనయుడు రాఘవేంద్ర ప్రదీప్ తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్ బావుంది. ఇప్పుడు ఇలాంటి జోనర్‌లో తెరకెక్కిన సినిమాలు 90 శాతం హిట్ అవుతున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ తర్వాత ఏమిజరుగుతోందనే ఆసక్తికలిగేలా సినిమాను తెరకెక్కించడం బావుంది. ట్రైలర్‌లో ఆ ఉత్సుకత కనిపిస్తోందని చెప్పారు.

11 ప్రజాశక్తి
విజయవాడ
గురువారం 3 జనవరి 2019
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



పరిశీలన

ఒకనాడు నాటకాల్లో వేషాలు వేసినవాళ్లను సంఘం నుంచి వెలివెయ్యాలనే తీవ్ర ఛాందసత్వం ఉండేది. తరువాత నాటకాల్లోనూ, తద్వార అవకాశాన్ని బట్టి సినిమాల్లోనూ నటించడం ఒక ఫ్యాషన్ గానూ, ఘనతగానూ భావించే స్థాయికి మన సమాజంలో మార్పు వచ్చింది. అయితే కళాభిమానంలో 'బలుపు' కంటే 'వాపు' ఎక్కువైనట్టు అనుమానం కలుగుతోంది. ఎందుకంటే రాష్ట్రం నలుమూలలా ప్రదర్శిస్తున్న నాటికలనూ, నాటకాలనూ పరిశీలిస్తే చాలా సందర్భాల్లో 'రాశి'లో ఉన్న గొప్పతనం వాసి'లో కనిపించడం లేదు.

వర్తమాన నాటకం ఎలా ఉండాలి?

ఆధునికతకు ఆమడదూరం వెనకాల నత్తనడక నడుస్తున్న పౌరాణిక నాటకాల్ని మినహాయిస్తే ప్రస్తుతం ఆంధ్రనాటక రంగాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. ఒకప్పుడు గ్రామాల్లో వినాయకచవితి, విజయదశమి సందర్భాల్లో విస్తృతంగా నాటకాలు ప్రదర్శించేవారు. ఇవొక రకం. ఈ నాటకాలకూ, రికార్డింగ్ డ్యాన్సులకూ అంతగా తేడా ఉండదు. అశ్లీలమైన రెండర్థాల సంభాషణలూ, అపరాధ పరిశోధన కోసం హీరో మారువేషాలూ, ప్రస్తుతం మనం వింటున్న సినిమా పాటలతో పోటీపడే యుగళగీతాలూ – ఇలాంటి మసాలా అంతా ఈ నాటకాల్లో దర్శనమిచ్చేది.

ఇక రెండో రకం : సాధారణంగా చదువూ, సంస్కారం ఉండి ఏదో ఒక పరిషత్‌లో బహుమతులు పొందాలనే దీక్షతో నాటకాలు సాధన చేస్తున్నారు. వీరి నాటకాలు ఎక్కువగా పరిషత్తు పరిమితమైపోవడం వల్ల జనబాహుళ్యానికి దూరమవుతున్నాయి. ఈ పరిషత్ నాటకాల్లో కొన్ని సమాజాల తాలూకు ఆస్థాన రచయితలు తమకు తెలిసిన నటులను దృష్టిలో పెట్టుకుని, పాత్రలు సృష్టించడం కూడా జరుగుతుంది. అంటే ఆ నటుడు ఏ తరహా పాత్రను బాగా పోషించగలడో అలాంటి పాత్రను ముందుగా సృష్టించి, తర్వాత దానిచుట్టూ కథను అల్లుకుపోతున్నారు. నిజజీవితానికి సంబంధం లేని విలక్షణమైన పాత్రలనూ, విచిత్రమైన సన్నివేశాలనూ పరిషత్ నాటకాల్లో ప్రత్యక్షం చేస్తున్నారు.

మొత్తం మీద ఈ రెండు తరహా నాటకాలను పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా బోధపడుతుంది. నాటకానికి ప్రాణమైన ఇతివృత్తం గురించి ఎక్కువమంది రచయితలూ, కళాకారులూ అంతగా పట్టించుకోవడం లేదు. జీవిత వైరుధ్యాన్ని, వాస్తవిక దృక్పథంతో సజీవంగా చిత్రించిన గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' తర్వాత తెలుగులో గొప్ప నాటకాలు ఎన్ని వచ్చాయి? అని ప్రశ్నించుకుంటే జవాబు చాలా తేలికగా ఉంటుంది. ఒకనాడు 'మా భూమి' వంటి నాటకం ద్వారా ప్రజల్లో విప్లవ చైతన్యాన్ని రగుల్కొలిపిన 'ప్రజానాట్య మండలి' సంస్థ ఈ వేళ ఎక్కువగా పాటలకే పరిమితమైపోతోంది. మన సమాజంలో అన్నింటితో పాటు కళ కూడా వ్యాపార వస్తువుగా మారిపోవడం వల్ల మంచి నాటకాలు రాయగలిగిన రచయితలు చాలామంది సినిమా ఊబిలో కూరుకుపోయి, నాటకరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా ఓ మంచి నాటకం పుట్టినా అది పరిషత్తు ద్వారాలను దాటి ప్రజల మధ్యకు రాలేకపోతోంది.

పరిషత్తుల నిర్వాహకులు ప్రతి ఏటా కొత్త రచనలను మాత్రమే ప్రదర్శనా యోగ్యంగా ప్రకటించడం వల్ల అరుదుగా వస్తున్న మంచి నాటికలకూ, నాటకాలకూ ఒకటి రెండు సంవత్సరాల్లోనే నూరేళ్లూ నిండిపోతున్నాయి. ఇటీవల వచ్చిన హింసధ్వని, ఎడారి కోయిల, పక్కింట్లో పుట్టండి, సంపద, పుష్పక విమానం, ఒంటికాలి పరుగు, నత్వం శోచితుమర్హసి, సద్గతి, రేపటి శత్రువు, ప్రార్థన, జాతి స్మరామి, నల్లసముద్రం, ఓం, నరవాహనం లాంటి ఎన్నో మంచి నాటికలూ, నాటకాలూ ఎక్కువశాతం పరిషత్తులకే పరిమితమై పోయాయి. ఇక్కడ వెండితెర, బుల్లితెరల దెబ్బకు తల్లడిల్లుతున్న నాటక కళకు ఊపిరిపోసి, నిలబెడుతున్నవి కొంతవరకు ఈ పరిషత్తులే అనే విషయమూ మనం గమనించాలి.

కళను వ్యాపారంగా భావిస్తున్న కొంతమంది పరిషత్ నిర్వాహకులూ, కళారంగం పట్ల సరైన అవగాహనలేని న్యాయ నిర్ణేతలూ కూడా నాటకరంగం పతనానికి దోహదం చేస్తున్నారు. పరిషత్ పోటీల్లో పాల్గొంటున్న నాటక సమాజాలకు చెందిన నటులూ, రచయితలూ కొన్నిచోట్ల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సమాజాల మధ్య నెలకొన్న స్పర్ధల కారణంగా వీరి గుణ నిర్ణయాలు పక్షపాతంగా ఉండే అవకాశాలు ఎక్కువ. స్క్రూటినీ జడ్జీలు కూడా సమర్థులు కాకపోవడం వల్ల మంచి నాటకాలు తిరస్కరణకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నాటకరంగం గురించి అవగాహన ఉన్న వారినీ, నైతిక విలువలు పాటిస్తూ, ఏ ప్రలోభాలకూ లొంగని వారినీ – పరిషత్ నిర్వాహకులు న్యాయనిర్ణేతలుగా నియమిస్తే మరిన్ని మంచి నాటకాలు ప్రజలకు అందుతాయి.

ఈ మధ్య కాలంలో రచనాపరంగానూ, ప్రదర్శనా పరంగానూ ఉన్నత విలువలను సంతరించుకుని ఆంధ్రనాటక రంగంలో సంచలనం సృష్టించిన 'పడమటి గాలి' నాటకం ప్రదర్శించాలంటే– లక్షల్లో ఖర్చవుతుంది. అందుకే వ్యయభారం వల్ల అంతమంచి నాటకం అన్నిచోట్లా ప్రదర్శించటం సాధ్యం కావటం లేదు.

సమాజంతో సంబంధమూ, ప్రజల పట్ల బాధ్యత లేదనుకునే శుద్ధ కళావాదులు 'టెక్నిక్' పేరుతో ఇతివృత్తాన్ని నాశనం చేస్తున్నారు. అయితే నాటకంలో 'టెక్నిక్' పాత్రను తక్కువగానూ భావించకూడదు. అది ప్రేక్షకుడికి కథను మరింత బలంగా అందించడానికి దోహదం చెయ్యాలి.

గత దశాబ్దంలో తెలుగునాటక రంగంలో రెండు ముఖ్యమైన విషయాలు చోటుచేసుకున్నాయి. మొదటిది : నాటకరంగంలో కూడా ప్రభుత్వం నంది అవార్డులు ప్రవేశపెట్టడం. ప్రభుత్వరంగంలో సహజంగా జరిగే పైరవీలూ, సిఫారసులతో సినిమా నందుల ఎంపిక ఎంత హాస్యాస్పదంగా జరుగుతుందో అందరికీ తెలుసు. ఏవో ఒకటి రెండు సంవత్సరాలు మినహాయిస్తే సినిమా నందులు గొప్ప గందరగోళం సృష్టించాయి. నంది అవార్డులకు నాటకాల ఎంపికలోనూ, గుణ నిర్ణయ ఫలితాల ప్రకటనలోనూ కూడా అనేక అవకతవకలు జరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయి.

రెండో విషయానికొస్తే – అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుల్లో కొందరు నాటకాభిమానులు 'అప్పాజోస్యుల – విష్ణుభొట్ల–కందాళం ఫౌండేషన్' పేరుతో ఆంధ్రదేశంలోని వేరు వేరు ప్రాంతాల్లో ప్రతియేటా నాటక పోటీలు నిర్వహిస్తున్నారు. భారీ పారితోషికాలతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంలో వారిని అభినందించ వలసిందే! కానీ ఈ పరిషత్తు నిర్వహణలో కూడా అనేక లోటుపాట్లు దొర్లుతున్నాయి.

ఒక సంవత్సరం పోటీల్లో ప్రముఖ రచయితలు రచించిన కొన్ని కథలను ఎంపిక చేసి, వాటిని నాటికలుగా మలచి ప్రదర్శింపజేశారు. నాటక రచయితకు ఏదైనా మంచి కథ దొరికినప్పుడు స్పందించి, దానికి నాటకీకరణ చేస్తే బాగానే ఉంటుంది. కానీ 'ఫలానా కథలను నాటికలుగా మార్చండి'– అని నిర్దేశించడం వల్ల రచయితల్లో సృజనాత్మకశక్తి లోపించి, యాంత్రికంగా తయారవుతారు. పదిమంది కలిసి వండిన సినిమా కథకు రచయిత(లు) ఎవరో సంభాషణలు రాసినట్టుగా నాటక రచన కూడా కృతకంగా తయారవుతుంది.

కథలను నాటికలుగా మార్చేటప్పుడు మరో ఇబ్బంది కూడా ఎదురవుతుంది. రావిశాస్త్రి, బీనాదేవి లాంటి రచయితలు తమ కథల్లోని పాత్రలనూ, వాటి స్వభావాలనూ – ప్రవాహవేగంతో సాగే వర్ణనాత్మక శైలితో మన మనోనేత్రాల ముందు సాక్షాత్కరింపజేస్తారు. ఆ పాత్రలనూ, స్వభావాలనూ యథాతథంగా రంగస్థలం మీద ఆవిష్కరించడం చాలా కష్టం. అందుకే ఎడారి కోయిల, వరడు లాంటి రెండు మూడు నాటికలు తప్పించి, మిగిలినవన్నీ మూలకథకూ, పాత్రలకూ న్యాయం చెయ్యలేకపోయాయి. నాటకీకరణ చేసిన చాలామంది రచయితలు మూలకథలోని జీవనాడిని పట్టుకోలేకపోయారు.

మరో సంవత్సరం పోటీల్లో పౌరాణిక ఇతివృత్తాలను సాంఘిక నాటికలుగా మార్పు చేయించి, ప్రదిర్శంపజేశారు. ఆధునిక సమాజంలో మనం ఎంతమాత్రం అంగీకరించలేని తిరోగమన భావాలతోనూ, అసంబద్ధమైన సామాజిక ధర్మాలతోనూ, కృతకమైన సన్నివేశాలతోనూ నిండిన ఈ నాటికలు సమాజాన్ని సాధ్యమైనంత వెనక్కి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి.

పెద్దలు చెప్పినట్టు – కళారూపం ఏదయినప్పటికీ సమాజానికి మంచి చెయ్యకపోయినా ఫర్వాలేదు కానీ, చెడు మాత్రం చెయ్యకూడదు. మంచి నాటకం అంటే ప్రదర్శన చూసినప్పుడే కాకుండా – చదివినప్పుడూ మన ఆలోచనలను స్పందింపజేయాలి. ఆధునిక నాటకం మానవీయ విలువలను ప్రతిబింబించాలి. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపాలి. ప్రజల్లో మానసిక వికాసం కలిగించి, వారి భావాలను చైతన్యవంతం చెయ్యగలిగినదే ఉత్తమ నాటకం అవుతుంది. మంచి నాటకం సమాజాన్ని విమర్శనాత్మక వాస్తవిక దృష్టితో పరిశీలించి, అందులోని వ్యక్తుల జీవితాలకూ, కష్టసుఖాలకూ అద్దం పట్టాలి. వాస్తవ జీవితానికి దగ్గరగా ఉండే కథను, భాషను, భావాలను ప్రతిబింబించాలి. నాటక రచయితలకు సమాజం పట్ల సరైన అవగాహన ఉండాలి. రసజ్ఞత, మానవతా దృష్టి కావాలి. (ఈ రెండూ లోపించడం వల్లనే ఒకనాడు రివెంజ్, హారర్, ట్రాజెడీలు ఆంగ్లనాటక రంగాన్ని శాసించాయి.)

అలాగే, వాస్తవికత పేరుతో కళా ప్రమాణాలకు లోటు రానీయకూడదు. వాస్తవ జీవిత చిత్రణ కళలో అంతర్భాగం కావాలి. సామాజిక వాస్తవికత పేరుతో రచయిత తనకు మాత్రమే అనుకోకుండా తెలిసిన ఏవో ఒకటి రెండు విషయాలను సార్వజనీనంగా చిత్రించకూడదు. ఆ మధ్య ఒక నాటికలో కాముకుడైన ఉపాధ్యాయుడు తన దగ్గర ట్యూషన్ చెప్పించుకునే విద్యార్థిని క్రూరంగా అత్యాచారం చేస్తాడు. (ఈ సంఘటన ఎక్కడో నిజంగానే జరిగిందని రచయిత ఉద్ఘాటించాడు. ఆ వికృతమైన అంశాన్ని ఆధారంగా చేసుకుని మొత్తం ఉపాధ్యాయ లోకాన్ని భ్రష్టు పట్టించేటంత ఘోరంగా ఆ నాటికను తయారుచేశారు.) ఎదిగీ ఎదగని వయస్సులో ఉన్న అమ్మాయి స్కర్ట్‌లోకి చేతులు పోనిచ్చి, తొడల మీద తడమడంలాంటి జుగుప్సాకరమైన సన్నివేశాలతో ఆ నాటిక చెప్పదలచుకున్న అసలు విషయం పక్కదారి పట్టింది. అందుకే సామాజిక వాస్తవమంటే అత్యధిక సందర్భాల్లో సంభవించేదిగా ఉండాలి. కొంతమంది రచయితలు తమకు తెలిసిన విజ్ఞానం సర్వస్వాన్ని పాత్రల ద్వారా చెప్పించేస్తుంటారు. ఇది చాలా పొరపాటు. పాత్రోచితమైన సంభాషణలు, కథకు అనుగుణమైన సన్నివేశాల కల్పనల ద్వారా ఆయా పాత్రలను ఎంతో జాగ్రత్తగా నడుపుతూ నాటకాన్ని క్లైమాక్స్‌కు తీసుకెళ్ళాలి. పాత్రల పట్ల రచయితకు సరైన స్పృహ, అవగాహన లేకపోతే అవి అసహజంగా తయారై, రసాభాస చేస్తాయి.

రచయితలు సమాజంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. జీవితం ప్రగతి శీలమైనది. ఆ వేగాన్ని అందుకోలేని రచయిత వర్తమాన సమాజం పట్ల సరియైన దార్శనికతను కోల్పోతాడు. ఒకనాడు అవసరంగానూ, ప్రయోజనకరంగానూ ఉన్న ఇతివృత్తం ఈ రోజు పనికి రాకపోవచ్చు. రచయిత సమాజంతో పాటు ముందుకు నడవాలి. సమాజ పరిణామ వేగాన్నీ దాటిపోయి భవిష్యద్దర్శనం చెయ్యగలవారు మహా రచయితలవుతారు. సృజనాత్మక ప్రతిభ కలిగిన అలాంటి రచయితలూ, దర్శకులూ, నటీనటులూ సహృదయంతో ప్రయత్నిస్తే మనకూ గొప్ప నాటకాలు వస్తాయి. అలాంటి రచయితలూ, కళాకారులూ తమ కలాలనూ, గళాలనూ మేళవించిన నాడే ప్రస్తుతం నెలకొన్న అస్తవ్యస్థ క్షణాల నుంచి ఆంధ్రనాటక రంగానికి విముక్తి లభిస్తుంది.

- అదృష్టదీపక్
ప్రముఖ నాటకరంగ విమర్శకులు

జానపదం

సంక్రాంతి సందళ్లలో గంగిరెద్దు

గంగిరెద్దులాట ఒక ప్రాచీన జానపద కళారూపం. సంక్రాంతి సీజన్లో తెలుగు సాంప్రదాయాలకు గుర్తు సన్నాయి అప్పన్న, ప్రజలకు సన్నాయి పాటలు వినిపిస్తూ... డోలు కొట్టి, శిక్షణ ఇచ్చిన గంగిరెద్దును పట్టుకొని తిరిగే గందిరెద్దులోళ్ల జీవితాలు చీకటిమయమయ్యాయి. వారి బతుకుల్లో సంక్రాంతులే లేవు.

డూ డూ బసవన్నా ఇటురారా బసవన్నా
వురుకుతు రారన్నా రారన్న బసవన్నా
అమ్మవారికీ దండం బెట్టు అయ్యగారికీ దండం బెట్టు
మునసబు గారికి దండంబెట్టూ
కరణం గారికి దండంబెట్టూ
రారా బసవన్నా, రారా బసవన్నా.... అంటూ

ఈ ఇంటికి మేలు జరుగుతాదని చెప్పు, మంచి జరుగుతాదని చెప్పు అంటూ గంగిరెద్దులతో తలలను ఊపిస్తారు.

ప్రాచీన కళారూపం

'గంగిరెద్దుల వాడు కావరమణచి/ ముకుతాడు పొడిచి పోటెద్దులట్లు' అని పలనాటి వీర చరిత్రలో శ్రీనాథుడు ఉదహరించడాన్ని బట్టి ప్రాచీనకాలం నుంచీ ఈ గంగిరెద్దాటలు ప్రచారంలో ఉన్నాయని తెలుస్తుంది.

గంగిరెద్దుల వారు, రెండు మూడు కుటుంబాలు కలిసి ఐదారు అందమైన గంగిరెద్దులతో దండుగా బయలుదేరి, గ్రామాల్లో మకాములు వేస్తూ జీవయాత్రలు చేస్తారు. ఒకనాడు దేదీప్యమానంగా వెలిగిన గంగిరెద్దాట తరువాత యాచకవృత్తిగా మారింది. అయినా, అదొక వినోద ప్రక్రియగా ప్రజలను ఆనందింప జేసే కళారూపంగానూ ఖ్యాతి వహించింది.

ఎద్దుకు ఆట నేర్పడం

గంగిరెద్దులవారు తొలుత వయసులో ఉన్న కోడెగిత్తల్ని తీసుకువచ్చి, ముకుతాడు పొడిచి వాటి పొగరుబోతుతనాన్ని అణగగొట్టి, వాటిని లొంగదీసుకుని, చెప్పినట్టు చేసేలా తయారు చేసేవారు. సర్కస్ జంతువులకు తర్ఫీదు ఇచ్చినట్లు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇలా వాటిని కొన్ని మాసాల పాటు మచ్చిక చేసుకునేవారు. వాయిద్యానికి అనుకూలంగా అడుగులు వేయించటం, పరిగెత్తించటం, పడుకోబెట్టటం, అటూ ఇటూ దొర్లటం, మూడు కాళ్ళ మీద నుంచో పెట్టటం, చిట్టి అడుగులతో నృత్యం చేయటం, డూడూ బసవన్నా, రారా బసవన్నా అంటూ వాటిని పరుగులు పెట్టించటం, కొన్ని ప్రశ్నలు వేసి వాటికి సమాధానంగా తల ఊపించటం, సలాం చేయించటం ... ఇలా ఎన్నో విద్యల్ని కొన్ని మాసాల పాటు నేర్పి, వీధిలోకి తీసుకువస్తారు.

గంగిరెద్దుల అలంకారం

ఆ కళాకారులు గంగిరెద్దుల్ని తమ బిడ్డల్లా చూస్తారు. వాటిని ఎన్నో రకాలుగా అలంకరిస్తారు. మూపురం వద్ద నుంచి తోక వరకూ ఎంతో అందంగా రంగురంగులతో కుట్టిన బొంతను కప్పుతారు. రంగులతో కొమ్ములను అలంకరిస్తారు. కొమ్ము చివర ధగధగ మెరిసే ఇత్తడి గొట్టాలను తొడుగుతారు. మూతికి తోలుతో కుట్టబడిన శికమారును కడతారు. నొసటిభాగాన అందమైన తోలు కుచ్చులను కడతారు. మూపురాన్ని రంగు పంచెతో అలంకరించి, ఒక దండను దిగ వేస్తారు. పొట్ట చుట్టూ తగరపు పువ్వులతో కుట్టిన తోలు బెల్టును కడతారు. కాళ్ళకు గజ్జెలు కడతారు.

ఎద్దును ఆడించే కళాకారులూ ప్రత్యేకంగా తయారవుతారు. శ్రుతి సన్నాయి బూర, డోలు, చేతిలో కంచుతో చేయబడిన చిన్న చేగంట, వేషధారణలో నెత్తికి రంగుల తలగుడ్డ మూతిమీద కోర మీసాలు, చెవులకు కమ్మల జోడు, వారు వీరు ఇచ్చిన పాత కోటు, భుజంమీద కండువా, చేతికి వెండి మురుగులు, నుదురున పంగనామంతో సైకిల్ పంచ కట్టుకట్టి ఆకర్షణీయంగా తయారౌతారు.

సుందర ప్రదర్శనలు

గంగిరెద్దుల వారికి ప్రతి ఊరిలోనూ మధ్యనున్న పెద్ద బజారే వారికి రంగస్థలం. ముందుగా గ్రామంలో ప్రవేశించి, గ్రామ పెద్దల అనుమతితో ప్రదర్శన ఏర్పాటు చేసుకుంటారు. వారి వాయిద్యాలతో రణగొణ ధ్వనులు చేసి, ప్రజలను రప్పిస్తారు. ఆ రోజుల్లో మహదానందంతో ప్రేక్షకులందరూ మూగిన తరువాత గంగిరెద్దులను మేళతాళాలతో బరినంతా తిప్పుతూ స్వాగతం పలికిస్తారు. ఎద్దు నోటిలో మెడను ఇరికించి, ఆ దృశ్యాన్ని అందరికీ చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెల కాళ్ళతో నృత్యం చేసేది, పడుకోమంటే పడుకునేది, లేవమంటే లేచేది. అయ్యగారికి దండం పెట్టమంటే నమ్రతతో తలవంచేది. అయ్యగారికి శుభం కలుగుతుందా? అనుకున్న పనులు జరుగుతాయా అంటే అవునన్నట్టు తల ఊపుతుంది. అందుకూ అడిగిన ప్రతిదానికీ తల ఊపడాన్ని బట్టే – గంగిరెద్దులా తలూపాడు అనే సామెత పుట్టింది.

యాచక వృత్తిగా మారిన కళ

కొన్ని తరాల కిందటి వరకూ ప్రజలు గంగిరెద్దుల వారిని ఆదరించి బట్టలు, భత్యం, డబ్బులు ఇచ్చి చనిపోయిన తాత తండ్రుల పేరు మీద పొగిడించేవారు. గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో గంగిరెద్దు విన్యాసాలు చేయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఊరంతా గంగిరెద్దు తిప్పినా పూట గడవని పరిస్థితి. పూర్వపు రోజుల్లో మొక్కుకున్న గంగిరెద్దు ప్రజలు ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు సింహాచలం దేవస్థానంలో మాత్రం గంగిరెద్దు వేలం పాడుకొని, కొనుక్కోవలసి ఉంటుంది. ఆ ఆర్థిక స్థోమత గంగిరెద్దుల వారికి ఉండదు. సింహాద్రి అప్పన్న పేరు మీద, భద్రాచల రాముని పేరు మీద, తిరుపతి వెంకన్న పేరు మీద, వేములవాడ రాజరాజేశ్వరి పేరుమీద గంగిరెద్దును తిప్పే కళాకారులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నారు. వారికి ఆయా దేవస్థానాలు ఉచితంగా ఎద్దులను ఇవ్వడం సముచితం. సంక్రాంతి రోజులకు ముందుగానే ఒక శోభ, సందడి తీసుకురావటంతో– ఈ కళాకారులు కీలకపాత్ర పోషించారు. వీరిని ఒక సాంస్కృతిక వారథులుగా ప్రభుత్వాలు గుర్తించాలి. తగిన ఆదరణ, సహాయం అందిస్తూ ఆదుకోవాలి.

- కృష్ణ



బ్యాంకుల విలీనానికి ఆమోదం

ఒకే చత్రం కిందకు విజయబ్యాంక్, దేనా బ్యాంక్, బిఒబి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

బ్యాంకుల విలీనాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ మోడీ సర్కార్ మరో మూడు బ్యాంకుల ఏకీకరణకు పచ్చ జెండా ఊపింది. విజయ బ్యాంక్, దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) విలీనానికి బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బ్యాంకుల విలీనంపై బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగులు, ఆర్థిక విశ్లేషకుల నుంచి తీవ్ర విమర్శలు, ఆందోళనలు, సమ్మెలు ఎదురైతున్నప్పటికీ మోడీ సర్కార్ మొండిగా మరో విలీనానికి తెర లేపడం గమనార్హం. మూడు బ్యాంకుల విలీనానికి మంత్రివర్గం అమోదం తెలిపిందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వెల్లడించారు. విలీనంతరం ఆవిర్భవించే బ్యాంకు దేశంలోనే మూడో అతి పెద్ద బ్యాంక్‌గా అవతరించనుందన్నారు. ఇండియన్ బ్యాంకింగ్ వ్యవస్థలో మూడు బ్యాంకుల విలీనం అనేది ఇదే ప్రథమం. విలీనం అనంతరం విజయ బ్యాంక్, దేనా బ్యాంక్ ఉద్యోగులు అందరూ బ్యాంక్ ఆఫ్ బరోడాకు బదిలీ అవుతారని పేర్కొన్నారు. ఈ మూడింటి విలీనం వల్ల ఏర్పడే కొత్త బ్యాంకు ఎస్‌బిఐ, ఐసిఐసిఐ తర్వాత దేశంలోనే మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనున్నారు.

బ్యాంకుల విలీన ప్రక్రియలో ఉద్యోగుల తొలగింపు ఉండదని స్పష్టం చేశారు. విలీనం వల్ల సదరు బ్యాంకు ఉద్యోగుల సర్వీసుపై ఎటువంటి ప్రభావం చూపబోదని మంత్రి పేర్కొన్నారు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో ఐదు అనుబంధ బ్యాంకులు విలీనం తర్వాత మరో విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ విలీనం వల్ల బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులకు లాభాలు చేకూరతాయన్నారు. విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంక్‌లో సుమారు 85వేల మందికి పైగా ఉద్యోగులుంటారు. దేశ, విదేశాల్లో కలిపి దానికి 9,485 శాఖలు ఏర్పడతాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి ఈ విలీనం అమల్లోకి వస్తుంది.

షేర్ల పంపిణీ ఇలా..

బ్యాంక్ ఆఫ్ బరోడా, దేనా బ్యాంక్ బోర్డులు తాజాగా విలీనానికి సంబంధించి పలు కీలక అంశాలకు సమ్మతి తెలిపాయి. షేర్ల స్వాప్ రేషియో ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీని ప్రకారం.. దేనా బ్యాంక్ వాటాదారులు 1,000 షేర్లకు గానూ రూ.2 ముఖ విలువ కలిగిన 110 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు పొందనున్నారు. ఇక విజయ బ్యాంక్ వాటాదారులకు ప్రతి 1,000 షేర్లకు గానూ 402 బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు లభించనున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్లో విజయా బ్యాంక్, దేనా బ్యాంకులను బ్యాంక్ ఆఫ్ బరోడాతో విలీనం చేయాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. దీనిని బ్యాంక్ అధికారుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. ఇదే అంశంపై క్రితం డిసెంబరు మాసాంతంలో బ్యాంక్ ఉద్యోగులు సమ్మె బాట కూడా పట్టారు. అయినా మోడీ సర్కారు వీటిని పట్టించుకోకుండా ముందుకు సాగడం గమనార్హం.

డిపాజిట్లలో టాప్ 2..

బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయ బ్యాంక్, దేనా బ్యాంకుల విలీనం తరువాత ఆ బ్యాంక్ దేశంలోనే డిపాజిట్ల పరంగా రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. దాదాపు 27.1 లక్షల కోట్ల డిపాజిట్లతో ఎస్‌బిఐ అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు విలీనం తరువాత 8.6 లక్షల కోట్ల డిపాజిట్లతో బిఒబి రెండో అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థగా మారనుంది. రుణాల పరంగా.. విలీనం తరువాత అత్యధికంగా రుణాలను జారీ చేసిన బ్యాంకుల జాబితాలలో బిఒబి మూడో స్థానంలో నిలవనుంది. దాదాపు 20.5 లక్షల కోట్లతో ఎస్‌బిఐ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. 6.6 లక్షల కోట్ల రుణాలతో హెచ్‌డిఎఫ్‌సి రెండో స్థానంలోను.. బిఒబి 6.1 లక్షల కోట్లతో మూడో స్థానంలోను నిలవనున్నాయి. శాఖల పరంగా.. విజయ, దేనా బ్యాంకుల విలీనం తరువాత బిఒబి మొత్తం 9,485 శాఖలతో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. 22,414 శాఖలతో ఎస్‌బిఐ అగ్రస్థానంలో ఉంది.

వైద్య ఖర్చుపై సర్కారు బడాయి

- దేశ సగటు కంటే తక్కువగా బడ్జెట్ కేటాయింపు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలు వైద్యసేవలకు వెచ్చించే మొత్తాన్ని ఈ నాలుగేళ్లలో రూ. 5770 నుంచి రూ. 587 కు తగ్గించామని రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రంలో పేర్కొన్నది అర్ధ సత్యం లేదా అసత్యమని వాస్తవాలు పరిశీలిస్తే బోధపడుతుంది. పలు అంశాల్లో దక్షిణాది రాష్ట్రాలతో పోల్చిచూస్తే వెనుకంజలోనే ఉందని, బడ్జెట్‌లో సరిపడా కేటాయింపులు లేవని, జిఎస్‌డిపిలో కనీసం ఒక్క శాతం కూడా లేవని పలు విమర్శలున్నాయి. మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో వైద్యం, ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు దేశ సరాసరి కంటే తక్కువే. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వ ఖర్చులో వైద్యఆరోగ్య రంగానికి 4.6 శాతం ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్రాల బడ్జెట్ పరిశీలన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వైద్య ఆరోగ్య రంగానికి దేశంలోని అన్ని రాష్ట్రాల సరాసరి కేటాయింపు 4.8 శాతం కావడం గమనార్హం. కేరళ 5.3 శాతం కేటాయిస్తూ దేశంలోనే ముందంజలో ఉంది. వైద్యఆరోగ్య శాఖకు వివిధ రంగాలలో 55 రకాల అవార్డులు వచ్చాయని గొప్పగా చెబుతున్నప్పటికీ ఆరోగ్య సూచిలో నీతిఆయోగ్ రాష్ట్రానికి 8వ ర్యాంకును ఇచ్చింది. శిశు మరణాల రేటులో దక్షిణాది రాష్ట్రాల కంటే వెనుకంజలో ఉన్నట్లు జాతీయ ఆరోగ్య సూచీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. . రక్తహీనత సమస్య కూడా దేశ సరాసరి కంటే రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంది. ఈసమస్యతో ఉన్న ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల శాతం దేశవ్యాప్తంగా 58.4 శాతం ఉంటే, రాష్ట్రంలో 58.6 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే సమస్యతో గర్భిణులు దేశ సరాసరి 50.3 శాతం ఉంటే, రాష్ట్రంలో 52.9గా ఉంది. రక్తహీనత సమస్య ఉన్న గర్భిణిలు తెలంగాణలో 49.8 శాతం, తమిళనాడులో 44.4, ఒడిశాలో 47.6, కర్ణాటకలో 45.4 శాతం ఉన్నారు. భారత వైద్య ప్రమాణాల ప్రకారం ప్రతి 30 వేల మంది జనాభాకు ఒక పిహెచ్‌సి, 1.2 లక్షల జనాభాకు ఇక సిహెచ్‌సి అందుబాటులో ఉండాలి. కాని రాష్ట్రంలో ఆమేరకు ఎక్కడా లేవు. 2016 జాతీయ గ్రామీణ ఆరోగ్య గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 10,236 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండాల్సిఉంటే రాష్ట్రంలో ప్రస్తుతం 7,659 కేంద్రాలున్నాయి. అలాగే 423 సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సిహెచ్‌సి) లకుగానూ ప్రస్తుతం 299 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఫిజిషియన్లు 80 శాతం, జనరల్ సర్జన్లు 95 శాతం, గైనకాలజిస్టులు 71 శాతం, చిన్నపిల్లల వైద్యులు 76 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక గ్రామీణ, గిరిజన ప్రాంతా ల్లో ప్రజలకు వైద్య సేవలు అందించే మేల్ హెల్త్ వర్కర్ల పోస్టులు 4800 ఉంటే ప్రస్తుతం 2505 మంది పనిచేస్తున్నారు. అలాగే ఎఎన్‌ఎమ్ పోస్టులు 20వేలకు గాను ప్రస్తుతం 4 వేల వరకు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నాలుగేళ్లలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ల నియామకాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయగా వాటిలో డైరెక్టరేట్ పరిధిలో 1076 పోస్టులు, డిఎంఇ పరిధిలో 95 పోస్టులున్నాయి. అయితే వాటి నియామకాలకు అంగీకరిస్తూ అక్టోబర్‌లో ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటికీ డిఎంఇ మినహా మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఇక ఆయుష్ డిస్పెన్సరీల్లో దాదాపు 200 మెడికల్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విభాగాన్ని ప్రభుత్వం గత నాలుగేళ్లలో దాదాపు నిర్వీర్యం చేసింది. అయినా ప్రజల వైద్య ఖర్చు తగ్గించామనడం చంద్రబాబు సర్కారుకు తగునా!

గత నాలుగేళ్లలో వైద్యఆరోగ్య శాఖకు కేటాయించిన బడ్జెట్ (రూ. కోట్లలో), ఏటా తలసరి వెచ్చింపులు (రూ.)

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపు	శాతం	తలసరి వైద్యఖర్చు (సుమారు)
2015-16	5069.02	4.5	1023
2016-17	5764.16	4.7	1164
2017-18	7020.63	4.3	1418
2018-19	8463.5	4.6	1710

నేషనల్ హెల్త్ ప్రొఫైల్ గణాంకాల ప్రకారం శిశుమరణాల రేటు, రక్త హీనత శాతం

రాష్ట్రం	శిశుమరణాల రేటు	గర్భిణుల్లో రక్తహీనత
ఆంధ్రప్రదేశ్	34	52.9
తెలంగాణ	31	44.4
తమిళనాడు	17	49.8
కర్ణాటక	24	45.4
కేరళ	10	22.6
దేశ సరాసరి	34	50.3

ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించొచ్చు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫించనుదారులు తప్పనిసరిగా జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించొచ్చని ప్రభుత్వ కార్యదర్శి పియూష్ కుమార్ మెమో జారీచేశారు. ఈ సేవలు ఉపయోగించుకున్నందుకు ఫించనుదారులే కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సబ్ ట్రెజరీలు, డిస్ట్రిక్ ట్రెజరీల్లో కూడా ఫించనుదారులు డిజిటల్ జీవన పత్రాల్ని సమర్పించవచ్చని పేర్కొన్నారు. వేలిముద్రలు పడనివారు ఐరిస్ స్కానర్ల ద్వారా జీవనపత్రాన్ని సమర్పించొచ్చని తెలిపారు. ఐరిష్ కూడా అందుబాటులో లేకపోతే సబ్ ట్రెజరీ, ఫించను తీసుకునే బ్యాంకు పరిధిలో గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన పత్రాన్ని సమర్పించాలని తెలిపారు.

యువనేస్తంలో మానవ ప్రమేయం ఉండదు

'యువకష్టం'పై ప్రభుత్వ వివరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువనేస్తం రిజిస్ట్రేషన్‌లో మానవ ప్రమేయం ఉండదని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్, పరిశీలన, ఎంపిక అంశాలు కేవలం వెబ్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక అప్పటికప్పుడే తెలిసేలా ఈ పోర్టల్‌ను రూపొందించామని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ వై భాను ప్రకాష్ తెలిపారు. యువనేస్తం పథకం కింద రాష్ట్రంలో నిరుద్యోగులకు రూ.1000 చొప్పున భృతిని ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. అర్హులకు నిరుద్యోగ భృతి అందలేదని ప్రజాశక్తి పత్రికలో 2018 డిసెంబర్ 25న 'యువకష్టం'పేరుతో వచ్చిన వార్తపై భానుప్రకాష్ వివరణ ఇచ్చారు. అభ్యంతరాలను పోర్టల్‌లోనే నమోదు చేసుకోవచ్చునని, ప్రతి ఫిర్యాదునూ సంబంధిత నోడల్ అధికారి పరిశీలించి, వారంలోపు పరిష్కరించాల్సి ఉందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారే అర్హు లని, నమోదుకు ప్రజాసాధికార సర్వేను ప్రాతిపదికగా తీసుకున్నా మని తెలిపారు. అభ్యర్థుల ఇపిఎఫ్, ఇఎస్‌ఐ తదితర వివరాలు సేకరించి వారిని అనర్హులుగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. యువనేస్తం లబ్ధిదారులు ప్రతి నెలా వారి సమీపంలోని కేంద్రాల్లో తప్పక వేలిముద్ర వేయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ప్రతి నెలా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

అచ్రేకర్ కన్నుమూత



ముంబయి: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గురువు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్(87) బుధవారం సాయంత్రం ముంబయిలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. భారతరత్నం సచిన్‌కు క్రికెట్‌లో ఓనమాలు దిద్దించిన అచ్రేకర్ వృద్ధాప్యంతో కన్నుమూశారు. ఈ విషయాన్ని అచ్రేకర్ కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. 1932లో జన్మించిన అచ్రేకర్ 1943లో క్రికెట్ ఆడటం ప్రారంభించి 1945లో న్యూ హిందూ స్పోర్ట్స్ క్లబ్ తరపున ఆడారు. యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మోహర్ మిల్స్, ముంబయి పోర్ట్‌కు ప్రాతినిథ్యం వహించారు. 1963-64 మొయిన్‌ద్దౌలా టోర్నీలో ఆల్ ఇండియా స్టేట్ బ్యాంకు జట్టు తరపున హైదరాబాద్‌పై ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. ఆ తర్వాత ముంబయిలోని శివాజీ పార్క్ వద్ద కామత్ స్మారక క్రికెట్ క్లబ్‌ను అచ్రేకర్ ప్రారంభించి ఎంతోమందికి క్రికెట్ ఓనమాలు నేర్పారు. ప్రస్తుతం ఈ క్లబ్‌ను అచ్రేకర్ కుమార్తె కల్పన, అల్లుడు దీపక్ నిర్వహిస్తున్నారు. అచ్రేకర్‌కు ఘనకీర్తి తెచ్చిపెట్టింది మాత్రం సచిన్ టెండూల్కరే. వినోద్ కాంబ్లి, ప్రవీన్ ఆమ్రే, సమీర్ దిఘె, బల్విందర్ సింగ్ సంధు, అజిత్ అగార్కర్ వంటి క్రికెటర్లకు ఆయన శిక్షణ నిచ్చారు. పద్మశ్రీ పురస్కారం గ్రహీత అచ్రేకర్‌కు సచిన్ ప్రియశిష్యుడు. ఆయనను తన మార్గదర్శకునిగా సచిన్ ఎన్నోసార్లు చెప్పారు. ప్రతి గురుపౌర్ణమికి ఆయన ఇంటికి వెళ్లి గురుదక్షిణగా శాలువా కప్పి సత్కరించేవారు.

నయా చరిత్రకు మెట్టు దూరంలో

- నేటినుంచి నాల్గో టెస్ట్
- ఉదయం 5.00 గం॥ల నుంచి సోనీ సిక్స్

సిడ్నీ: కోహ్లి సారథ్యంలోని టీమిండియా నయా చరిత్ర సృష్టించడానికి మెట్టు దూరంలో నిలిచింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యతలో టీమిండియా సిడ్నీ మైదానంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ఆఖరి టెస్ట్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. గత పర్యటనల్లో టీమిండియా ఈ మైదానంలో ఒక్కసారి మాత్రమే టెస్టుల్లో విజయాన్ని నమోదు చేసుకోగల్గింది. కోహ్లి సారథ్యంలోని టీమిండియా అన్ని విభాగాల్లో ఆసీస్‌కంటే పటిష్టంగా ఉన్నా ఏమాత్రం అజాగ్రత్త వహించినా ఆతిథ్య జట్టు రెచ్చిపోయి సిరీస్ సమం చేసే అవకాశముంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68